నవచేతన పబ్లిషింగ్ హౌస్
దశాబ్దకాలం వెదజల్లిన విజ్ఞానం, సాహిత్యం
2015
11th Anniversary
NBH
www.navachethanabooks.in
Navachethana Vignana Samithi
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్), హైదరాబాద్-68. ఫోన్:040-29884453/54

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

ఎన్నికలప్పుడే ప్రతిపక్ష నేతలపై దాడులా? 05
జి రామ్ జి చట్టాన్ని వెంటనే రద్దుచేయాలి 03
అంతరాలు లేనినిర్మాణమే సిపిఐ ధ్యేయం 03

సంపుటి 09, సంచిక: 44 | ఆదివారం | 11-01-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



అక్రిడిటేషన్ జిఒలో

## మార్పులు చేర్పులు చేస్తాం

02

అక్రిడిటేషన్ల జారీ మార్గదర్శకాల విషయంలో జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారని, వారు ప్రస్తావించిన అంశాలను విజ్ఞప్తులను పరిశీలించి సానుకూలమైన నిర్ణయం తీసుకుంటామని, జిఓ 252లో మార్పులు చేర్పులు చేస్తామని సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల అంశంపై సిఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు ఎటువంటి కోర్టు అడ్డంకులు లేని విధానాన్ని రూపొందిస్తామన్నారు.



రోబో శునకాలతో

## ఓట్ల వేట

05

మహారాష్ట్రలోని పుణె, పింప్రి-చించ్వాడ్ సహా 29 మున్సిపల్ కార్పొరేషన్లకు జనవరి 15న పోలింగ్ జరగనుం ది. ఈ నేపథ్యంలో ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు మునుపెన్న డూ లేని విధంగా అత్యాధునిక సాంకేతికతను వాడుతున్నాయి.

# పద పద.. పల్లెకు పోదాం

## సొంతూళ్లకు పయనమైన పట్నం వాసులు



- ప్రయాణికులతో క్రిక్కిరిసిన బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్లు
- హైదరాబాద్‌-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ
- రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న చోట్ల నెమ్మదిగా కదిలిన వాహనాలు
- ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాల్సిందిగా పోలీసుల సూచన
- సరిపడా బస్సులు లేక ప్రైవేట్ వెహికల్స్‌ను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

ప్రజాపక్షం/హైదరాబాద్

పల్లెకు పోదాం చలో చలో.. పండుగ చూద్దాం చలో చలో అంటూ పట్నం వాసులు సొంతూళ్లకు పయనమవుతున్నారు. దీంతో బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. విద్యాసంస్థలకు సంక్రాంతి సెలవులు ప్రకటించడం, ఉద్యోగులకు వారాంతపు సెలవులు కలిసి రావడంతో నగరంలో నివసిస్తున్న ప్రజలు సంక్రాంతి సంబురాలను తమ సొంత ఊళ్లలో జరుపుకునేందుకు పల్లెకు పయనమయ్యారు. సొంతూళ్లకు వెళ్లేవారితో హైదరాబాద్‌-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ క్రమంగా పెరుగుతోంది. శనివారం ఉదయం నుంచే హైవేపై దారి పొడవునా వాహనాలు బారులు తీరాయి. చౌటుప్పల్, పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న చోట్ల వాహనాలు నెమ్మదిగా సాగుతున్నాయి. మరోవైపు వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాల్సిందిగా పోలీసులు సూచిస్తున్నారు. భువనగిరి, రామన్నపేట మీదుగా చిట్యాలకు చేరుకోవాలని గుంటూరు, ఒంగోలు వైపు వెళ్లేవారు సాగర్ హైవే మీదుగా వెళ్లాలని అధికారులు సూచించారు. శుక్రవారం నుంచే ఎంజిబిఎస్, కూకట్‌పల్లి, దిల్‌సుఖ్‌గర్, ఎల్‌బినగర్ బస్టాండ్లు రద్దీతో కిటకిటలాడాయి. సొంతూళ్లకు వెళ్తున్న వారితో బస్సులు నిండిపోయాయి. రద్దీకి అనుగుణంగా టిజిఎస్ఆర్‌టిసి అదనపు బస్సులు నడుపుతున్నా సరిపోవడం లేదని తరువాయి 2లో



కేంద్ర బడ్జెట్ తయారీలో

# రాష్ట్రాల భాగస్వామ్యం




- ఈ చర్య సహకార సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేస్తుంది
- వికసిత్ భారత్ లక్ష్య సాధనలో సహాయపడుతుంది
- కేంద్ర రాష్ట్రాల సమన్వయం ద్వారానే దేశం పురోగమనం
- తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయండి
- కేంద్ర ప్రీ బడ్జెట్ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కోరారు. న్యూఢిల్లీలో శనివారం ప్రీ బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఒక దేశం కేంద్ర రాష్ట్రాల సమన్వయం ద్వారానే పురోగమిస్తుందని, కేంద్ర బడ్జెట్ తయారీలో రాష్ట్రాలను భాగస్వామ్యం చేయడం ముఖ్యమైన చొరవ అని, ఇది సహకార సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేస్తుంది. అభివృద్ధి చెందిన భారతదేశం (వికసిత్ భారత్) లక్ష్యాన్ని సాధించడంలో సహాయపడుతుందని విశ్వసిస్తున్నామన్నారు. 2047 నాటికి దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే భారత ప్రభుత్వ లక్ష్యం అభినందనీయమని, ప్రస్తుతం దేశ జిడిపిలో తెలంగాణ వాటా 5.1 శాతమని, తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించామని, దీని ద్వారా తెలంగాణను తరువాయి 2లో



సిపిఐ వందేళ్ల ఉత్సవాల ముగింపు

లక్షలాది మందితో.. ఖమ్మంలో

# 18న భారీ సభ

- సిఎం రేవంత్‌రెడ్డితో పాటు హాజరుకానున్న పలువురు వామపక్ష పార్టీల అగ్రనాయకులు
- సుమారు 40 దేశాలకు చెందిన ప్రతినిధులు రాక
- జర్నలిస్టుల 'ఇష్టాగోష్ఠి'లో వివరాలు వెల్లడించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని
- ప్రజలు ఇప్పటికీ కమ్యూనిస్టులనే గుర్తు చేసుకుంటున్నారు : పల్లా వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) వందేళ్ల ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈ నెల 18న ఖమ్మంలోని ఎస్ఆర్‌బిజిఎన్ఆర్ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో మధ్యాహ్నం 3 గంటలకు లక్షలాది మందితో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్టు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివ రావు చెప్పారు. ఈ సభకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డితో పాటు వామపక్ష పార్టీల అగ్ర నాయకులు, సుమారు 40 దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరుకానున్నారని వివరించారు. భారతదేశంలో కమ్యూనిజం ఎక్కడ ఉన్నదనే వారికి 'సిపిఐ ఖమ్మం బహిరంగ సభ' ఒక రుజువుగా నిలువనుందన్నారు. సిపిఐ వందేళ్ల ఉత్సవాల నేపథ్యంలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి తరువాయి 2లో

'టెక్నాలజీ' డిగ్రీలకే


# పరిమితమవ్వొద్దు

- దేశ సేవ, ఆత్మ నిర్భరతకు ఉపయోగపడాలి
- తెలంగాణ 'గ్లోబల్ ఇన్నోవేషన్ క్యాపిటల్'గా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ సంకల్పం
- గేమ్ చేంజర్‌గా తెలంగాణ ఎఐ ఇన్నోవేషన్ హబ్, ఎఐ యూనివర్సిటీ
- బిట్స్ అల్యూమ్ని అసోసియేషన్ 'గ్లోబల్ మీట్'లో మంత్రి శ్రీధర్ బాబు



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణను గ్లోబల్ 'ఇన్నోవేషన్ క్యాపిటల్'గా తీర్చిదిద్దాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. టెక్నాలజీ కేవలం డిగ్రీలకే పరిమితం కాకుండా, దేశ సేవకు, ఆత్మ నిర్భరతకు ఉపయోగపడాలన్నారు. బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్‌లో శనివారం నిర్వహించిన 'బిట్స్ అల్యూమ్ని అసోసియేషన్ 'గ్లోబల్ మీట్‌–2026'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఇతర దేశాలు ప్రైవేట్ గుత్తాధిపత్యాన్ని ప్రోత్సహిస్తే, భారత్ మాత్రం ఆధార్, యూపిఐ వంటి 'డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' ద్వారా ప్రపంచానికి దిక్సూచిగా నిలిచిందన్నారు. దేశంలోనే తొలిసారిగా అందుబాటులోకి తీసుకొచ్చిన ఎఐ ఆధారిత 'తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్' పరిశోధనలకు గొప్ప ఊతమిస్తోందన్నారు. త్వరలో ప్రారంభించనున్న 'తెలంగాణ ఎఐ ఇన్నోవేషన్ హబ్', 'ఎఐ యూనివర్సిటీ'లు గేమ్ ఛేంజర్‌గా మారి ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలుస్తాయన్నారు. ప్రస్తుత ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ యుగంలో 'ఇంటలిజెన్స్' కంటే కోఆర్డినేషన్ అత్యంత ఖరీదైనదిగా మారిందన్నారు. ఎఐ వినియోగంలో డేటా ప్రైవసీ, ఎథిక్స్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా పరిశోధనపై దృష్టి సారించాలని టెక్ కంపెనీలను కోరారు. ఒకప్పుడు స్కేల్, స్పీడ్, వాల్యూయేషన్ ప్రాతిపదికన కంపెనీల సక్సెస్ నిర్ణయించబడేదని, ఇప్పుడు ఆర్కిటెక్చర్, డేటా ఓనర్ షిప్, డెసిషన్ స్పీడ్, నమ్మకంపైనే వాటి మనుగడ ఆధారపడి ఉందన్నారు. రానున్న రోజుల్లో కేవలం కోడింగ్ తెలిసిన వారి కంటే, సమస్య మూలాలను గుర్తించి తరువాయి 2లో



సైబర్ ఉచ్చులో మహిళ

# రూ. 2.58 కోట్లు టోకరా

- ట్రేడింగ్‌లో చిట్కాలు చెబుతామంటూ వాట్సాప్ మెసేజ్
- 50శాతం లాభాలొస్తాయని బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు

ప్రజాపక్షం/హైదరాబాద్

సైబర్ నేరగాళ్ల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. తమ మాయమాటలతో అమాయకులకు వల విసిరి రూ. కోట్లు దోచుకుంటున్నారు. తాజాగా సైబర్ కేటుగాళ్ల వలకి ఓ మాజీ ఐపిఎస్ అధికారి భార్య చిక్కింది. వారి మోసపూరితమైన మాటలను నమ్మి ఏకంగా రూ.2.58 కోట్ల మేర నష్టపోయింది. తాజాగా హైదరాబాద్ సైబర్ క్రైమ్ తరువాయి 12లో

# భారీ ఆపరేషన్



- హైదరాబాద్‌లోని మియాపూర్‌లో 15 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకున్న హైడ్రా
- రూ.3 వేల కోట్ల విలువైన భూమిచుట్టూ ఫెన్సింగ్

ప్రజాపక్షం/హైదరాబాద్

నగరంలోని భూ ఆక్రమణదారులపై హైడ్రా మరోసారి ఉక్కుపాదం మోపింది. మియాపూర్ ప్రాంతంలో శనివారం నిర్వహించిన భారీ ఆపరేషన్‌లో సుమారు రూ. 3,000 కోట్ల విలువైన 15 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం, మియాపూర్ గ్రామం పరిధిలోని మక్తా మహబూబ్ పేట (సర్వే నంబర్ 44) లో తరువాయి 12లో

# శాంతించని ఇరాన్

## 36 గంటలుగా ఇంటర్నెట్ బ్లాకౌట్




ఉద్ధృత పోరుకు పెహ్లవి పిలుపు

హింసకు పాల్పడితే దాడులు చేస్తాం: ట్రంప్

**టెహ్రాన్:** ఇరాన్ అట్టుడికిపోతోంది. ఖమేనీ పాలనకు వ్యతిరేకంగా ప్రజాందోళనలు పెద్దఎత్తున సాగుతున్నాయి. 36 గంటలుగా ఇంటర్నెట్ బ్లాకౌట్ కొనసాగుతోంది. తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలంటూ అజ్ఞాతంలో ఉన్న ఇరాన్ యువ రాజు రెజా పెహ్లవి శనివారం సామాజిక మాధ్యమంగా పిలుపునిచ్చారు. ఇరాన్ ఆందోళనలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు మద్దతు ప్రకటించారు. ఆందోళనకారులపై కాల్పులు జరిపితే ఇరాన్‌పై దాడులు చేస్తామని బెదిరించారు. ఉద్రిక్తతల నడుమ మృతుల సంఖ్య 217కి చేరినట్లు స్థానిక వర్గాల సమాచారం. కాగా, 65 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అంతర్జాతీయ మీడియా నివేదించింది. రాజధాని టెహ్రాన్‌లోనే ఎక్కువ మంది యువ ఆందోళనకారులు చనిపోయినట్లు నివేదికలు వెలువడ్డాయి. ఉత్తర టెహ్రాన్ పోలీస్ స్టేషన్ వెలుపల భద్రతా దళాలు నిరసనకారులపై కాల్పులు జరపడంతో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. శని, ఆదివారాల్లో మరింత ఉధృతంగా ఆందోళనలు చేపట్టాలని యువరాజు రెజా పెహ్లవి సామాజిక మాధ్యమం వేదికగా తరువాయి 12లో

# విషమిచ్చి చంపేయండి



- తప్పుడు ప్రచారాలు చేస్తూ నన్నెందుకు హింసిస్తున్నారు?
- మహిళా ఐఎఎస్ అధికారులను లక్ష్యంగా చేసుకోవడం దుర్మార్గం
- మీడియా ముందు కంటనీరు పెట్టుకున్న మంత్రి కోమటిరెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

మీడియాలో వస్తున్న వార్తలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కన్నీరు పెట్టుకున్నారు. తనను ఎందుకిలా ఇబ్బంది పెడుతుండ్రు.. ఇంత విషమిచ్చి చంపండంటూ ఎమోషనల్ అయ్యారు. నిప్పులా బతికిన తనను హింసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా ఐఎఎస్ అధికారులను లక్ష్యంగా చేసుకొని మీడియా, సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు, ఆధారంలేని ప్రచారాలను తరువాయి 2లో

# భారత్‌కు వెనిజులా చమురు విక్రయానికి అమెరికా సిద్ధం




**వాషింగ్టన్:** వెనిజులా అధ్యక్ష దంపతులను నిర్బంధించిన కొద్ది రోజులకు భారత్‌తో చమురు వాణిజ్యానికి సిద్ధమంటూ అమెరికా ప్రకటించింది. వాషింగ్టన్ నియంత్రణలోని నూతన కార్యాచరణ కింద భారత్‌కు వెనిజులా చమురు విక్రయానికి సానుకూలమని పేర్కొంది. రష్యా ముడిచమురు కొనుగోళ్లు ఆపాలంటూ భారత్‌పై ఒత్తిడి పెంచుతున్న నేపథ్యంలో తాజా పరిణామానికి ప్రాధాన్యత ఏర్పడింది. ఈ ఏడాది ఆరంభంలో వాషింగ్టన్‌కు కారకస్‌కు మధ్య 2 బిలియన్ డాలర్ల విలువ చేసే ముడి చమురు ఒప్పందం జరిగింది. అమెరికా సుంకాలు విధిస్తున్నప్పటికీ రష్యాతో చమురు వాణిజ్యాన్ని భారత్ కొనసాగిస్తోంది. అయితే నూతన కార్యాచరణ ప్రకారం వెనిజులా చమురును తిరిగి కొనుగోలు చేసేందుకు భారత్‌కు అనుమతి ఉన్నదని, అయితే దానిని అమెరికా ప్రభుత్వం మార్కెట్ చేస్తుందని అధికారిక ప్రకటన వెల్లడించింది. గతంలో వెనిజులా నుంచి చమురు కొనుగోలు చేసే అతిపెద్ద దేశంగా భారత్ ఉన్నది కానీ ఇటీవల పరిణామాల క్రమంలో పెరిగిన అమెరికా ఆధిపత్యంతో పరిస్థితి మారింది. వెనిజులా నుంచి చమురు కొనుగోలు చేసేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇప్పటికే అమెరికా వర్గాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది. రిలయన్స్ చివరిగా 2025 మేలో వెనిజులా చమురు కొనుగోలు చేసింది. తాజా పరిణామం భారత్‌కు ప్రయోజనమని, ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని అనేక నివేదికలు సూచిస్తున్నాయి. కేవలం భారత్‌కే కాదు ప్రపంచ దేశాలు అన్నింటికి వెనిజులా చమురును విక్రయించడం కోసం అమెరికా సిద్ధంగా ఉన్నట్లు ఆ దేశ ఇంధన శాఖ కార్యదర్శి క్రిస్టఫర్ రైట్ వెల్లడించారు. ఇదిలావుంటే, వెనిజులా చమురు ఆదాయం ఆ దేశంతో పాటు అమెరికాకూ లాభమని, అక్కడి చమురు నిల్వలను వెలికితీయడానికి ముందుకురావాలని అమెరికా కంపెనీలకు ట్రంప్ సూచించారు. తాజా చర్యల వల్ల ఇంధన ఉత్పత్తి పెరిగి, ధరలు తగ్గుతాయని అన్నారు.

# గ్రీన్‌లాండ్ అమెరికా సొంతం కావాల్సిందే

### ఆ అవకాశం రష్యా, చైనాకు ఇవ్వకూడదు: ట్రంప్



**వాషింగ్టన్:** గ్రీన్‌లాండ్ తమ సొంతం కావాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. గ్రీన్‌లాండ్‌కు ఇష్టమున్నా లేకపోయినా వెనక్కు తగ్గేదేలేదన్నారు. తాము బలవంతంగానైనా సరే గ్రీన్‌లాండ్‌లను స్వాధీనం చేసుకుంటామని, లేకపోతే రష్యా లేదా చైనా ఆ పని చేస్తాయని ట్రంప్ అన్నారు. శ్వేతసౌధంలో అమెరికా చమురు కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. సైనిక నిర్బంధం పేరిట బెదిరించి... వెనిజులాలో విస్తారమైన చమురు నిల్వలను అమెరికా కంపెనీలు కొల్లగొట్టే పణాళికలను చర్చించారు. అమెరికా విదేశాంగ విధానం సామ్రాజ్యవాద విజన్‌తో ముందుకెళ్లబోతున్నట్లు తెలిపారు. ఇరుగు పొరుగు దేశాలపై అమెరికా వ్యూహాత్మక ఆధిపత్యం ఉండాలన్నారు. రష్యా, చైనాలు తమ పొరుగు దేశాలుగా ఉండాలని కోరుకోవడం లేదని... గ్రీన్‌లాండ్ స్వాధీనానికి కఠిన మార్గాలను అనుసరించాల్సి రావచ్చని అన్నారు. గ్రీన్‌లాండ్ చుట్టూ జలాల్లో చైనా, రష్యా నౌకలు మోహరించి ఉన్నాయన్నారు. అమెరికాకు గ్రీన్‌లాండ్ వ్యూహాత్మకంగా, రక్షణపరంగా కీలక ప్రాంతమని చెప్పారు. ఆర్కిటిక్‌లో ప్రత్యర్థులను ఎదుర్కోవడానికి గ్రీన్‌లాండ్‌పై నియంత్రణ తమకు అవసరమని అన్నారు. గ్రీన్‌లాండ్, డెన్మార్క్‌తో అమెరికా మంత్రి రూబియో త్వరలో చర్చిస్తారని తెలిపారు.

**అమెరికన్లుగా ఉండబోం: గ్రీన్‌లాండ్**
తమ దేశాన్ని చేజిక్కించుకునేందుకు అమెరికా పావులు కదుపుతుండటంపై గ్రీన్‌లాండ్ ఆందోళన వ్యక్తంచేసింది. అమెరికాను ప్రతిఘటించేందుకు అక్కడి రాజకీయ పార్టీలన్నీ కూడా ఒక్కటయ్యాయి. అమెరికన్లుగా ఉండాలని లేదని, తమ భవిష్యత్తు నిర్ణయాధికారం తమదేనని తేల్చిచెప్పాయి. గ్రీన్‌లాండ్ భవిష్యత్తును ఇక్కడి ప్రజలే నిర్ణయిస్తారని ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి.

# నేను లేకుంటే భారత్‌–పాక్ పోరు తీవ్రమయ్యేది: ట్రంప్

**న్యూయార్క్:** తాను జోక్యం చేసుకొని ఉండకపోతే భారత్, పాకిస్థాన్ మధ్య పోరు మరింత తీవ్రరూపం దాల్చి అణు యుద్ధానికి దారితీసేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం ఆపినట్లు 70 సార్లకుపైగా చెప్పుకున్నారు. మొత్తం ఎనిమిది యుద్ధాలు ఆపాను... థాయిలాండ్ కంబోడియా యుద్ధాన్ని ఆపానుకానీ మళ్లీ ఉద్రిక్తతలు నెలకొన్నాయి అని ఓ ఇంటర్వ్యూలో ట్రంప్ వెల్లడించారు. ఒక యుద్ధం ఆపినందుకు ఒకటి చొప్పున తనకు నోబెల్ శాంతి పురస్కారం వరించాలి కానీ 30 ఏళ్లకుపైగా సాగుతున్న పోరుకు తెరదించినప్పటికీ ఆ అవార్డు ఇవ్వలేదన్నారు. యుద్ధాలు ఆపాడటం, లక్షల మంది ప్రాణాలు కాపాడటం ఎంతో సంతృప్తినిస్తాయని చెప్పారు. భారత్‌–పాక్ మధ్య శాంతి కుదిర్చే లోపే ఎనిమిది యుద్ధ విమానాలు కూలిపోయాయని, వెంటనే యుద్ధం ఆపివుండకపోతే తీవ్ర పరిణామాలు తప్పేవి కాదని వెల్లడించారు. ఆపిన ప్రతి యుద్ధానికి ఒకటి తనకు నోబెల్ దక్కాలని ట్రంప్ చమత్కరించారు.

# అధికారమిస్తే ప్రజాస్వామ్య మార్గంలో బంగ్లాదేశ్

### తారిఖ్ రెహ్మాన్ ఉద్ఘాటన



**ఢాకా:** వచ్చేనెల జరిగే పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు తమ పార్టీకి అధికారం అప్పగిస్తే దేశాన్ని సరైన మార్గంలో నడిపిస్తానని బంగ్లాదేశ్ నేషనలిస్ట్‌పార్టీ (బిఎన్‌పి) ఛైర్మన్ తారిఖ్ రెహ్మాన్ ప్రజలకు హామీ ఇచ్చారు. పార్టీ ఛైర్మన్, బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి ఖలీదా జియా మరణం తర్వాత శుక్రవారం (జనవరి 9)బిఎన్‌పి స్థాయీసంఘ సమావేశంలో తారిఖ్ రెహ్మాన్ పార్టీ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఆ మరునాడు ఢాకా సిటీ హోటల్‌లో శనివారం ఉదయం వివిధ పత్రికా సంపాదకులు, జర్నలిస్టులతో ఇష్టాగోష్ఠిలో తారిఖ్ రెహ్మాన్ మాట్లాడారు. 2024 ఆగస్టు ఐదోతేదీనాటి ముందు పరిస్థితులు దేశంలో తిరిగి తలెత్తకుండా దేశానికి దిశానిర్దేశం చేస్తామని, ఎట్టి పరిస్థితుల్లో ప్రజాస్వామ్యమార్గంలో నడిపిస్తామని, జవాబుదారీని తీసుకువస్తామని ఆయన అన్నారు.

దేశంలో సానుకూల పరిస్థితులు తిరిగి తీసుకువచ్చేందుకు అన్ని రంగాలలో జవాబుదారీతనం, ప్రజాస్వామ్య ప్రక్రియను తిరిగి తీసుకువస్తామన్నారు. ఇప్పుడు మనకి ఎన్నో సమస్యలు ఉన్నాయి, ఇంతకు ముందు కూడా అనేక సమస్యలున్నాయి, కానీ తిరిగి ఆ సమస్యల దశకు దేశాన్ని వెళ్ళకుండా కాపాడతాం అన్నారు. తన జీవితంలో జరిగిన చేదు సంఘటనలను 1981లో తన తండ్రి హత్యకు దారి తీసిన పరిస్థితులు, తన తల్లి ప్రజాస్వామ్య పునరుద్ధరణకోసం ఎదుర్కొన్న సమస్యలను, 2024 ఆగస్టు ఐదోతేదీకి ముందు ఘట్టాలను ఆయన గుర్తుచేసుకున్నారు. "ఇది నా గురించి మాత్రమే కాదు, బిఎన్‌పి పార్టీ నాయకులు,కార్యకర్తలు,ప్రాణత్యాగాలు చేసిన ప్రజల గురించి చెబుతున్నాను, కానీ ఇప్పుడు ఇక మనం వెనక్కు తిరిగి చూడాల్సిన అవసరం లేదు, బిఎన్‌పిని గెలిపిస్తే దేశాన్ని ప్రజాస్వామ్యపంథాలో దిశానిర్దేశం చేస్తాం, దేశంలో భిన్న రాజకీయపార్టీలు, భిన్నభావజాలం ఉన్నవారు ఉంటారు, భిన్నాభిప్రాయాలు తప్ప భిన్న విభజనల అవసరం ఉండకూడదన్నారు. వైరుధ్యాలు ఉంటాయి, మనం ప్రయత్నించాలి, చర్చల ద్వారా సమస్యలన్నీ పరిష్కరించుకోగలం అని చెప్పారు. 1971, 1990,2024 సంవత్సరాలలో జరిగిన సంఘటనలు,పరిణామాల గుణపాఠాలు నేర్చుకుని రాజకీయనాయకులు దేశ స్వాతంత్ర్యాన్ని, దేశ సార్వభౌమాధికారాన్ని నిలబెట్టుకోవడం కోసం పాటుపడాలని కోరారు.

# ఉక్రేన్‌లో పశ్చిమదేశాల సైన్యాన్ని ఒప్పుకోం : రష్యా

### రేపు భద్రతా మండలి సమావేశం

**మాస్కో:** ఉక్రేన్‌లో పశ్చిమ దేశాల జోక్యాన్ని, ఆ దేశాలకు చెందిన సైన్యాల ఉనికినీ సహించేది లేదని రష్యా నిర్ద్వంద్వంగా స్పష్టం చేసింది. ఉక్రేన్ సమస్యపై సోమవారం భద్రతామండలి సమావేశం జరగనున్న నేపథ్యంలో రష్యా భద్రతా మండలి డిప్యూటీ ఛైర్మన్ దిమ్మిత్రీ మెద్వెదేవ్ శనివారం ప్రకటించారు. ఉక్రేన్‌లో శాంతి భద్రతలను నిర్వహించే విషయంపై సోమవారం మధ్యాహ్నం ఒక సమావేశం ఏర్పాటు చేశారు. ఉక్రేన్‌లో వ్యక్తిగతంగా ఏ యూరప్‌దేశంగానీ లేదా నాటో కూటమి దేశాలుగానీ సైన్యాన్ని మోహరించడానికి మాస్కో తిరస్కరిస్తోందని మెద్వెదేవ్ చెప్పారు. రష్యాతో శాంతి ఒప్పందం కుదిరితే ఉక్రేన్‌లో శాంతి దళాల పేరుతో సైన్యాన్ని మోహరించాలని బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ నిర్ణయించడంపై మెద్వెదేవ్ స్పందించారు. ఉక్రేన్‌లో ఓర్నెనిక్ క్షిపణులతో రష్యా తన దాడులను ఉద్ధృతం చేయడంతో శుక్రవారం నలుగురు మరణించారు. రష్యాలోని పలు ప్రాంతాల్లో ఉక్రేన్ కూడా డ్రోన్లతో దాడులు చేసింది. ఈ దాడుల్లో 33 ఉక్రేన్ డ్రోన్లను కూల్చివేసినట్టు కూడా మెద్వెదేవ్ చెప్పారు. ఈ పరిణామంపై యూరప్ దేశాల స్పందనకు ఆయన సమాధానం చెప్పారు. యూరప్‌దేశాలతో ఎలాంటి వైరుధ్యాన్ని రష్యా కోరుకోవడంలేదని, యూరప్‌పై మొదటి దాడి చేసే ఉద్దేశం తమకు లేదని, అలాగని ఉక్రేన్‌లో శాంతిదళం పేరుచెప్పి నాటో సేనలను మోహరిస్తే సహించబోమని ఎక్స్ వేదికగా ఆయన పోస్టింగ్ చేశారు. మరోవైపు ట్రంప్ కూడా స్పందిస్తూ, రష్యాపై ఆంక్షలు విధించడానికి ఎలాంటి శాసనం చేయాల్సిన అవసరం ఉండదని, కానీ తాము అందుకు సన్నద్ధంగా ఉన్నామని అన్నారు.

# విషమిచ్చి చంపేయండి (మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బంజారాహిల్స్‌లోని తన నివాసంలో శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి, ఆ వార్తలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్, ఐఏఎస్ అధికారుల బదిలీల్లో మంత్రుల జోక్యం ఉండదని, అలాంటి నిర్ణయాలు పూర్తిగా ముఖ్యమంత్రి పరిధిలో ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. అన్ని మీడియా యాజమాన్యాలు బాధ్యతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ నాయకులు, ఐఏఎస్ అధికారులు, ముఖ్యమంత్రి కార్యాలయం (సిఎంఒ) లోని మహిళా అధికారులు, ఇంచార్జ్ మంత్రులపై కూడా ఆధారంలేని కథనాలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై డిజిపితో చర్చించామని, సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని డిజిపి, ఇంటెలిజెన్స్ అధికారులను కోరినట్లు తెలిపారు. నివేదిక వచ్చిన అనంతరం చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

**తెలంగాణ ఉద్యమం కోసం మంత్రి పదవినే త్యాగం చేశా..**
తెలంగాణ ఉద్యమం కోసం మంత్రి పదవినే త్యాగం చేశానని, వ్యక్తిగతంగా ఎన్నో బాధలు ఎదుర్కొన్నానని మంత్రి గుర్తు చేశారు. తన కుమారుని కోల్పోయిన బాధను దాచుకుని, ఆయన పేరుతో ప్రజాసేవ చేస్తున్నా నని, పేద ప్రజలకు సేవచేస్తున్న తనపై అసత్య ప్రచారాలు చేయడం అన్యాయమని అన్నారు.

**సంక్రాంతి ప్రయాణాలపై విస్తృత ఏర్పాట్లు..** సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్ నుంచి స్వగ్రామాలకు వెళ్లే ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా సమగ్ర చర్యలు చేపట్టా మని మంత్రి తెలిపారు. ఈసారి సుమారు 12 లక్షల వాహనాలు ఊర్లకు వెళ్లి తిరిగి వస్తాయని అంచనా వేస్తున్నామని, గత ఏడాది 9 లక్షల వాహనాలు ప్రయాణించాయని గుర్తు చేశారు. టోల్ గేట్ల వద్ద భారీ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడితే వెంటనే టోల్ గేట్లు తెరవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. పంతంగి టోల్ గేట్ వద్ద తరచుగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో అక్కడ టోల్ గేట్ ఓపెన్ చేయాలని సూచించామని తెలిపారు.

**సినిమా ఇండస్ట్రీ గురించి పట్టించుకోవట్లేదు..**
తాను సినిమా ఇండస్ట్రీ గురించి పట్టించుకోవడం మానేశానని మంత్రి చెప్పారు. సినిమా టికెట్ల రేట్ల పెంపుపై మంత్రి స్పందిస్తూ సినిమా టికెట్ల ధరల పెంపుపై తన దగ్గరకు రావొద్దని చెప్పానని, దీంతో ఎవరూ తనను కలవడానికి రావడం లేదని చెప్పారు. పుష్ప సినిమా సందర్భంగా ఓ మహిళ చనిపోవడం బాధాకర మన్నారు. అప్పటి నుంచే టికెట్ల రేట్ల పెంపుకోసం తన దగ్గరకు రావొద్దని చెప్పానని, ఇటీవల విడుదలవుతున్న సినిమాలకు సంబంధించిన టికెట్ల ధరల పెంపు విషయం తనకు తెలీదని చెప్పారు. టికెట్ల రేట్ల పెంపుపై తాను సంతకం చేయలేదని స్పష్టం చేశారు. ఆ విషయంలో ఏం జరుగుతుందో తెలీదని మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు.

# అమెరికన్ సిటిజన్లుగా గుర్తింపు ఇష్టం లేదు

### గ్రీన్‌లాండ్ ప్రజల తిరస్కృతి

**నూక్:** గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేసే విషయంపై డెన్మార్ నాయకులతో వచ్చేవారం సమావేశం నిర్వహిస్తామని అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో ప్రకటించిన తర్వాత గ్రీన్‌లాండ్ ప్రజల్లో మరింత భయాందోళన ప్రారంభమైంది. తాము గ్రీన్‌లాండ్ దేశీయులుగానే బ్రతకదలుచుకున్నామని, ఎలాంటి ప్రలోభాలకు గురయ్యేదిలేదని పాత్రికేయు ల ఇంటర్వ్యూలలో ప్రజలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అమెరికన్లుగా గుర్తింపు పొందడం తమకు ఇష్టంలేదని స్పష్టం చేశార. డెన్మార్క్‌లో ఒక స్వయంప్రతిపత్తి ద్వీపంగా ఉన్న గ్రీన్‌లాండ్‌లో నివసిస్తున్న 57,000 మంది ప్రజలు అభద్రతాభావంతో ఉన్నారని ఆ ప్రాంతాన్ని సందర్శించిన బిబిసి ప్రతినిధి వ్యాఖ్యానించారు. తాము అటు డెన్మార్ పాలనలోగానీ, ఇటు అమెరికన్ ప్రజలుగా గానీ గుర్తింపు పొందడానికి ఇష్టపడటంలేదని, గ్రీన్‌లాండ్ ప్రజలుగా ఉండటానికే ఇష్టపడుతున్నామని ఇంటర్వ్యూ లో పలువురు దుకాణదారులు, పౌరులు చెప్పారు. గ్రీన్‌లాండ్‌ను సొంతం చేసుకునేందుకు ఆ దేశంలో ప్రజలకు తలకు 10,000 డాలర్లు లేదా 20,000 ఇస్తామని ట్రంప్ ఆశచూపిస్తున్నారు. ఇలాంటి ప్రలోభాలకు గురయ్యేది లేదని వారు స్పష్టంగా చెప్పారు. వ్యూహాత్మకంగా చైనా, రష్యా, ఉత్తర కొరియా తదితర శత్రుదేశాలను నిలువరించడానికి గ్రీన్‌లాండ్ అనివార్యంగా అమెరికాలో భాగంగా ఉండాల్సిందేనని ట్రంప్ శుక్రవారం పొద్దుపోయాక మరోసారి ఉద్ఘాటించారు. గ్రీన్‌లాండ్ దేశం పూర్తిగా మంచుతో కప్పబడి ఉంటుంది. ఎంతో ప్రశాంతంగా ఐసుగడ్డలతో ఉండే ఈ ప్రాంతంలో ప్రజలు ఇప్పుడు భయాందోళనలు, ఉద్రిక్తతలు నెలకున్నాయి.

# జిఒ 252లో మార్పులు చేర్పులు చేస్తాం

* జర్నలిస్టు సంఘాల సూచనలను పరిగణనలోకి తీసుకుంటాం
* 14 జర్నలిస్టు సంఘాలతో సమావేశం నిర్వహించిన రాష్ట్ర హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అక్రిడిటేషన్‌ల జారీ మార్గదర్శకాల విషయంలో జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారని, వారు ప్రస్తావించిన అంశాలను విజ్ఞప్తులను పరిశీలించి సానుకూలమైన నిర్ణయం తీసుకుంటామని, జిఓ 252లో మార్పులు చేర్పులు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. అక్రిడిటేషన్ కార్డులు తగ్గుతాయని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. గతంలో ఉన్న సుమారు 23 వేల అక్రిడిటేషన్ కార్డుల సంఖ్య కంటే ఈసారి ఇచ్చే కార్డుల సంఖ్య ఎక్కువ ఉంటుందని వెల్లడించారు. మీడియా కార్డుకు, అక్రిడిటేషన్ కార్డుకు ఎలాంటి వ్యత్యాసం లేదని అక్రిడిటేషన్ కార్డుదారులకు ప్రభుత్వ పరంగా అందే ప్రతి ప్రయోజనం మీడియా కార్డుదారులకు కూడా అందుతాయని ఇందులో ఎలాం టి అనుమానాలకు తావులేదని మరోమారు స్పష్టం చేశారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్‌ల జారీ మార్గదర్శకాల ఉత్తర్వుల (జీఓ 252) పై శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో 14 జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి, ఐఅండ్‌పిఆర్ కమిషనర్ సిహెచ్.ప్రియాంక, సిఎం సిపిఆర్‌ఓ జి.మల్సూర్, టియుడబ్ల్యుజె అధ్యక్షులు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామ్‌నారాయణ, వివిధ జర్నలిస్టుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జర్నలిజం గౌరవాన్ని నిలబెట్టి ఆ వృత్తికి వన్నెతెచ్చే జర్నలిస్టులందరికీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని అన్నారు. ఏ ఒక్కరి గౌరవాన్ని తగ్గించాలని గానీ, చిన్నబుచ్చాలని గానీ ప్రభుత్వ ఉద్దేశ్యం కాదని మంత్రి స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ కార్డుల జారీలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మొదటివరుసలో ఉందని అన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలనే సదుద్దేశంతో శాస్త్రీయ పద్దతిలో అధ్యయనం చేయడం జరిగిందని, పలుమార్లు సమావేశాలు నిర్వహించామని, దేశ వ్యాప్తంగా ఉన్న నియమనిబంధనలను పరిశీలించామని, ఫలితంగా కొత్త కార్డుల మంజూరులో కొంత జాప్యం జరిగిందని అన్నారు. అక్రిడిటేషన్ కార్డు ల మంజూరు విషయంలో ఎటువంటి భేషజాలకు పోవడంలేదని, కానీ ఈ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు గాను ప్రభుత్వ పరంగా సర్క్యులేషన్, ఇతర సంబంధిత వివరాలను ఖచ్చితంగా సేకరిస్తామని, ఛార్టెడ్ అకౌంటెంట్ సర్టిఫికేట్ల పరిశీలన కూడా చేస్తామని దీని వల్ల అసలైన పత్రికలు, పాత్రికేయలకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో మండలానికో విలేకరి ప్రాతిపదికన కాకుండా జనాభా వారీగా అక్రిడిటేషన్లు మంజూరు చేస్తే ఎలా ఉంటుందన్న విషయంలో కూడా ఆలోచిస్తామని, దీనిపై పాత్రికేయ సంఘాలు స్పందించాలని అన్నారు. అక్రిడిటేషన్ కమిటీలలో ఉర్దూ జర్నలిస్టులకు అవకాశం కల్పిస్తామని, క్రీడా, సాంస్కృతిక, క్రైమ్, కేబుల్ టీవీ తదితర విభాగాల పాత్రికేయులకు అక్రిడిటేషన్ సౌకర్యం తప్పక ఉంటుందని స్పష్టం చేశారు. మహిళా జర్నలిస్టుల విజ్ఞప్తి మేరకు అక్రిడిటేషన్ కార్డుల జారీలో ప్రత్యేక కోటా కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

**జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం కోర్టు అడ్డంకులు లేని విధానాన్ని రూపొందిస్తాం**
జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు ఎటువంటి కోర్టు అడ్డంకులు లేని విధానాన్ని రూపొందిస్తామని మంత్రి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇండ్ల స్థలాల కొంతమంది ప్రతినిధులు అడిగిన ప్రశ్నలపై మంత్రి స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల అంశాన్ని పరిష్కరించి జవహర్ లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీకి భూమిని అప్పగించినట్లు చెప్పారు. ఆ తర్వాత సుప్రీంకోర్టు ఈ అంశాన్ని కొట్టివేయడంతో సమస్య మొదటికి వచ్చిందని, అయినా కూడా ఇండ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం ఎప్పుడూ సానుకూలంగా ఉంటుందన్నారు.

# పల్లెకు పోదాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కసారిగా రద్దీ పెరగడంతో ప్రయాణికులకు సరిపడా బస్సులు లేక ప్రైవేట్ వెహికల్స్‌ను ఆశ్రయించాల్సి వస్తోందని తెలిపారు. ఇదే అదునుగా ప్రైవేట్ వెహికిల్స్ వారు టికెట్ ధరలను డబుల్ చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పండుగ నేపథ్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రయాణికులతో కోలాహలంగా మారింది. సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే వారి సంఖ్య పెరగడంతో రైల్వే స్టేషన్ ప్రాంగణమంతా ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. దీంతో రైల్వే అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు.

**సంక్రాంతి రద్దీ దృష్ట్యా 6431 స్పెషల్ బస్‌లు :** సంక్రాంతి పండుగ రద్దీ దృష్ట్యా టిజిఎస్ ఆర్‌టిసి 6432 స్పెషల్ బస్సులను నడిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌కు 1000 బస్సులను, మిగతా వాటిని తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాలకు నడిపిస్తోంది. నిన్నటి నుంచి ప్రారంభమైన ప్రత్యేక బస్సులు ఈనెల 13వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని రంగారెడ్డి ఆర్‌టిసి రీజినల్ మేనేజర్ శ్రీలత ఇప్పటికే తెలిపారు. తిరిగి 18, 19 తేదీల్లోనూ స్పెషల్ బస్సులు నడుస్తాయని వివరించారు. కాగా ప్రత్యేక బస్సులకు 50 శాతం అదనపు చార్జీలు వసూలు చేయనున్నారు.

# పరిమితమవ్వొద్దు

(మొదటి పేజీ తరువాయి)

పరిష్కరించ గల 'క్రియేటివ్ థింకర్స్'కే జాబ్ మార్కెట్‌లో డిమాండ్ ఉంటుందన్నారు. ఎఐ ఫలితాలు కేవలం నగరాలకే పరిమితం కాకూడదని, వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లోని గ్రామీణ సమస్యలకు పరిష్కారం చూపే విధంగా పరిశోధనలు జరగాలని, అప్పుడే టెక్నాలజీ ఫలాలు సామాన్యులకు కూడా అందుతాయన్నారు. 'తెలంగాణ రైజింగ్'లో భాగస్వామ్యం కావాలని బిట్స్ పిలానీ పూర్వ విద్యార్థులను, యాజమాన్యాన్ని మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. ఎఐ, ఇన్నోవేషన్, అకడమిక్ రీసెర్చ్ వంటి అంశాల్లో బిట్స్ పిలానీతో కలిసి పనిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో బిట్స్ అలుమ్ని అసోసియేషన్ ఛైర్ పర్సన్ ప్రేమ్ జైన్, మ్యాప్ మై ఇండియా ఫౌండర్ అండ్ ఛైర్మన్ రాకేష్ వర్మ, బిజిఎం–2026 ఛైర్ పర్సన్ అనిత తదితరులు పాల్గొన్నారు.

# 18న భారీ సభ (మొదటి పేజీ తరువాయి)

ఇ.టి.నర్సింహ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి హైదరాబాద్‌లో జర్నలిస్టులతో శనివారం కూనంనేని సాంబశివరావు ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఖమ్మం బహిరంగ సభకు ఎపి, కేరళ, తమిళనాడుతో పాటు దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో తరలిరానున్నారని, ప్రజలు స్వచ్ఛందంగా రవాణ సౌకర్యాన్ని కల్పించుకుని వస్తున్నారని ఆయన తెలిపారు. బహిరంగ సభకు ముందు పదివేల మందితో 'జనసేవాదళ్ కవాతు'ను నిర్వహించనున్నామని, ఆ తర్వాత సభ జరుగుతుందని తెలిపారు. మరుసటి రోజు 19వ తేదీన జాతీయ సదస్సును నిర్వహిస్తామని, అలాగే ఈనెల 19, 20,21 న సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం, కార్యవర్గ, సమితి సమావేశాలను నిర్వహించనున్నట్టు కూనంనేని వివరించారు. కమ్యూనిస్టు సిద్ధాంతానికి భిన్నంగా కాకుండా మారుతున్న కొత్త పద్ధతులు, వివిధ దేశాల పరిస్థితులకు అనుగుణం గా మార్పులు చేసుకుంటూ శ్రీలంక, నేపాల్ ఇలా పలు దేశాలలో కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చాయని, చిన్నపాటి సమస్యలు వచ్చినా పరిష్కరించుకుంటూ ఐక్యంగా ముందుకు వెళుతున్నారని ఆయన వివరించారు. భారతదేశంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామా లు, పరిస్థితులు, కగార్ ఆపరేషన్, కార్మిక హక్కులను కాలరాస్తూ తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు ఇలాంటి సందర్భంలో కమ్యూనిస్టు పార్టీలన్నీ కలిస్తే బాగుటుందని అందరూ కోరుకుంటున్నారని, కమ్యూనిస్టు పార్టీలలో ఐక్యత రావాలని చాలా మంది చెబుతున్నారని కూనంనేని సాంబశివ రావు తెలిపారు.

**ఇప్పటికీ ప్రజలు కమ్యూనిస్టులనే గుర్తు చేసుకుంటారు : పల్లా వెంకట రెడ్డి**
పల్లా వెంకట రెడ్డి మాట్లాడుతూ సిపిఐ 99వ సంవత్సరం నుంచి వందేళ్లు పూర్తి చేసుకునే ఒక సంవత్సరం వరకు ఏడాది పొడవునా సిపిఐ వందేళ్ల ఉత్సవాలు నిర్వహించుకున్నామని వివరించారు. సమస్యల పరిష్కారాన్ని కోరుకున్నప్పుడు ప్రజలు కమ్యూనిస్టులను గుర్తు చేసుకుంటున్నారని, తాము నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ఖమ్మం సభకు ప్రజలు స్వచ్ఛందంగా హాజరుకానున్నారని తెలిపారు.

**వందేళ్లలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాం...**
**మౌలిక అంశాలను సాధించాం: డాక్టర్ నారాయణ**
డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలు వందేళ్ల కాలంలో ఏం సాధించారని కొందరు హేళన చేస్తున్నారని, వందేళ్ల కాలంలో తాము అధికారంలోకి రాకపోయినప్పటికీ భారతదేశ సమైక్యతకు విఘాతం కలగకుండా, ప్రజాస్వామ్యాన్ని కాపాడుతూ, మౌలిక అంశాలను నిలబెట్టామని స్పష్టం చేశారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో సంపూర్ణ స్వాంత్ర్యం ప్రతిపాదన చేసింది భారత కమ్యూనిస్టు పార్టీ యే అని, దున్నేవాడికి భూమి, పేదలకు భూమి పై హక్కు, తెలంగాణ సాయుధ పోరాటం ఇలా అనేక ప్రజా ఉద్యమాలను నిర్మించిందని నారాయణ గుర్తు చేశారు. తమ దేహం ముక్కలైనా దేశాన్ని ముక్కలుగా కానివ్వబోమని నినదించిందే కమ్యూనిస్టు పార్టీ అని చెప్పారు. భవిష్య త్తు ప్రజలదేనని, కమ్యూనిస్టు పార్టీదేనని అన్నారు.

# రాష్ట్రాలు భాగస్వామ్యం (మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం ఉన్న 200 బిలియన్ డాలర్ల నుండి 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని ప్రయత్నిస్తున్నామని, తద్వారా దేశ జిడిపిలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలని లక్ష్యంగా నిర్ణయించామని వివరించారు. మౌలిక సదుపాయాల కల్పన కోసం తెలంగాణలో పెట్టుబడి రేటును ప్రస్తుత 37 శాతం నుంచి 50 శాతానికి (జిఎస్‌డిపి) పెంచాల్సి ఉందని, రాష్ట్రాల ద్రవ్య లోటు పరిమితిని ఏడాదికి కనీసం 4 శాతానికి పెంచాలని డిప్యూటీ సిఎం కోరారు. రాష్ట్రాలకు ఇస్తున్న 50 ఏళ్ల వడ్డీ లేని రుణాలను గ్రాంట్లుగా మార్చాలని, ఆ సహాయాన్ని రెట్టింపు చేయాలని కోరారు. విద్య, ఆరోగ్య రంగాల కోసం సేకరించే వనరులను ఎఫ్‌ఆర్‌బిఎం పరిమితుల నుంచి మినహాయించాలన్నారు. తెలంగాణలో ప్రస్తుతం 1000కి పైగా కులాల వారీగా రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం 119 నియోజకవర్గాల్లో ఆధునిక వసతులతో కూడిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోందని, ఇక్కడ అన్ని వర్గాల పిల్లలు కలిసి చదువుకుంటారని తెలిపారు. కేంద్రం తన మొత్తం వ్యయంలో 20 శాతం కంటే ఎక్కువ రాష్ట్ర, ఉమ్మడి జాబితా అంశాలపై ఖర్చు చేస్తోందని, ఇందులో 25 శాతం తగ్గించి, ఆ రూ.2.21 లక్షల కోట్లను నేరుగా రాష్ట్రాలకు బదిలీ చేయాలని సూచించారు. ప్రస్తుతం సెస్‌లు, సర్‌ఛార్జీల వాటా కేంద్ర పన్ను రాబడిలో 20 శాతానికి చేరిందని, దీని వల్ల 15వ ఆర్థిక సంఘం 41 శాతం పన్ను బదిలీని సిఫార్సు చేసినప్పటికీ రాష్ట్రాలకు కేవలం 30 శాతం మాత్రమే అందుతోందని డిప్యూటీ సిఎం కేంద్రం దృష్టికి తీసుకువచ్చారు. దాదాపు రూ.1,55,000 కోట్ల సర్ ఛార్జీలను మౌలిక సదుపాయాల నిధికి మళ్లించాలని లేదా వాటిని ప్రాథమిక పన్ను రేట్లలో కలిపి రాష్ట్రాలకు వాటా ఇవ్వాలని సూచించారు. తెలంగాణలో ప్రాంతీయ రింగ్ రోడ్ (ఆర్‌ఆర్‌ఆర్) ప్రాజెక్టును నిధులను తక్షణమే మంజూరు చేయాలని, హైదరాబాద్ మెట్రో ఫేజ్ –2కు సంబంధించి త్వరగా నిర్ణయం తీసుకుని అనుమతులు ఇవ్వాలని, హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటును ప్రకటించాలని, మిగిలిన జిల్లాల్లో కేంద్రీయ, జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలని డిప్యూటీ సిఎం కేంద్రాన్ని కోరారు. పెద్దపల్లి, వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెంలో విమానాశ్రయాలను మంజూరు చేయాలని, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పిఆర్‌ఎల్‌ఐ) ని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కోసం రూ.14,100 కోట్లు, రేడియల్ రోడ్ల కోసం రూ.45,000 కోట్లు, హైదరాబాద్ మురుగునీటి పారుదల ప్రణాళిక కోసం రూ.17,212 కోట్లు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సహకార సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్ర అభ్యర్థనలను సానుకూలంగా పరిశీలిస్తారని ఆశిస్తున్నామన్నారు.

# జి రామ్ జి చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి

18న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేయాలి : సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

ఎర్రజెండాలతో ఎరుపెక్కిన పెద్దపల్లి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తీసుకు వచ్చిన జిరాంజీ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం నేతృత్వంలో పెద్దపల్లి కేంద్రంలోనీ జూనియర్ కళాశాల గ్రౌండ్ నుండి ఎర్రజెండాలతో వందలాదిమంది సిపిఐ కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం సిరి ఫంక్షన్ హాల్లో సభను నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, కలవేన శంకర్ హాజరై మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ భారత గడ్డపై 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా ముగింపు బహిరంగ సభ జనవరి 18న ఖమ్మంలో సభ ఏర్పాటు చేస్తున్నట్లు దానిని జిల్లాలోని పార్టీ ప్రజా సంఘాలు ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భారతదేశంలో జరిగే అనేక పోరాటాలకు భారత కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించిందని నాటి స్వతంత్ర పోరాటం నుండి నేటి వరకు ప్రతి పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర ప్రధానంగా ఉందని వారు అన్నారు. కానీ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మూడోసారి గెలిచిన బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని జిరాంజీ అనే పేరుతో చట్టం చేసి గతంలో 90 శాతం నిధులు కేంద్రం ఇచ్చే పరిస్థితి ఉంటే నేడు దాన్ని 60 శాతానికి కుదించి మిగతా 40 శాతం రాష్ట్రమే భరించుకునే విధంగా చట్టాన్ని చేసి మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం లేకుండా చేయాలనే కుట్రలు పన్నుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ దేశంలో కార్మికుల హక్కులను కాలరాస్తూ 44 చట్టాలు ఉంటే నాలుగు కోట్లుగా విభజించి దుర్మార్గపు పాలన చేస్తున్న మోడీ ప్రభుత్వం జిరాంజీ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం చేస్తూ ఎల్ఐసి లాంటి సంస్థల నిధులను కార్పొరేట్లకు దారతత్వం చేసి దుర్మార్గపు పాలన చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, రాష్ట్ర సమితి సభ్యులు గౌతమ్ గోవర్ధన్, గోసిక మోహన్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.కనకరాజు, తాళ్లపల్లి మల్లయ్య ,కడారి సునీల్, మడ్డి ఎల్లయ్య, మార్కపురి సూర్య, తాళ్లపల్లి లక్ష్మ ణ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పూసాల రమేష్, బాలసాని లెనిన్, రేణిగుంట్ల ప్రీతం, ఆరేపల్లి మానస్, కల్లేపల్లి నవీన్, కన్నం లక్ష్మీ నారాయణ, మాటేటి శంకర్, శనిగరపు చంద్ర శేఖర్, రాజారత్నం, ఆసాల రమ, తౌడుకునూరి రమేష్ కుమార్, వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంతరాలు లేని సమాజ నిర్మాణమే సిపిఐ ధ్యేయం

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు

హనుమకొండలో జనసేవా దళ్ శిక్షణా శిబిరం



**ప్రజాపక్షం/హనుమకొండ:** అంతరాలు లేని సమ సమాజ నిర్మాణమే సిపిఐ ధ్యేయం అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. సిపిఐ వందేళ్ల ఉత్సవాలలో పాల్గొననున్న హనుమకొండ జిల్లా జనసేవా దల్ వాలంటీర్ల శిక్షణా శిబిరం శనివారం హనుమకొండ కుమార్‌పల్లిలోని యూత్ భవన్ జరిగింది. ఈ శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థలో పేదలు, ధనికుల మధ్య తారతమ్యం పెరుగుతూ పోతున్నదని, అయినా పాలకులు పేదల అభివృద్ధిని విస్మరించి కార్పొరేట్, పెట్టుబడిదారీ శక్తుల కోసమే పని చేస్తున్నారని అన్నారు. ఒకే దేశంలో ఒకేసారి స్వాతంత్ర్యం వచ్చిన ప్రజల మధ్య రోజూ వారి ఆదాయం వ్యత్యాసం వేల రెట్లు ఎక్కువగా ఉందని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదన్నారు. కేంద్రంలో గత పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మేలు చేకూర్చేందుకే పని చేసిందని, తిరిగి మరోసారి వారి అండతోనే అధికారంలోకి వచ్చి వారి మేలుకోసమే పనిచేస్తున్నదని విమర్శించారు. పేదలు, మధ్య తరగతి వర్గాల ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని అన్నారు. దళితుల, గిరిజనుల, మైనారిటీలపై బీజేపీ పాలిత రాష్ట్రాలలో దాడులు పెరిగాయని, చివరకు రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థలను కూడా ధ్వంసం చేసే ప్రయత్నం చేశారన్నారు. కమ్యూనిస్టులు, లౌకిక శక్తులతోనే ప్రజాస్వామ్య, రాజ్యాంగ రక్షణ సాధ్యమని, గడిచిన లోక్‌సభ ఎన్నికలలో దేశ ప్రజలు మోడీకి గుణపాఠం చెప్పినా ఆయన వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ శిక్షణా శిబిరానికి ఇన్‌స్ట్రక్టర్‌గా జనసేవా దల్ రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేష్ వ్యవహరించగా కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు ఎన్.అశోక్ స్టాలిన్, కర్రె లక్ష్మ ణ్, ఉట్కూరి రాములు, ఏదునూరి వెంకట్రాజం, మునిగాల బిక్షపతి, బాషబోయిన సంతోష్, కొట్టెపాక రవి, మంచాల రమాదేవి, మాలోతు శంకర్, యాళ్ల సంజయ్, ఎం.శ్యామ్ సుందర్ రెడ్డి, కండె నర్సయ్య, కామెర వెంకటరమణ, గుంటి రాజేందర్, గడ్డం లలిత, కొత్తపల్లి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ జర్నల్‌ను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జర్నలిస్టుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని రాష్ట్ర సమాచార పౌరసంబంధాల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ రూపొందించిన ప్రెస్‌క్లబ్ జర్నల్‌ను మంత్రి శనివారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో ప్రతినెలా ప్రెస్‌క్లబ్ జర్నల్‌ను రూపొందించడం అభినందనీయమన్నారు. జర్నలిస్టులకు సంబంధించిన సమకాలీన అంశాలను ఈ జర్నల్‌లో పొందుపరచడం సంతోషకరమన్నారు. ఇటువంటి ప్రయత్నాలు మీడియా వర్గాలకు ఉపయోగకరంగా ఉండటంతో పాటు వృత్తి నైపుణ్యాన్ని మరింత పెంపొందిస్తాయని తెలిపారు. ప్రెస్‌క్లబ్ నూతన పాలకమండలి ఏర్పడి కేవలం మూడు నెలలే అయినప్పటికీ, జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి దిశగా పలు కార్యక్రమాలను చేపట్టామని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్.విజయకుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షులు రాజేష్, అరుణ అత్తలూరి, జాయింట్ సెక్రటరీ చిలుకూరి హరిప్రసాద్, కోశాధికారి రమేష్ వైట్ల, కార్యవర్గ సభ్యులు శంకర్ శీగ, ఎన్. ఉమాదేవి, రచన ముదుంబై, వనం నాగరాజు, అమిత్ బట్టు పాల్గొన్నారు.

## న్యాయవాదుల సమస్యలపై నిత్యపోరాట చరిత్ర ఐఎఎల్‌ది




దుస్సా జనార్ధన్‌ను రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులుగా గెలిపించాలని ఐఎఎల్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** న్యాయవాదుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన సంక్షేమం కోసం నిరంతరం ఉద్యమిస్తున్న ఐఎఎల్ నాయకుడు, తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ అభ్యర్థి దుస్సా జనార్ధన్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) రాష్ట్ర అధక్షుడు బొమ్మగాని ప్రభాకర్ కోరారు. హైదరాబాద్‌లోని అమృత ఎస్టేట్స్‌లో శనివారం ఐఎఎల్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలోని న్యాయవాదుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న చరిత్ర ఐఎఎల్‌కు ఉందన్నారు. ఈ చరిత్రాత్మకమైన సంఘానికి నాయకుడైన దుస్సా జనార్ధన్ పోరాట రంగంలో ముందున్నారన్నారు. బార్ కౌన్సిల్ సభ్యులుగా మొదటిసారి ఎన్నికైనప్పుడు రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఆయన ఉద్యమాలు చేశారని తెలిపారు. న్యాయవాదుల వృత్తి నైపుణ్యతకు ఐఎఎల్ ఆధ్వర్యంలో నిరంతర శిక్షణ తరగతులు నిర్వహించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. దుస్సా జనార్ధన్ గెలించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కమిటీలు, ఐక్యంగా శక్తి వంచన లేకుండా కృషి చేయాలని బొమ్మగాని ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఐఎఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వి.కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే ఐఎఎల్ అభ్యర్థుల పట్ల మంచి అభిప్రాయం ఉందని, జూనియర్, సీనియర్ న్యాయవాదులంతా జనార్దన్ గెలుపు కోసం మరింత కృషి తీసుకోవాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు కెవిఎల్, పి.రాములు, గుర్రం రాజశేఖర్‌రెడ్డి, ఓరుగంటి శేషగిరిరావు, పరమేశ్, బొమ్మగాని శ్రీనివాస్, బత్తిని రాము, టి.మురళి, రాజారామ్, మల్లేపల్లి ఆదిరెడ్డి, బి.భగత్‌సేన్, విల్సన్, మారగోని అనిత, కె.వీరబాబు పాల్గొన్నారు.

# కార్మికుల శ్రమ దోపిడీ




రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న స్వీపర్స్, స్కావెంజర్లకు ప్రభుత్వం నెలకు రూ.26వేల వేతనాన్ని చెల్లించాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల సర్వీస్ పర్సన్స్, స్వీపర్ యూనియన్ (ఎఐటియుసి) సమావేశాన్ని యూనియన్ అధ్యక్షులు మాసన్న అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎస్.బాల్‌రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న స్వీపర్లకు, స్కావెంజర్లకు రాష్ట్ర వ్యాపితంగా ఒకే రకమైన వేతనాలను చెల్లించకుండా, కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగాన్ని నిర్మూలిస్తామని, అందరికీ గౌరవ ప్రదమైన వేతనాలు చెల్లిస్తామని చేస్తున్న ప్రభుత్వ ప్రకటనలకు, ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వారికి చెల్లిస్తున్న వేతనాలకు పొంతన లేదని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లకు, స్కావెంజర్లకు వేతనాలను ప్రతి నెలా 1వ తేదీన నేరుగా బ్యాంక్ ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వారందరికీ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఎండకాలం సెలవులలో టీచర్లకు వేతనాలు చెల్లిస్తూ స్వీపర్లకు, స్కావెంజర్లకు మధ్యాహ్న భోజన వంట కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడం ప్రభుత్వ దివాళా కోరు తనానికి నిదర్శనమన్నారు. సర్వీస్ వర్కర్స్కు స్వీపర్లను 240 రోజులు పనిచేస్తే పర్మినెంట్ చేయాలన్న సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి పర్మినెంట్ చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హులైన వారందరికీ డబుల్ బెడ్‌రూముల ఇండ్లు ఇవ్వాలని, కార్మికులందరికీ యూనిఫాం ఇవ్వాలని, సంవత్సరానికి 20 రోజులు సెలవులు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య, ఎన్.కరుణ కుమారి, రాంమూర్తి, చక్రపాణి, జి.సురేష్, టి.రమేష్, రాంచంద్రయ్య, కె.శోభారాణి, ముస్తఫ్ఫా పాల్గొని ప్రసంగించారు.

# అనుచిత వ్యాఖ్యలు ఆందోళనకరం

మహిళా ఐఎఎస్ అధికారిపై వచ్చిన అసభ్య, అనుచిత ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం: మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళా ఐఎఎస్ అధికారులను లక్ష్యంగా చేసుకుని కొంతమంది వ్యక్తులు, కొన్ని మీడియా వేదికలు అసభ్యంగా, అనుచితంగా, దూషణాత్మకంగా వార్తలు, వ్యాఖ్యలు చేయడం అత్యంత ఆందోళనకరమైన విషయం అని తెలంగాణ పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజాసేవలో నిమగ్నమైన మహిళా ఐఎఎస్ అధికారుల గౌరవాన్ని దెబ్బతీయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆమె అన్నారు. మహిళలు ఉన్నత స్థాయిలకు చేరితే వాటిని తట్టుకోలేని ఫ్యూడల్ మానసికతే ఈ రకమైన దుష్ప్రచారాలకు మూలమని ఆమె విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పని చేస్తోందని, అటువంటి పరిస్థితుల్లో మహిళా అధికారులను కించపరిచే వ్యాఖ్యలను, వారి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే ప్రచారాన్ని సహించబోమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ తరహా దూషణలు, అసభ్య వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని సీతక్క హెచ్చరించారు.

**ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్‌ఎస్ అధికారుల సంఘాలు ఖండన**

ఎన్‌టివి ఛానల్లో ఇటీవల ప్రసారమైన ఒక కార్యక్రమంలో విధి నిర్వహణలో ఉన్న మహిళా ఐఏఎస్ అధికారిపై చేసిన వ్యాఖ్యలను ఐఏఎస్, ఐపిఎస్, ఐఎఫ్‌ఎస్ అధికారుల సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఆ కార్యక్రమంలో చేసిన ఆరోపణలు పూర్తిగా అసత్యమైనవిగా, ఆధారాలు లేనివని అధికారులు పేర్కొన్నారు. పోస్టింగ్‌లు, విధి నిర్వహణ, వ్యక్తిగత అంశాలకు సంబంధించినట్టు చేసిన వ్యాఖ్యలు అధికారుల గౌరవ మర్యాదలకు, వారి గోప్యతకు, వృత్తిపరమైన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉన్నాయని తెలిపారు. జర్నలిజం పేరుతో నిర్ధారణలేని ఆరోపణలను వార్తలుగా ప్రసారం చేయడం సరైన పద్ధతి కాదని స్పష్టం చేశారు. సంబంధిత మహిళా అధికారులకు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పి, ఆ కంటెంట్ తొలగించాలని డిమాండ్ చేశారు. మహిళా అధికారుల గౌరవాన్ని కాపాడేందుకు తమ సహచర అధికారులకు పూర్తి మద్దతు ఇస్తామని ఐఏఎస్, ఐపిఎస్, ఐఎఫ్‌ఎస్ అధికారుల సంఘాలు పేర్కొన్నాయి.

ఎగరాలి ఎగరాలి మన ఎర్రజెండా – ఎదురుబెదురూ లేక..
చలో ఖమ్మం
2026 జనవరి 18
సిపిఐ శతవార్షికోత్సవ సభకు
వేలాదిగా తరలి రండి!

# ప్రజాస్వామ్య పథంలోకి పార్టీ (1947-1958)

స్వతంత్ర భారతదేశంలో తొలి దశాబ్దం భారత కమ్యూనిస్టు పార్టీ ప్రస్థానంలో ఉజ్వల ఘట్టమనవచ్చు. వలసపాలన కాలంలో బ్రిటిషు పాలకుల నుంచీ, తప్పు విధానాల స్వయం కృతాపరాధం వల్ల అనుభవించిన కష్టనష్టాలు, ప్రాణత్యాగాలనుంచి దిద్దుబాటు చర్యలతో తేరుకున్న పార్టీ 1952 తొలి సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొన్నది. సిపిఐ పార్లమెంటులో కాంగ్రెస్ తర్వాత రెండవపార్టీగా ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది. సిపిఐ అభ్యర్థి రావి నారాయణరెడ్డికి ఆ పార్లమెంటు ఎన్నికల్లో దేశంలోనే అత్యధిక ఓట్లు పోలైనాయి. పండిట్ నెహ్రూది రెండవస్థానం. నెహ్రూ ఆర్ఎన్ చేత పార్లమెంటు సభామందిరం ప్రారంభోత్సవం చేయించారు. ఆ ఎన్నికల్లో సిపిఐకి మొత్తం 55 లక్షల ఓట్లు పోలు (5.2శాతం) కాగా 27 లోక్‌సభ స్థానాలు లభించాయి. అసెంబ్లీ ఎన్నికల్లో 6.2 శాతం ఓట్లు పోలైనాయి. 'బూర్జువావర్గ ఎన్నికలు' బూటకం అన్న బిటిఆర్ ఒంటెత్తు పంథా తప్పు అని ఈ ఎన్నికలు నిరూపించాయి. 1957 సార్వత్రిక ఎన్నికల్లో కూడా సిపిఐకి పోలైన ఓట్లు 1 కోటి 20 లక్షలకు (10.9 శాతం) పెరిగాయి, సీట్లు 30కి చేరాయి. అసెంబ్లీల్లో కూడా ఓట్లు, సీట్లు పెరిగాయి. అసోంలో 10, పంజాబ్‌లో 14, పశ్చిమబెంగాల్‌లో 18, ఆంధ్రాలో 27 శాతం, కేరళలో 40శాతం ప్రత్యేకించి గమనించదగినవి. ఆంధ్రలో 1955 మధ్యంతర ఎన్నికల్లో అధికారంలోకి వచ్చే వాతావరణంలో, పార్టీ ఒంటెత్తు ఎత్తుగడలు, ప్రత్యర్థులందరూ ఐక్యం కావటం వల్ల తీవ్రమైన ఎదురుదెబ్బ తగిలింది. కేరళలో 1957లో కమ్యూనిస్టు పార్టీ బ్యాలెట్ ద్వారా అధికారం చేబట్టి సిద్ధాంతానికి సరికొత్త కోణం సమకూర్చింది.



అమృతసర్ మహాసభలో పాల్గొన్న ముఖ్య నాయకులను చిత్రంలో చూడవచ్చు

1951 అక్టోబర్‌లో కలకత్తాలో అజ్ఞాతంగా జరిగిన పార్టీ మహాసభ పార్టీ చరిత్రలో మలుపు. పార్టీ వైఖరుల సాధారణీకరణను మొదలుపెట్టింది. '1948 లైన్' మార్పు క్రమం 1949 చివరలో ప్రారంభమై 1952లో ఎన్నికల్లో పాల్గొనాలని పార్టీ నిర్ణయించేవరకు పరిసమాప్తమైంది. అది తొలిసారి పూర్తిస్థాయి 'పార్టీ కార్యక్రమం' ఆమోదించింది. 1951 అక్టోబర్‌లో అజయ్‌ఘోష్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికోబడ్డారు. 1952 డిసెంబర్ 30 నుంచి 1953 జనవరి 10 వరకు జరిగిన కేంద్ర కమిటీ విస్తృత ప్లీనం శాంతికై పోరాటం విషయంలో గత వైఖరిని మార్చుకుని శాంతి కోసం పోరాటాన్ని పార్టీ కీలకమైన కర్తవ్యంగా నొక్కిచెప్పింది. సోవియట్ యూనియన్, చైనాలతో వృద్ధిచెందుతున్న మైత్రిని వక్కాణించింది. పంచవర్ష ప్రణాళిక పట్ల వ్యతిరేక వైఖరి కూడదని చెప్పింది. ఆంధ్రలో ప్రజా ఉద్యమం దృష్ట్యా, భాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పాటును స్వాగతించింది.

1953లో మదురైలో జరిగిన మూడవ పార్టీ కాంగ్రెస్ స్వతంత్ర ప్రజా ఉద్యమంగా వృద్ధిచెందిన ప్రపంచ శాంతి ఉద్యమాన్ని పార్టీ స్వాగతిస్తూ, మూడవ ప్రపంచ యుద్ధం ప్రజ్వరిల్లకుండా అది నిరోధక శక్తిగా పనిచేస్తుందని భావించింది. శాంతి ఉద్యమంలో భారతదేశం పాత్రను, నెహ్రూ ప్రభుత్వ దోహదకారి చర్యలను హర్షించింది. గోవా, పుదుచ్చేరి విముక్తి పోరాట ఉద్యమం ప్రాముఖ్యతను వక్కాణించింది. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానంలో ప్రజాస్వామ్య ప్రభుత్వం కోసం దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమం నిర్మించాలని నిర్ణయించినట్లు అజయ్‌ఘోష్ తెలిపారు. రైతు సంఘంతో సంబంధం లేకుండా వ్యవసాయ కార్మికులను విడిగా ఆర్గనైజ్ చేయాలని నిర్ణయించారు.



అమృతసర్ మహాసభలో వేదికనలంకరించిన నాయకులు

భాష ప్రాతిపదికపై రాష్ట్రాలను పునర్‌నిర్మాణం చేయాలని సిపిఐ 1954లోనే కేంద్ర కమిటీ సమావేశంలో తీర్మానం ఆమోదించింది. అందుకు జరుగుతున్న జాప్యం పట్ల విచారం వ్యక్తం చేసింది. ప్రజా ఒత్తిడి కింద కేంద్ర ప్రభుత్వం రీ ఆర్గనైజేషన్ కమిషన్ ఏర్పాటు చేశాక, 19 రాష్ట్రాలు ఏర్పాటు చేయాలని, జాప్యం చేయకుండా 1954 సెప్టెంబర్ ఆఖరులోపు నివేదిక ఇవ్వాలని కమిషన్‌ను పార్టీ డిమాండ్ చేసింది. రాజ్ ప్రముఖ్ వ్యవస్థను, మాజీ రాజులకు చెల్లిస్తున్న రాజభరణాలు తదితర ప్రత్యేక సదుపాయాలు రద్దుచేయాలని కోరింది.

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు డిమాండ్ స్వాతంత్ర్య పోరాటంలో భాగం. కాంగ్రెస్ పార్టీ తమ పార్టీ నిర్మాణాన్ని భాషా ప్రావిన్సుల ప్రాతిపదికగా పునర్నిర్మించాలని 1921లోనే తీర్మానించింది.

### పార్టీ వైఖరిలో కీలకమైన మలుపు

1955 జూన్ 14–26 తేదీల్లో ఢిల్లీలో జరిగిన కేంద్ర కమిటీ సమావేశం సిపిఐ చరిత్రలో అత్యంత ముఖ్యమైన సైద్ధాంతిక – రాజకీయ మైలురాయి. అది ఆమోదించిన పత్రాలు భారతదేశ పరిస్థితిపై సమగ్ర విశ్లేషణను, పార్టీకి స్పష్టమైన వ్యూహాత్మక మార్గదర్శకాలు అందించాయి. సిపిఐ పునరుజ్జీవనంలో అది కీలకమైన పత్రం. పార్టీ తొలిసారి జాతీయ ఆర్థిక వ్యవస్థ పునర్‌నిర్మాణానికై సత్వర పారిశ్రామికీకరణను, భూ సంస్కరణలను చేపట్టాలని కోరింది. ప్రభుత్వ రంగాన్ని, భారీ పరిశ్రమలను, పంచవర్ష ప్రణాళికను పార్టీ బలపరిచింది. ప్రభుత్వరంగానికి జనసంఘ్–ఆర్ఎస్ఎస్ నాయకత్వంలోని మితవాద శక్తులతో పాటు మరీ అతివాదులు కూడా వ్యతిరేకం. ప్రజా(మాస్) కమ్యూనిస్టు పార్టీ, ప్రజా ప్రజాస్వామిక సంఘటన రెండూ అంతర్ సంబంధం కలిగినవిగా పేర్కొంటూ వాటి నిర్మాణానికి మార్గదర్శకాలు పొం దుపరిచింది. ఈ తీర్మానం ''ఐక్యత – పోరాటం'' భావనను సృజనాత్మకంగా అభివృద్ధి చేసింది. ప్రభు త్వ పథకాలు, ప్రాజెక్టులకు దూరంగా ఉండటం మానుకోవాలంటూ అదే సమయంలో వాటి సక్రమ అమలుకు ప్రజలను సమీకరించాలని కోరింది.

### సిపిఎస్‌యు 20వ కాంగ్రెస్ ప్రభావం

పార్టీ విశాల దృక్పథంతో, మరింత వెసులుబాటు వైఖరులు చేబట్టడానికి మార్క్సిస్టు సిద్ధాంతం ఆచరణ అభివృద్ధి చేయడానికీ అనేక ప్రపంచ ఘటనలు తోడ్పడ్డాయి. 1956లో జరిగిన సిపిఎస్‌యు (సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ) 20వ కాంగ్రెస్‌తో ఆ క్రమం ఆరంభమైంది. ఆ కాంగ్రెస్ డీస్టాలినైజేషన్‌తోపాటు పార్లమెంటరీ పంథా ద్వారా సోషలిజంలోకి శాంతియుత పరివర్తన, జాతీయ ప్రజాస్వామిక విప్లవం గూర్చి కొత్త భావన వగైరాలు ముందుకు తెచ్చింది. 1956లో పాల్ఘాట్‌లో జరిగిన సిపిఐ 4వ కాంగ్రెస్‌లో చర్చలు, సిపిఎస్‌యు కాంగ్రెస్ నిర్ణయాల చుట్టూ కేంద్రీకరించాయి. సిపిఐ, 'వ్యక్తి పూజ'ను వ్యతిరేకిస్తూనే, సోవియట్ సమాజ నిర్మాణంలో స్టాలిన్ పాత్రపై సిపిఎస్‌యు వైఖరిపై మరింత అధ్యయనం చేయాలని సిపిఐ కాంగ్రెస్ భావించింది.

1957లో కేరళలో బ్యాలెట్ ద్వారా కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి రావడం అత్యంత ప్రాముఖ్యత గల ఘటన. చరిత్రలో అటువంటి తొలి దృష్టాంతం 1953లో గయానాలో పీపుల్స్ ప్రోగ్రెసివ్ పార్టీ ఎన్నికల ద్వారా అధికారంలోకి రావడం. రాడికల్ పరివర్తనకు ఎన్నికలు, పార్లమెంటరీ సంస్థలను ఉపయోగించుకునే అవకాశాలపై విస్తృత చర్చకు కేరళ తెరతీసింది. రాడికల్ చర్యలు అమలు చేయడానికి బూర్జువా రాజ్యాంగాన్ని ఉపయోగించుకోగలమా అని అంతకుముందున్న అనుమానాలను కేరళ అనుభవం పటాపంచలు చేసింది. కేరళ ఫలితాలు: ''భారతదేశంలోని కమ్యూనిస్టు ఉద్యమానికే గాక యావత్ ప్రపంచానికీ ఒక కొత్త అంశం, కొత్త ప్రయోగం'' అని సిపిఐ ప్రకటించింది.

### నిబంధనావళిలో కొత్త పుంతలు : ఐదవ (అసాధారణ) కాంగ్రెస్, అమృత్‌సర్ 1958

1958 ఏప్రిల్ 6–13 తేదీల్లో జరిగిన అమృత్‌సర్ పార్టీ కాంగ్రెస్ సిపిఐ చరిత్రలో పలు విధాల మైలురాయి. అది పార్టీకి పునరుత్సాహం తెచ్చింది. పార్టీ సిద్ధాంతం, ఆచరణలో, దాని సంస్థాగత నిర్మాణం, నిబంధనావళిలో వ్యవస్థాగతంగా అనేక కొత్త లక్షణాలు ప్రవేశపెట్టింది. వాటిలో కొన్ని ప్రపంచంలోనే మొదటిసారి నిర్ణయాలు. కేరళ అనుభవం వెలుగులో ఈ నిర్ణయాలు మార్క్సిజం థియరీకి కొత్త లక్షణాలను చేర్చాయి.

**ఇది అసాధారణం ఎందుకంటే, <u>ఒకటి</u>, పార్టీ నిబంధనావళిలో ముఖ్యమైన మార్పులు చేసింది; <u>రెండు</u>, మాస్ కమ్యూనిస్టు పార్టీకి పిలుపు ఇచ్చింది; <u>మూడు</u>, పాల్ఘాట్ కాంగ్రెస్ సూత్రీకరణలను ముందుకు తీసుకెళ్లింది; రాజకీయ తీర్మానం, ఇతర పత్రాల్లో అనేక రాజకీయ సైద్ధాంతిక భావనలు వక్కాణించింది. <u>నాలుగు</u>, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రభావవంతమైన మార్పుల నేపథ్యంలో మహాసభ జరిగింది. <u>ఐదు</u>, కార్మిక వర్గ నియంతృత్వ భావనను పార్టీ విడనాడింది; <u>ఆరు</u>, భారతదేశంలో భవిష్యత్ సోషలిజంలో ప్రతిపక్షపార్టీలు అస్తిత్వం కలిగి ఉంటాయని అది ఊహించింది; <u>ఏడు</u>, సోషలిజంలోకి పరివర్తనకు పార్లమెంటరీ సంస్థలను ఉపయోగించుకోవాలని అది వక్కాణించింది.**

పార్టీ నిర్మాణంలో ప్రస్తుత మూడు అంచెల పద్ధతిని ఆమోదించింది అమృత్‌సర్‌లోనే. అవి– జాతీయ సమితి, కేంద్ర కార్యవర్గ కమిటీ, కేంద్ర కార్యదర్శి వర్గం. రాష్ట్రాలు, జిల్లాలకు కూడా వాటి పరిమాణాన్ని బట్టి ఇది అనుమతించబడింది.

కార్మికవర్గ నియంతృత్వం భావనను విడనాడిన ప్రపంచంలోని కొద్దిపార్టీల్లో సిపిఐ ఒకటి అయింది. మదురై పార్టీ కాంగ్రెస్ ఆమోదించిన నిబంధనావళి పీఠికలో ''కార్మిక వర్గ నాయకత్వంలో ప్రజాస్వామ్య రాజ్య స్థాపన కోసం, కార్మికవర్గ నియంతృత్వాన్ని సాధించటం కోసం.... సిపిఐ పని చేస్తుంది'' అని ఉంది.

వ్యక్తి స్వేచ్ఛ, వాక్, పత్రికా స్వేచ్ఛలు, అసోసియేషన్‌గా ఏర్పడే స్వేచ్ఛ, ప్రభుత్వాన్ని వ్యతిరేకించే వారికి సైతం (రాజ్యాంగానికి బద్ధులై ఉన్నంతవరకు) రాజకీయ పార్టీలు పెట్టుకునే హక్కు వక్కాణించబడింది.

పార్టీ ఛైర్మన్ పదవి అవసరం లేదని తీర్మానించింది. మూడంచెల నిర్మాణ వ్యవస్థతోపాటు డిపార్టుమెంట్ లు, సబ్ కమిటీల ఏర్పాటుకు అవకాశం కల్పించింది. అజయ్ ఘోష్‌ను ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నుకుంది.

**పార్టీ నిబంధనావళి పార్టీ చిహ్నం, పతా కానికి సంబంధించి ముఖ్యమైన మార్పు చేసింది. సిపిఐ ఈనాటికీ ఆచరిస్తున్నది అదే. పార్టీ పతాకం నుంచి ఐదు కోణాల నక్షత్రం తొలగించబడింది. ఎరుపురంగులోని జెండామధ్యలో అడ్డంగా సుత్తి కొడవలి ఉంటాయి.**

*(పార్టీలో చీలిక దిశగా ప్రయాణం రేపు)*

– ఎమ్మెస్సార్




## సిపిఐ క్యాడర్ సమాయత్తం కావాలి

### జాతీయ మహిళ సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లేశ్వరి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ఈనెల 18న ఖమ్మం పట్టణంలో సిపిఐ బారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు సిపిఐ క్యాడర్, సానుభూతిపరులు సమాయత్తం కావాలని జాతీయ మహిళ సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లేశ్వరి అన్నారు. శనివారం బహిరంగ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ కార్పోరేట్ మతతత్వ విధానాలను వ్యతిరేకిస్తూ సిపిఐ లౌకిక శక్తులను ఏకం చేసేందుకు ఈ బహిరంగ సభ తోడ్పడుతుందన్నారు. రైతులు, కార్మికులు పేదల సమస్యల పరిష్కారానికి సిపిఐ నిరంతరం ఉద్యమిస్తుందన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నీరుగార్చేలా కేంద్ర ప్రభుత్వం మార్పులు చేయడానికి తప్పు పట్టారు. అన్ని వర్గాల ప్రజలు భారీగా హాజరై సిపిఐ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకురాళ్లు సుందరి పద్మ, బండి ప్రమీల, లలిత, జ్యోతి, హసీనా, రవళి, ఆస్మా, శైలజ, బేబి, లక్ష్మి పాల్గొన్నారు.

## ఇంటికో మనిషి, ఊరుకో బండి

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు




**ప్రజాపక్షం/కోదాడ:** వందేళ్ల భారత కమ్యూనిస్టు పార్టీ ముగింపు సభలను జయప్రదం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం కోదాడలోని సిపిఐ కార్యాలయంలో జిల్లా ఎఐటియుసి విస్తృత కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 18న ఖమ్మంలో లక్షలాది మందితో జరిగే ర్యాలీ, బహిరంగ సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక, కర్షక, పేద ప్రజల పక్షాన 100 సంవత్సరాలుగా పోరాడుతున్న ఏకైక రాజకీయ పార్టీ సిపిఐ అని, దేశంలో ఎన్నో సుదీర్ఘ పోరాటాలు, ఆందోళనలు నడిపి నేటికి పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ముంగిపు సభను జయప్రదం చేయాలని కోరారు. ఇంటికో మనిషి, ఊరుకో బండి చేయి చేయి కలుపుదాం ఖమ్మం ఖిల్లాకు నడుద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్, నాయకులు షేక్ లతీఫ్, సుధాకర్‌రెడ్డి, శ్యామల అశోక్, ఎస్.రాఘవరెడ్డి, శ్రీనివాస్, ఎస్‌కె బాబు, రాఘవులు, కాంతారావు, జాని, కొండలు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## మాదాపూర్ శివారులో గుప్త నిధుల తవ్వకాల కలకలం

### ఆరుగురు అరెస్ట్





**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి భువనగిరిజిల్లా తుర్కపల్లి మండలంలోని మాదాపూర్ గ్రామ శివారులో గుప్త నిధుల తవ్వకాలు కలకలం రేపాయి తుర్కపల్లి ఎస్సై మహమ్మద్ తక్యుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం తుర్కపల్లి మండలంలోని మాదాపూర్ శివారు కేవ్లా తండా శివారు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నారన్నా సమాచారంతో నిందితుల గుట్టును పసిగట్టి ఆరుగురు వ్యక్తులను పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో పులి కుమారస్వామి(ఈసిఐఎల్), రామినేని కృష్ణ కిషోర్, పాబోలు శ్రీనివాస్, ఆకుల నరసింహ రావు(విజయవాడ), తాత కృష్ణ కాంత్(ఖమ్మం), పల్లపు వేణు(బొమ్మలరామారం) చెందినవారు అని, వారి వద్దనుంచి ఒక హిటాచి, కారు, పూజా సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మూఢనమ్మకాలు, క్షుద్ర పూజలను నమ్మొద్దని, వాటిని ప్రోత్సహించొద్దని, అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గుప్త నిధుల త వ్వకాలు గురించి ఎలాంటి సమాచారం ఉన్న పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## సామాజిక సేవకు గుర్తింపుగా శ్రీనివాస్‌రెడ్డికి డాక్టరేట్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** సామాజిక సేవకు గుర్తింపుగా డాక్టరేట్ శాలిగౌరారం మండలం పెరక కొండారం గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి కి భారత్ వర్చువల్ యూనివర్సిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ వారు డాక్టరేట్ కు ఎంపిక చేసి శనివారం బెంగళూరులో హోటల్ ఎజె ఇంటర్నేషనల్ నందు యూనివర్సిటీ చైర్మన్ డాక్టర్ తంగవేణి చేతుల మీదగా అందుకున్నారు.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 1965 లో స్థాపించిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా నాకు సేవ చేసే అవకాశం రావడం తను చేసిన సామాజిక సేవకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్ లభించడం చాలా సంతోషదాయకమని ఈ డాక్టరేట్ తో నాలోఉన్న సామాజిక సేవ అనే భావన రెట్టింపు చేసిందన్నారు.సామాజిక సేవ చేయడానికి తనను ప్రోత్సహించిన తల్లిదండ్రులకి, నా భార్య ప్రవళిక నా కూతుర్లు ఆధ్యా,అన్విరెడ్డి,డాక్టరేట్ ఎంపిక చేసిన యూనివర్సిటీ, జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ గోలి అమరేందర్‌రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# ప్రజా సమస్యలు వెలికితీస్తున్న 'ప్రజాపక్షం'



క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/బీబీనగర్ :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న పత్రిక ప్రజాపక్షం పత్రిక అని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో రహదారి బంగ్లాలో 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికలు ప్రజల వారధిగా పనిచేస్తూ ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి ప్రజల సమస్యలను వెలికి తీయడంలో స్వచ్ఛందంగా కృషి చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోలి పింగల్ రెడ్డి, పంజాల రామాంజనేయులు గౌడ్, ఫోటోల శ్యామ్ గౌడ్, సింగల్ విండో మాజీ చైర్మన్ మెట్టు శ్రీనివాస రెడ్డి, గడ్డం బాల్‌రెడ్డి, సురకాంటి సత్తిరెడ్డి, గోలి నరేందర్ రెడ్డి, సంధిగారు బసవయ్య, గోలి నర్సింహారెడ్డి పాల్గొన్నారు.



ప్రజాపక్షం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/మాడుగులపల్లి :** ప్రజల సమస్యలను నిష్పక్షపాతంగా వెలుగులోకి తీసుకొస్తున్న ప్రజాపక్షం దిన పత్రికను ఎస్ఐ ఎస్ కృష్ణయ్య ప్రశంసించారు. మండల కేంద్రంలో శనివారం ప్రజాపక్షం నూతనంగా2026 క్యాలెండర్ ఆవిష్కరించారు.సీనియర్ విలేకరి అమరారపు తిరుమలేష్ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న సంఘటనలు,ప్రజల సమస్యలు, ప్రభుత్వ కార్యక్రమాలు,రాజకీయలు,విద్య వైద్య వంటి అంశాలను ప్రజలకు చేరవేయడం, ప్రభుత్వ పాలనపై నిఘా ఉంచడం,ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రజాపక్షం పత్రికను ప్రజలు ఆదరించాలని కోరారు. ఏఎస్ఐ పుట్టల వెంకటేశ్వర్లు,జమిందార్ శ్రీనివాస్,చిరుమర్తి సర్పంచ్ కూరెళ్ల నాగమణి వెంకటాచారి,రైటర్ వాంకుడోతు శ్రీనివాస్,ప్రజాపక్షం విలేకరి వల్లపుదాసు రమేష్‌పాల్గొన్నారు.

## మాట నిలబెట్టుకోవడమే కాంగ్రెస్ ధ్యేయం

### కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



**ప్రజాపక్షం/కోదాడ:** ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల వ్యవధిలోనే ఆరు గ్యారెంటీలను అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిలుపుకుంటుందని తెలిపారు. శనివారం కోదాడ మండలం తొగర్రాయి గ్రామంలో నిర్వహించిన గిరిజనుల ఆరాధ్యదైవాలు సమ్మక్క సారక్క జాతరలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. అమ్మవార్ల అశీస్సులతో నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, రైతాంగానికి సమృద్ధిగా వర్షాలు పడి పంటలు పండాలని కోరారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ఆమె ప్రారంభించారు. పూజారి గౌని సైదమ్మ ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి, గాజులు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం కాంగ్రెస్ హామీలే ప్రజల జీవితాల్లో మార్పు గృహ జ్యోతి కార్యక్రమంలో ఎమ్మెల్యే లబ్ధిదారులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క రాసిన లేఖను అందజేశారు.

## అంతర్రాష్ట్ర థార్ గ్యాంగ్ ముఠా సభ్యుడు అరెస్ట్

### నిందితుడు నుండి బంగారు ఆభరణాలు స్వాధీనం




**ప్రజాపక్షం/ నల్లగొండ :** బస్సులలో బంగారు ఆభరణాలను దొంగలించే అంతరాష్ట్ర థార్ గ్యాంగ్ ముఠా సభ్యుడిని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం తో నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ వెల్లడించారు.శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో దొంగల ముఠా సభ్యులను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ15 రోజుల పాటు మధ్యప్రదేశ్‌లోని థార్ జిల్లాను జల్లెడపట్టి అంతరాష్ట్ర థార్ గ్యాంగ్ దొంగల ముఠా సభ్యుడి నీ సిసిఎస్ పోలీసులు అరెస్టు చేసి నిందితుడి వద్ద నుండి దొంగలించిన రూ.85 లక్షల విలువగల ఇంటాక్ట్ ప్రాపర్టీ 600 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు.ముఠాలోని ఐదుగురు అలవాటు పడిన నేరస్తులేనని గతంలో ఆంధ్రప్రదేశ్,మహారాష్ట్ర మధ్యప్రదేశ్ రాష్ట్రంలలో నిందితులుగా ఉన్నారని, పరారీలో ఉన్నమిగితా నేరస్తులను కూడా అతి త్వరలో పట్టుకుంటామని పేర్కొన్నారు. ఈ ముఠా సభ్యులను సిసిఎస్, ఇన్స్పెక్టర్ ఎం. జితేందర్ రెడ్డి పర్యవేక్షంలో పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచిన,చిట్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజు ,సిసిఎస్ ఎస్ఐ శివ కుమార్, సిసిఎస్ హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధన గిరి,పుష్ప గిరి, నాగరాజు,కానిస్టేబుల్స్ వెంకటేష్,సాయికుమార్,జూనేద్,శివరాజు, మహేశ్, కమల్ కిశోర్,చిన్న బాబు,ఇతర సిసిఎస్ సిబ్బందిని జిల్లా ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించి రివార్డును ప్రకటించారు.

# హెల్మెట్ ధరించినప్పుడే ప్రాణరక్షణ

### ఎస్‌పి శరత్‌చంద్రపవార్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ద్విచక్ర వాహన దారులు హెల్మెట్‌ను ధరించినప్పుడే ప్రాణాలకు రక్షణ ఉంటుందని జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిలు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంపులో 500 మంది ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను పంపిణి చేసి వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని హెల్మెట్ ధరించక పోతే బంక్‌లలో పెట్రోల్ పోయరాదని పెట్రోల్ బంక్ యజమానులకు సూచించారు. నో హెల్మెట్ నో పెట్రోల్ విధానాన్ని ఖచ్చితంగా పాటించాలని, నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల వాయు కాలుష్యం నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. తగిన ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనదారులు వ్యవహరించాలన్నారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ప్రతి ఒక్కరు ఖచ్చితంగా హెల్మెట్‌ను ధరించాలని అందుకోసం గతంలో నియోజకవర్గ వ్యాప్తంగా హెల్మెట్లను పంపిణి చేశానన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకోని హెల్మెట్లను ఉచితంగా పంపిణి చేశామన్నారు. అనంతరం హెల్మెట్ల వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 2వేల మందితో పట్టణంలో ద్విచక్ర వాహనాలపై హెల్మెట్‌లు ధరించి ర్యాలి నిర్వహించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐలు నాగభూషణరావు, సోమనర్సయ్య, పీఎన్‌డి. ప్రసాద్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఒపిఎం మాదకద్రవ్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



**ప్రజాపక్షం/చిట్యాల :** అక్రమంగా ఓపీఎం పాపి హస్క్ అనే మాదకద్రవ్యాన్ని లారీ డ్రైవర్లకు విక్రయిస్తున్న నిందితున్ని అరెస్టు చేసినట్లు నల్లగొండ డిఎస్‌పి కె శివరాం రెడ్డి తెలిపారు. శనివారం చిట్యాల పట్టణంలోని సిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణ శివారులో జాతీయ రహదారి 65పై ఉన్న దూన్ పంజాబీ దాబాలో ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌కు చెందిన దాబా యజమాని గుర్నిత్ సింగ్ గత కొంతకాలంగా నిషేధిత మాదకద్రవ్యమైన ఓపియం పాపి హస్క్ ఉందని దానిని దాబాలోని కస్టమర్లకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నాడని వచ్చిన సమాచారం మేరకు చిట్యాల ఎస్ఐ మామిడి రవికుమార్ సిబ్బందితో కలిసి శుక్రవారం రాత్రి సుమారు 10 గంటలకు దాబాకు వెళ్లి యజమాని గుర్నిత్ సింగ్ నిషేధిత ఓపియం పాపి హస్క్ ను వాహనదారులకు విక్రయిస్తుండగా పట్టుబడి చేశారు.అనంతరం ఎస్ఐ మామిడి రవికుమార్ దాబా యజమానిని విచారించగా సులభంగా డబ్బు సంపాదించేందుకు గాను లారీ డ్రైవర్ల నుండి తాను ఓపిఎం పాపి హస్కును ఒక్క కిలో రూ.1800 కొనుగోలు చేసి దానిని తిరిగి కిలో రూ.6000 చొప్పున వాహన దారులకు విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు.కొద్దిరోజుల క్రితం 10 కిలోల ఓపియం పాపి హస్క్ కొనుగోలు చేసి అందులో సుమారు ఒక కిలో కస్టమర్లకు విక్రయించి మిగిలిన 9 కిలోల ఓపియం పాపి హస్కును దాబా లోని తన గదిలో దాచి పెట్టినట్లు తెలిపారు.దాబా యజమాని నుండి రూ.54000 రూపాయల నగదు,9 కిలోల ఓపియం పాపి హస్క్,ఒక స్మార్ట్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి సరఫరా అమ్మే వ్యక్తులపైనే కాకుండా సేవించే వ్యక్తుల పైన కూడా చట్టపరమైన శిక్షలు తీసుకుంటామన్నారు.మాదక ద్రవ్యాల ఎవరైనా విక్రయించిన సేవించిన 100 నెంబర్‌కు గాని లేదా 8712670266 నెంబర్కు గాని సమాచారం అందించినట్లయితే వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.ఈ సమావేశంలో నార్కట్ పల్లి సీఐ కె నాగరాజు, చిట్యాల ఎస్ఐ మామిడి రవికుమార్,మునుగోడు ఎస్ఐ ఇరిగి రవి, సిబ్బంది ఉన్నారు.

## గంజాయి కేసులో పట్టుబడ్డ నిందితులు

### నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** అక్రమ మాదకద్రవ్యాలు సరఫరా చేసినా, అమ్మినా ఎవరైనా వినియోగించిన ఉపేక్షించే లేదని కఠిన చర్యలు తీసుకుంటామని నల్లగొండ డిఎస్‌పి కె శివరాం రెడ్డి హెచ్చరించారు. శనివారం పట్టణంలోని టూ టౌన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంజాయిని అక్రమంగా విక్రయిస్తూ ఉన్న ఇద్దరి నిందితుల ను రూరల్ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుండి 4.6 కిలోల గంజాయిని, రెండు సెల్ఫోన్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. గంజాయి విలువ రూ.15 వేలు ఉంటుందని మొదటి నిందితుడు హైదరాబాద్ లోని అబ్దుల్ సాగర్ ధవభీ ఘాట్ మల్లేపల్లి కి చెందిన సయద్ మాజిద్, రెండవ నిందితుడు మొహమ్మద్ సోహైల్ అలీ,శివ రెడ్డి పరారీలోఉన్నాడని అతని త్వరలో పట్టుకుంటామని తెలిపారు.నిందితులు ఇద్దరు గత రెండు సంవత్సరాల నుండి తమ స్నేహితుల ద్వారా కలిసి గంజాయి సేవించడం ప్రారంభించరని.ఆ తర్వాత గంజాయి అమ్మడం ద్వారా సులభంగా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని తెలుసుకొని, గత 4 నెలల నుండి ఒడిశాలో గంజాయి అమ్మే శివ రెడ్డి ఏ పాబ్లో ఎస్కోబార్ అనే వ్యక్తితో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం చేసుకొని,ఇద్దరు పలుమార్లు ఒడిశాకు పలుమార్లు వెళ్లి గంజాయిని తక్కువ ధరకు అనగా గంజాయికిలోకు రూ 3000 రూపాయల చొప్పున,సుమారు 2,3 కిలోలు గంజాయిని కొనుగోలు చేసిహైదరాబాద్ కి వచ్చి,అట్టి గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి ప్యాక్ చేసి అవసరం ఉన్న కస్టమర్లకు ఒక్కో ప్యాకెట్‌ను రూ 500. చొప్పున అధిక ధరకు అమ్మి డబ్బులు సంపాదించే వారని తెలిపారు.

# 'హస్తం' పార్టీ అస్తవ్యస్తం..!

### ఎవరికి వారే యమునా తీరే...
### మున్సిపల్ ఎన్నికలకు ముందే మొదలైన ముసలం...!
### ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు...





**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ అస్తవ్యస్తంగా మారింది. నాయకులు ఎవరికి వారే యమునా తీరేగా వ్యవహరించడంతో ఆ పార్టీలో ఏమి జరుగుతుందో కూడా స్వంత పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కూడా అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. నాయకుల మధ్య సఖ్యత లేకపోవడంతో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత జరిగిన మూడు సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఆ పార్టీ నుండి పోటీ చేసిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఓటమి చెందారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డికి పార్టీ అధిష్టానం నియోజక వర్గ ఇంచార్జీగా నియామకం చేసింది. ఆయన 01 అక్టోబర్ 2025లో అకాల మరణం పొందారు. దీంతో సూర్యాపేట నియోజక వర్గంలో పార్టీ ఇంచార్జీ పదవి ఖాళీగా ఉంది. పార్టీ అధిష్టానం ఈ ఇంచార్జీ బాధ్యతలను ఎవరికి అప్పగించకపోవడంతో పార్టీకి పెద్దదిక్కు ఎవరన్నది నాయకులు, కార్యకర్తల్లో కూడా అయోమయం నెలకొంది. పార్టీలో గత తొమ్మిదేండ్ల నుండి దామోదర్ రెడ్డి వర్సెస్ పటేల్ రమేష్ రెడ్డి మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతుంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో టిక్కెట్ కోసం ఇరువురి మధ్య తీవ్ర పోటీ నెలకొనగా రమేష్ రెడ్డిని బుజ్జగించి పార్టీ అధిష్టానం దామోదర్ రెడ్డికి టిక్కెట్ ఖరారు చేసింది. పార్టీ అధికారంలోకి వస్తే మంచి పదవిని ఇస్తామంటూ ఆశ చూపి అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నామినేటెడ్ పోస్టు కట్టబెట్టింది. అయినా ఆధిపత్య పోరు మాత్రం సమసిపోలేదు. దీంతో నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ రెండుగా విడిపోయి ఎవరికి వారే కార్యక్రమాలు చేసుకుంటూపోయారు. దామోదర్ రెడ్డి మరణానంతరం ఆయన కుమారుడు సర్వోత్తమ్ రెడ్డి క్రియాశీలక రాజకీయాల్లోకి ఆరంగేట్రం చేశారు. సూర్యాపేట నియోజక వర్గంతోపాటు తుంగతుర్తి నియోజక వర్గంలో కూడా ఆయన విస్తృతంగా పార్టీ కార్యక్రమాలు చేపడుతూ పార్టీ క్యాడర్‌కు అందుబాటులో ఉంటున్నారు. పటేల్ రమేష్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ హోదాలో సూర్యాపేట నియోజక వర్గంలో ఎక్కువ సమయాన్ని కేటాయిస్తూ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఈ ఇరువురు నాయకులు పార్టీ నియోజక వర్గ ఇంచార్జీ పదవిని ఆశిస్తూ అధిష్టానం వద్ద తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

మున్సిపల్ ఎన్నికల ముందే కాంగ్రెస్ పార్టీలో నాయకుల మధ్య ముసలం మొదలైంది. నాయకుల మధ్య ఎన్ని విభేదాలు ఉన్నా ఎన్నికల ముందు అవన్ని పక్కకు పెట్టి అందరూ కలిసి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాల్సిన బాధ్యత ఉంది. కానీ గత ఆనవాయితీనే దామోదర్ రెడ్డి తనయుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, పటేల్ రమేష్ రెడ్డిలు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికలను నిర్వహిస్తామని ప్రకటించడం, రాష్ట్ర ఎన్నికల కమీషన్ దానికి సంబంధించిన ఏర్పాట్లలో తలమునకలు కావడంతో రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న అభ్యర్థులు తమకు ముందుగా దరఖాస్తు చేసుకుంటే సర్వే నిర్వహించి దాని ఆధారంగా టిక్కెట్లు కేటాయిస్తామని ప్రకటించారు. టిక్కెట్‌ను ఆశిస్తున్న వారి నుండి దరఖాస్తులను స్వీకరించడం కూడా మొదలుపెట్టారు. ఈ సమావేశానికి పటేల్ వర్గీయులు ఎవరూ కూడా హాజరుకాలేదు. అనంతరం మరో నాలుగు రోజుల తరువాత పటేల్ రమేష్ రెడ్డి కూడా మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. రెండు రోజుల నుండి అతను కూడా మున్సిపల్ ఎన్నికల బరిలో నిలువాలనుకునే వారినుండి దరఖాస్తులు స్వయంగా స్వీకరిస్తున్నారు. పార్టీ నాయకులు రెండు వర్గాలుగా చీలడంతో ఎన్నికల్లో టిక్కెట్‌ను ఆశిస్తున్న వారు ఎవరి వద్ద దరఖాస్తు చేసుకోవాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. ఇరువర్గాల దగ్గర దరఖాస్తు చేసుకున్న వారు తమకు టిక్కెట్ వస్తుందా రాదా అనే సందిగ్ధంలో పడ్డారు.

ఇరువర్గాల వారు మున్సిపల్ సన్నాహక సమావేశాలు నిర్వహించినప్పుడు ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకున్నారు. అసలైన కాంగ్రెస్ వాదులం మేమే అనేలా ఎవరికి వారు ప్రసంగాలు చేశారు. పటేల్ రమేష్ రెడ్డి ఒక డుగు ముందుకు వేసి కాంగ్రెస్ పార్టీ ఎవరి జాగీరు కాదని తీవ్రంగా హెచ్చరిస్తూ డబ్బులకు టిక్కెట్లు అమ్ముకునేందుకే దరఖాస్తుల స్వీకరణ తెరమీదకు తెచ్చారంటూ తీవ్ర ఆరోపణలు చేయడం జరిగింది. టిక్కెట్ కోసం డబ్బులు అడిగే వారిని ఉరికిచ్చి కొట్టండి అంటూ చేసిన ప్రసంగం సోషల్‌మీడియాలో వైరల్ అవుతుంది. దీనికి స్పందిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య మీడియాతో మాట్లాడుతూ పార్టీ అధిష్టానం మేరకే దరఖాస్తుల స్వీకరణ చేపట్టామని చెప్పుకొచ్చారు. నాయకులను, కార్యకర్తలను కొంతమంది గందరగోళానికి గురిచేస్తున్నారని ఆరోపించారు. ఏదిఏమైనా మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే టిక్కెట్ కేటాయించి సూర్యాపేట మున్సిపాలిటిపై మూడు రంగుల జెండాను ఎగురవేస్తామని చెప్పుకొచ్చారు.

జాతీయం
NATIONAL & GENERAL NEWS
కరీంనగర్
ఆదివారం
11-01-2026
www.prajapaksham.in
ప్రజాపక్షం
Telugu National Daily


## స్వాతంత్ర్య సమరయోధుల ధీరత్వాన్ని...
# యువత పుణికిపుచ్చుకోవాలి

### జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఉద్బోధ



**న్యూఢిల్లీ :** భారతదేశం సరిహద్దుల వద్ద మాత్రమే కాకుండా దాడులు, అభివృద్ధి బాధాకరమైన చరిత్ర 'ప్రతీకారం తీర్చుకోవడానికి' అర్థవంతంగా సమ అన్నివిధాలుగా తనను తాను బలోపేతం చేసుకోవాలని జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ పేర్కొన్నారు. శనివారం ఇక్కడ జరిగిన 'వికసిత్ భారత్ యంగ్‌లీడర్స్ డైలాగ్' ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన గౌరవ అతిథిగా హాజరై ప్రసంగించారు. మనదేశ చరిత్ర నుంచి యువత పాఠాలు నేర్చుకోవాలని ఆయన యువతకు సూచించారు. ప్రతీకారం మంచిది కాదని దానిని ప్రేరణశక్తిగా మలుచుకోవాలని దోవల్ పిలుపు నిచ్చారు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాటాలు, త్యాగాలు చేసిన మహాత్మాగాంధీ, సుభాష్‌చంద్ర బోస్, భగత్‌సింగ్ వంటి స్వాతంత్ర్య సమరయోధుల ధీరత్వాన్ని యువత పుణికిపుచ్చుకోవాలన్నారు. 'మీరు స్వతంత్ర భారతదేశంలో జన్మించడం మీ అదృష్టం. నేను వలస రాజ్యాల భారతదేశంలో జన్మించాను. మన పూర్వీకులు స్వాతంత్ర్యం కోసం పోరాడే క్రమంలో అనేక కష్టాలు, ఇబ్బందులను ఎదుర్కొన్నారు' అని 81 ఏళ్ల మాజీ ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ దేశవ్యాప్తంగా ఇక్కడకు వచ్చిన 3,000 మంది యువ ప్రతినిధులను ఉద్దేశించి ఉద్బోధించారు. భగత్ సింగ్ లాంటి వారిని ఉరితీశారని, సుభాష్‌చంద్ర బోస్ స్వాతంత్ర్యం కోసం తన జీవితాంతం పోరాడారని, మన కోసం స్వాతంత్ర్యం సంపాదించి పెట్టేందుకు మహాత్మాగాంధీ సత్యాగ్రహం చేయాల్సి వచ్చిందని అజిత్‌దోవల్ ఉదహరించారు. ప్రతీకారం అనేది మంచి పదం కాదు కానీ అది ఒక గొప్ప శక్తిగా ఉంటుంది. కేవలం మన సరిహద్దుల వద్దనే కాకుండా దేశాన్ని గతంలో జరిగిన అఘాయిత్యాలకు ప్రతీకారం తీర్చుకోవాలని, దేశ సైనిక, ఆర్థిక, సామాజిక భద్రత ఎంతైనా అవసరం. ఈ కార్యక్రమానికి హాజరైన వారినుద్దేశించి భవిష్యత్ నాయకులను అజిత్ దోవల్ పేర్కొంటూ బలమైన నాయకత్వం అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. దీనిని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నిరూపించారని అజిత్ దోవల్ పేర్కొన్నారు. నాయకత్వ ప్రాధాన్యతను నెపోలియన్ ఒకసారి ఇలా చెప్పారని ఉటంకించారు. 'ఒక గొర్రె నాయకత్వంలోని 1000 సింహాలకు నేను భయపడను. కానీ..ఒక సింహం నేతృత్వంలోని 1000 గొర్రెలకు మాత్రం తప్పకుండా భయపడతాను' అని నెపోలియన్ చెప్పిన గొప్ప మాటను ఎన్ఎస్ఏ సలహాదారు దోవల్ ఈ సందర్భంగా యువతకు గుర్తు చేశారు. మనది ఒక ప్రగతిశీల సమాజం అన్నారు. మనం ఇతర నాగరికతలపై లేదా వారి దేవాలయాలపై, ఏ దేశ ప్రజలపైనా దాడి మాత్రం చేయలేదన్నారు. కానీ భద్రత విషయంలో మనకు స్వీయ అవగాహన లేకపోవడంతో చరిత్ర మనకు ఒక పాఠం నేర్పిందని, అయితే మనం ఆ పాఠం నేర్చుకున్నామా? అని అజిత్ దోవల్ ప్రశ్నించారు. మనం ఆ పాఠాన్ని గుర్తుంచుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. ఎందుకంటే యువత దానిని మర్చిపోతే అది దేశానికి విషాదకరమన్నారు. ప్రపంచంలోని ప్రతి సంఘర్షణ భద్రతా సమస్య నుండే పుడుతుందని అజిత్ దోవల్ చెప్పారు. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి మన్సుఖ్ మాండవీయ యువకుల సమావేశంలో ప్రసంగించారు. యువకులను ఉద్దేశించి ప్రసంగించడం తనకు ఆశ్చర్యపరిచిందని అజిత్ దోవల్ చెబుతూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. 'మీలో చాలా మంది నాకంటే కనీసం 60ఏళ్ల చిన్నవారు. నేను మీతో ఏమి చర్చించాలనేది ఆలోచిస్తున్నాను. నా యవ్వనం చాలా కాలం కిందట ఉంది. మీ యవ్వనం ఏమిటో కూడా నాకు తెలియదు' అని అజిత్ దోవల్ చమత్కరించారు. నిర్ణయాత్మకంగా ఉండడం, ఆ నిర్ణయానికి కట్టుబడి ఉండటానికి దృఢ నిశ్చయాన్ని కూడా కలిగి ఉండాలి' అని ఆయన సూచించారు. యువత సాంకేతికత, సైన్స్‌లో ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని కోరారు.

# ఎన్నికలప్పుడే ప్రతిపక్ష నేతలపై దాడులా?

### ఇడి చర్యను ప్రశ్నించిన కపిల్ సిబల్



**న్యూఢిల్లీ :** ఎన్నికలు జరుగుతున్నప్పుడు మాత్రమే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ప్రతిపక్ష నాయకులపై ఎందుకు చర్యలు తీసుకుంటుందోనని స్వతంత్ర ఎంపి కపిల్ సిబల్ శనివారం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దర్యాప్తు సంస్థల అధికార పరిధిపై తన ముందు పెండింగ్‌లో ఉన్న సమీక్ష పిటిషన్లను విచారించాలని సుప్రీం కోర్టును కోరారు. ఇక్కడ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో ఇడి చర్య వెనుక ఉన్న ఏకైక ఉద్దేశం ప్రతిపక్ష నాయకులను వేధించడమేనని, జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్, అసెంబ్లీ ఎన్నికల సమయంలో బిహార్‌లో లాలూ ప్రసాద్, తేజస్వి యాదవ్‌పై దర్యాప్తు సంస్థలు చర్య తీసుకున్న ఉదాహరణలను ఉదహరించారు. పశ్చిమ బెంగాల్‌లో ఐప్యాక్‌పై దాడులు చేసిన తర్వాత ఇడి ఏమి దర్యాప్తు చేస్తోందని కూడా ఆయన ప్రశ్నించారు. దర్యాప్తు సంస్థ అన్ని పత్రాలను తీసుకెళ్లలేదన్నారు. బొగ్గు అక్రమ రవాణా కేసుకు సంబంధించి కోల్‌కతాలోని రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ ఐప్యాక్ కార్యాలయం, దాని చీఫ్ నివాసంలో గురువారం ఇడి దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా ఇడి అధికారులు అడ్డంకులను ఎదుర్కొన్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆ ప్రాంగణంలోకి ప్రవేశించి దర్యాప్తునకు సంబంధించిన 'కీలక' ఆధారాలను తీసుకెళ్లారని ఇడి ఆరోపించింది. కేంద్ర మాజీ మంత్రి కూడా అయిన కపిల్ సిబల్ మాట్లాడుతూ యూపీఏ ప్రభుత్వం తప్పుడు సమాచారం ఆధారంగా ఏ రాజకీయ పార్టీపైనా లేదా నాయకుడిపైనా విచారణ జరపలేదని, 2004 నుంచి 2014 మధ్య యుపిఎ అధికారంలో ఉన్నప్పుడు ఇడికి ఎప్పుడూ ఇంతటి స్వేచ్ఛ ఇవ్వలేదని తెలిపారు. 'ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయబడినప్పుడు అది దేశంలో ఎక్కడికయినా, ఎప్పుడయినా వెళ్లగల సర్వవ్యాప్త విచారణ సంస్థ అని మాకు తెలియదు. ప్రతిపక్ష నాయకులను ఇబ్బంది పెట్టడం, వారి ప్రభుత్వాలను కూల్చివేసేలా చేయడం వంటివి చేయగలదు. అది సమర్థించబడినా కాకపోయినా' అని ఆయన విలేకరులతో అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న పరిణామాలపై తాను బాధపడ్డానని పేర్కొంటూ, 'మన దేశ ఐక్యత, సమగ్రతకు భంగం కలగకూడదని నేను కోరుకుంటున్నాను' అని సిబల్ అన్నారు. ఈ సంఘటనల దృష్ట్యా, కేంద్రం రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించగలదా అని అడిగిన ప్రశ్నకు, 'ఎవరయినా ఎటువంటి ఆధారం లేకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకుంటే, అది కూడా పరిణామాలను కలిగి ఉంటుంది. వారు మూడింట రెండు వంతుల మెజారిటీతో గెలిస్తే, నాలుగింట మూడు వంతుల విజయం ఉంటుంది' అని తెలిపారు. 'అన్ని సమస్యలను సుప్రీం కోర్టు పరిశీలించాల్సిన సమయం వచ్చింది. లేకపోతే, సమాఖ్య వ్యవస్థ కుప్పకూలిపోతుంది. ఇది ప్రజలకు ఏ మాత్రం నచ్చదు' అని తెలిపారు. ఎక్కడ ఎఫ్ఐఆర్ నమోదయినా ఇడి అక్కడికి చేరుకుంటోందని, ప్రతిచోటా విచారణ జరిపే హక్కు తమకు ఉందని అది భావిస్తోందని ఆయన అన్నారు. 'ఎన్నికలు జరిగే చోట మాత్రమే ఇడి రంగంలోకి దిగడం కూడా ఆసక్తికరంగా ఉంది. ఎన్నికల సమయంలో ఇడి జార్ఖండ్‌కు చేరుకున్న విషయం గుర్తుండే ఉంటుంది. బిహార్‌లో కూడా అదే జరిగింది. ఎన్నికల సమయంలో ఇడి అక్కడికి చేరుకుంది. కోర్టు ఒక ప్రక్రియను ప్రారంభించింది. దీనివల్ల లాలూ ప్రసాద్, తేజస్వి యాదవ్ ఢిల్లీకి రావాల్సి వచ్చింది. దీంతో వారి ఎన్నికల ప్రచార షెడ్యూల్ దెబ్బతింది' అని తెలిపారు. 'ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలు జరగనున్నందున ఇడి అక్కడికి చేరుకుంది' అని సిబల్ అన్నారు. ఐప్యాక్‌పై దాడుల సమయంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి ఆటంకం కలిగించారని ఇడి చేసిన ఆరోపణల గురించి అడగ్గా, 'ఇడి ముందుగా తాము దేనిపై విచారణ జరుపుతున్నారో చెప్పాలి. వారు బొగ్గు కుంభకోణానికి సంబంధించిన పత్రాలను కోరుకుంటే, కనీసం వార్తాపత్రికలు అలానే నివేదిస్తున్నాయి. అప్పుడు వారు కంప్యూటర్లకు సంబంధించిన సమాచారం కోరి ఉండాల్సింది. మేము ఏమీ తీసుకోము. బొగ్గు కుంభకోణానికి సంబంధించిన సమాచారాన్ని అడుగుతాము. ఎన్నికల ప్రక్రియ సమయంలో అకస్మాత్తుగా వారికి పత్రాలు సేకరించాలనే ఆలోచన వచ్చింది. వారు గందరగోళం సృష్టించాలనుకుంటున్నారు. పశ్చిమ బెంగాల్‌లో వారు (బిజెపి) గెలవలేనందున టిఎంసిని, మమతా బెనర్జీని ఎలా ఇబ్బంది పెట్టాలన్నదే వారి ఉద్దేశం' అని అన్నారు. 'ఇడి దేవుడిలా సర్వవ్యాపి. ఇడి ఈ ప్రభుత్వానికి దేవుడు. అది ఏదైనా చేయగలదు. సిబిఐ కూడా అంతే' అని కపిల్ సిబల్ వ్యాఖ్యానించారు.

## జార్ఖండ్ కార్మికులు నైజర్‌లో కిడ్నాప్..
# 8 నెలల తర్వాత భారత్‌కు

**రాంచీ:** జార్ఖండ్‌కు చెందిన ఐదుగురు కార్మికులు పశ్చిమ ఆఫ్రికా దేశమైన నైజర్‌లోని ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నారు. ఆ దేశంలో వారు కిడ్నాప్ అయ్యారు. అయితే 8 నెలల తర్వాత సురక్షితంగా భారత్‌కు చేరుకున్నారు. జార్ఖండ్‌లోని గిరిదిహ్ జిల్లా బాగోదర్‌కు చెందిన ఫల్జిత్ మహతో, రాజు కుమార్, చంద్రిక మహతో, సంజయ్ మహతో, ఉత్తమ్ మహతో గత ఏడాది ఆఫ్రికా దేశమైన నైజర్ వెళ్లారు. ట్రాన్స్‌మిషన్ లైన్లు వేసే ఒక ప్రైవేట్ కంపెనీలో వారు పని చేస్తున్నారు. కాగా, 2025 ఏప్రిల్ 27న జార్ఖండ్‌కు చెందిన ఈ ఐదుగురు కార్మికులు నైజర్‌లో కిడ్నాప్ అయ్యారు. ఈ సమాచారం తెలుసుకున్న వారి కుటుంబాలు ప్రభుత్వ సహాయాన్ని కోరాయి. సిఎం హేమంత్ సోరెన్ ఆదేశాల మేరకు రాష్ట్ర వలస కార్మికుల నియంత్రణ అధికారులు నైజర్‌లోని ప్రైవేట్ కంపెనీని సంప్రదించారు. నైజర్‌లోని భారత రాయబార కార్యాలయం, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహాయంతో కిడ్నాపర్ల చెర నుంచి వారిని విడిపించారు. మరోవైపు సుమారు 8 నెలల తర్వాత నైజర్‌లో కిడ్నాపైన జార్ఖండ్ కార్మికులు జనవరి 9న విమానంలో ముంబై చేరుకున్నారు. ఆరోగ్య పరీక్షలు, అవసరమైన ప్రభుత్వ, చట్టపరమైన లాంఛనాల తర్వాత జనవరి 14న జార్ఖండ్‌లోని వారి సొంతూరు చేరుకుంటారని ఆ రాష్ట్ర వలస కార్మికుల నియంత్రణ అధికారి తెలిపారు.

## రోబో శునకాలతో ఓట్ల వేట
# ఓటర్లకు భారీ కానుకల వెల్లువ



**పుణె:** మహారాష్ట్రలోని పుణె, పింప్రిచించ్వాడ్ సహా 29 మున్సిపల్ కార్పొరేషన్లకు జనవరి 15న పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు మునుపెన్నడూ లేని విధంగా అత్యాధునిక సాంకేతికతను వాడుతున్నాయి. ముఖ్యంగా ఓట్లు అడుగుతూ వీధుల్లో తిరుగుతున్న 'రోబోటిక్ డాగ్స్' అందరినీ ఆకర్షిస్తున్నాయి. ఈ రోబో శునకాలకు పోస్టర్లను కట్టి కొందరు ప్రచారం నిర్వహిస్తుండగా... మరికొందరు కార్యకర్తలు ఎల్ఇడి (ఎల్ఇడి ) స్క్రీన్లను బ్యాక్‌ప్యాక్‌ల మాదిరిగా తగిలించుకుని అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తున్నారు. జనవరి 16న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ హైటెక్ ప్రచారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రచారానికి సమయం తక్కువగా ఉండటంతో అభ్యర్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై ఎక్కువగా ఆధారపడుతున్నారు. సోషల్ మీడియాలో వైరల్ అయ్యేలా రీల్స్, వీడియోలు, కంటెంట్ సృష్టించడానికి ఏఐని వాడుతున్నారు. ఇది ఖర్చు తగ్గించడమే కాకుండా తక్కువ సమయంలో ఎక్కువ మందికి చేరువయ్యేలా చేస్తోంది. ఓటర్ల నాడిని విశ్లేషించేందుకు, ప్రజలతో సంభాషించేందుకు చాట్‌బాట్‌లను రంగంలోకి దించారు. లోహెగావ్, విమాన్ నగర్ వంటి ప్రాంతాల్లో అభ్యర్థులు డేటా ఆధారిత ప్రెజెంటేషన్లు ఇస్తూ... ప్రతి ఆరు నెలలకోసారి తమ ప్రగతి నివేదికను సమర్పిస్తామని ఓటర్లకు హామీ ఇస్తున్నారు. ఓట్ల వేటలో అభ్యర్థులు వినూత్న హామీలతో పాటు భారీ బహుమతులను ఎరగా వేస్తున్నారు. కొందరు అభ్యర్థులు లక్కీ డ్రా ద్వారా ఎస్‌యూవీ (ఎస్‌యూవీ)కార్లు, బంగారు ఆభరణాలు ఇస్తామని ప్రకటిస్తుండగా... విమాన్ నగర్ అభ్యర్థి ఏకంగా ఐదు రోజుల థాయిలాండ్ లగ్జరీ టూర్ ఆఫర్ చేశారు. లోహెగావ్‌ధనోరి వార్డులో ఒక అభ్యర్థి 1,100 చదరపు అడుగుల స్థలాన్ని బహుమతి గా ఇస్తానని వాగ్దానం చేశారు. కొందరు అభ్యర్థులు... గృహిణులకు పైథాని చీరలు, నగలు పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈసారి పింప్రిచించ్వాడ్ (సిసిఎంసి) ఎన్నికల బరిలో ఏడుగురు మాజీ మేయర్లు నిలవడంతో పోటీ రసవత్తరంగా మారింది. ఎన్సీపీ (ఎస్పీ) నుంచి వైశాలి ఘోడేకర్, యోగేష్ బెహాల్... బిజెపి నుంచి మాయ్ ధోరే, శకుంతల దరడే సహా పలువురు కీలక నేతలు పోటీ పడుతున్నారు. అయితే పుణె ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల నేపథ్యం ఆందోళన కలిగిస్తోంది. పోలీసులు పరిశీలించిన 2,650 దరఖాస్తులలో 1,560 మందిపై క్రిమినల్ కేసులు ఉండగా... 60 మందిపై అత్యంత తీవ్రమైన నేరాలు నమోదయ్యాయి. జనవరి 15న ఉదయం 7:30 నుండి సాయంత్రం 5:30 వరకు పోలింగ్ జరగనుంది.

## తుర్క్‌మాన్ గేట్ రాళ్లదాడి ఘటనలో...
# మరో ముగ్గురి అరెస్ట్

### మొత్తం 16కు చేరిన అరెస్టుల సంఖ్య
### సమాజ్‌వాదీ ఎంపి సల్మాన్ పాత్రనూ పరిశీలిస్తున్నామని పోలీసులు వెల్లడి

**న్యూఢిల్లీ :** తుర్క్‌మాన్ గేట్ రాళ్ల దాడి ఘటనలో ఢిల్లీ పోలీసులు మరో ముగ్గురిని అరెస్ట్ చేశారు. దీంతో ఈ కేసులో అరెస్ట్ అయిన వారి సంఖ్యల 16కు చేరుకుంది. ఈ విషయాన్ని శనివారం ఒక అధికారి వెల్లడించారు. రాళ్ల దాడి ఘటనలో అరెస్ట్ అయిన వారిని మహ్మద్ నవేద్ (44), మహ్మద్ ఫయాజ్ (20), మహ్మద్ ఉబేదుల్లా (23), మహ్మద్ అరిబ్ (25), మహ్మద్ కాశిఫ్ (25), మహ్మద్ కైఫ్ (23), మహ్మద్ అద్నాన్ (37), సమీర్ హుస్సేన్ (40), మహ్మద్ అథార్ (20), షానవాజ్ ఆలం (55), మహ్మద్ ఇమ్రాన్ (28), మహ్మద్ ఇమ్రాన్ అలియాస్ రాజు(36), మహ్మద్ అఫ్ఫాన్ (20), మహ్మద్ ఆదిల్ (20), మ్మమద్ ఆమీర్ హమ్జా (22), మహ్మద్ ఉబేదుల్లా (26) ఉన్నారు. శుక్రవారం రాత్రి రాళ్ల దాడిలో పాల్గొన్న ముగ్గురిని అరెస్ట్ చేశామని, ఇప్పటి వరకు 16మందిని అరెస్ట్ చేయడం జరిగిందని, తదుపరి దర్యాప్తు కొనసాగుతున్నదని అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (సెంట్రల్) నిధిన్ వల్సన్ చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం సున్నితమైన ప్రాంతాలలో పెద్ద సంఖ్యలో పోలీసులు, పారామిలిటరీ బలగాలను మోహరించారు. శుక్రవారం ప్రార్థనల కోసం సీనియర్ అధికారులు మైదానంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అంతే కాకుండా పోలీసులు డ్రోన్ నిఘాను, విస్తృతమైన సిసిటివి పర్యవేక్షణను కూడా నిర్వహిస్తున్నారని, పరిస్థితులు ప్రశాంతంగా నియంత్రణలో ఉందని అధికారులు చెప్పారు. దర్యాప్తులో భాగంగా ఈ సంఘటనకు సంబంధించి తప్పుదారి పట్టించే లేదా ధ్రువీకరించని సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారన్న ఆరోపణలపై 10 మంది సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లను పోలీసులు గుర్తించారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ ఐమెన్ రిజ్వీకి సమన్లు పంపించినప్పటికీ ఇప్పటి వరకూ దర్యాప్తులో జాయిన్ కాలేదని అధికారులు చెప్పారు. ఇదిలాఉంటే పోలీసుల నుండి తనకు ఇప్పటివరకూ ఎలాంటి సమన్లు అందలేదని ఆమె (ఐమెన్ రిజ్వీ)'పిటిఐ'కి చెప్పారు. తనను తాను సామాజిక కార్యకర్తగా అభివర్ణించుకుంటూ రిజ్వీ తనను ఇప్పటివరకూ పోలీసులు కాంటాక్ట్ చేయలేదని చెప్పారు. ఒకవేళ నాకు ఏవైనా సమన్లు లేదా కాల్ వస్తే తాను పోలీసుల దర్యాప్తునకు సహకరిస్తానని రిజ్వీ తెలిపారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో కొన్ని మెస్సేజెస్ సర్క్యులేషన్‌కు సంబంధించి సమాజ్‌వాదీ ఎంపి సల్మాన్ పాత్రను కూడా పరిశీలిస్తున్నామని, ఆయనకు సమన్లు పంపాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

## మా వారసత్వాన్ని భ్రష్టు పట్టించేందుకు
# సొంత వ్యక్తులు చాలు..

### లాలూ కుమార్తె రోహిణి ఆచార్య

**పాట్నా:** ఆర్‌జెడి సుప్రీం లాలూప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణి ఆచార్య మరోసారి వార్తల్లోకి వచ్చారు. నేరుగా పేరు ప్రస్తావించకుండానే తన సోదరుడు, ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్‌పై తీవ్ర విమర్శలు చేశారు. తమ వారసత్వాన్ని నాశనం చేయడానికి సొంత వ్యక్తులే సరిపోతారని, బయట వ్యక్తుల అవసరమే లేదని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఎంతో కష్టపడి కుటుంబ వారసత్వాన్ని నిలబెట్టిన వారి మూలాలను చెరిపేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలు తనను దిగ్భ్రాంతికి గురిచేసినట్టు రోహిణి ఆచార్య తెలిపారు. అజ్ఞానం అనే ముసుగు ఉన్నప్పుడు అహంకారం తలకెక్కుతుందని, అప్పుడు వినాశక శక్తులు అప్రమత్తమై ఒక వ్యక్తి ఆలోచన, నిర్ణయాలను నియంత్రిస్తుంటాయని ఆక్షేపణ తెలిపారు. కాగా, ఇటీవల ముగిసిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్‌జెడి ఘోర వైఫల్యంతో లాలూ ఫ్యామిలీలో వివాదం మొదలైంది. ఈ ఎన్నికల్లో ఆర్‌జెడి 140 సీట్లలో పోటీ చేసి కేవలం 25 సీట్లకు పరిమితం కాగా, ఎన్‌డిఎ భారీ మెజారిటీతో గెలుపొందింది. బిజెపి 89, జెడి(యు) 85 సీట్లు గెలుచుకోగా, మొత్తం 243 మంది సభ్యుల అసెంబ్లీలో ఎన్‌డిఎ 200 మార్కును దాటింది. ఫలితాలు వెలువడిన మరుసటి రోజునే తాను రాజకీయాల నుంచి వైదొలుగుతున్నట్టు, తన కుటుంబంతో తెగతెంపులు చేసుకుంటున్నట్టు రోహిణి ఆచార్య ప్రకటించారు. పార్టీ దారుణ వైఫల్యంపై నాయకత్వాన్ని ప్రశ్నించినందుకు తన సోదరుడు తేజస్వి, ఆయన సన్నిహితుడు ఆర్‌జెడి ఎంపి సంజయ్ యాదవ్ తనను అవమానించారని, దాడికి కూడా ప్రయత్నించారని సంచలన ఆరోపణ చేశారు. ఆత్మగౌరవం విషయంలో తాను రాజీపడేది లేదన్నారు. అవమానభారంతో కుటుంబాన్ని, ఇంటిని విడిచిపెట్టాల్సి వచ్చిందని, తనను అనాథను చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన పరిస్థితి ఏ ఆడకూతురికీ రాకూడదన్నారు.

## విజయ్ ప్రచార వాహనం
# సీజ్ చేసిన సిబిఐ

**న్యూఢిల్లీ :** తమిళనాడులోని కరూర్‌లో తొక్కిసలాట ఘటనకు బాధ్యులను గుర్తించేందుకు చేపట్టిన దర్యాప్తును సీబీఐ వేగవంతం చేసింది. నటుడు, రాజకీయనేత, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ ప్రచార వాహనాన్ని సీబీఐ స్వాధీనం చేసుకుంది. ప్రచార వాహనం డ్రైవర్ సైతం సీబీఐ అధికారుల ముందు హాజరయ్యారు. గత ఏడాది సెప్టెంబర్ 27న వేలుసామిపురంలో జరిగిన టీవీకే ర్యాలీలో తొక్కిసలాట జరిగి... 41 మంది ప్రాణాలు కోల్పోగా, 100 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనపై ఇప్పటికే టీవీకే నాయకులను న్యూదిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయంలో అధికారులు ప్రశ్నించారు. జనవరి 12న తమ ముందు హాజరు కావాలని విజయ్‌కు సైతం సమన్లు పంపారు. కాగా, కరూర్ తొక్కిసలాట మృతుల కుటుంబాలను విజయ్ అక్టోబర్ 27న మహాబలిపురంలోని ఒక రిసార్ట్‌లో కలుసుకున్నారు. కరూర్ కుటుంబ సభ్యులకు రూ.20 లక్షల చొప్పున సాయం అందిస్తామని, గాయపడిన వారికి రూ.2 లక్షలు సాయం చేస్తామని టీవీకే పలుమార్లు ప్రకటించింది. చెప్పిన విధంగానే 39 కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున మొత్తం 7.8 కోట్లు పంపించినట్టు టీవీకే సామాజిక మాధ్యమం ఎక్స్‌లో తెలిపింది.

## మున్సిపల్ ఎన్నికల వేళ...
# ఎన్‌సిపిల ఉమ్మడి మేనిఫెస్టో

### ఒకే వేదికను పంచుకున్న అజిత్ పవార్, సుప్రియా సూలే



**పుణె:** మహారాష్ట్రలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న వేళ అధికార పక్షంలో ఉన్న ఎన్‌సిపి, ప్రతిపక్షంలో ఉన్న ఎన్‌సిపిలు చేతులు కలిపాయి. ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి (ఎస్‌పి) శనివారం పుణె మున్సిపల్ కార్పొరేషన్‌కు జరగబోయే ఎన్నికల కోసం ఉమ్మడి మేనిఫెస్టోను విడుదల చేశాయి. అజిత్ పవార్, ఆయన సోదరి, ఎన్‌సిపి (ఎస్‌పి) కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుప్రియా సూలే ఉమ్మడి విలేకరుల సమావేశంలో ఒకే వేదికను పంచుకున్నారు. అధికార మహా యుతిలో భాగమైన ఎన్‌సిపి, ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీలో భాగమైన ఎన్‌సిపి (ఎస్‌పి), పుణె, పింప్రి –చించ్వాడ పరుపాలక సంఘాలకు జనవరి 15న జరగబోయే ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తున్నాయి. ఇప్పటివరకు ప్రచారానికి దూరంగా ఉన్న సూలే, ఇతర ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకులు మేనిఫెస్టో విడుదల కార్యక్రమంలో పాల్గొన్నారు. సభనుద్దేశించి అజిత్ పవార్ మాట్లాడుతూ ఈ మేనిఫెస్టో పుణెలోని కీలక పౌర సమస్యలపై దృష్టి సారించిందని చెప్పారు. కుళాయి నీటి సరఫరా, ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, గుంతలు లేని రోడ్లు, పరిశుభ్రత, హైటెక్ ఆరోగ్య సంరక్షణ సేవలు, కాలుష్య నియంత్రణ, మురికివాడల పునరావాసం వంటి హామీలను మేనిఫెస్టోలో చేర్చారు. పిఎంపిఎంఎల్, మెట్రోలో ఉచిత ప్రయాణం, 500 చదరపు అడుగుల వరకు ఉన్న ఇళ్లకు ఆస్తి పన్ను మినహాయింపు, విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ ట్యాబ్‌లను కూడా ఈ మేనిఫెస్టో ప్రతిపాదిస్తుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో బిజెపితో కలిసి అధికారంలో ఉన్నప్పటికీ, అజిత్ పవార్ స్థానిక బిజెపి నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారు. రెండు ప్రభుత్వాల నుండి గణనీయమైన నిధులు పొందినప్పటికీ, పుణె, పింప్రి – చించ్వాడ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపిస్తున్నారు. 2017 నుండి 2022 వరకు పౌర సంస్థలలో బిజెపి అధికారంలో ఉంది.

**సుప్రియా సూలే కేంద్ర ప్రభుత్వంలో చేరవచ్చు : కాంగ్రెస్**


కాగా, ఎన్‌సిపి, ఎన్‌సిపి (ఎస్‌పి) సంయుక్త మేనిఫెస్టో విడుదల చేయడంపై కాంగ్రెస్ స్పందించింది. ఈ చర్యతో వారు ఒక్కటైనట్లు కనిపిస్తోందని కాంగ్రెస్ నాయకుడు విజయ్ వడెట్టివార్ అన్నారు. అలాగే, ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకురాలు సుప్రియా సూలే కేంద్ర ప్రభుత్వంలో చేరవచ్చనే ఊహాగానాలను ఆయన ప్రస్తావించారు. అయితే, ఈ 'పునఃకలయిక సైద్ధాంతిక ఏకాభిప్రాయం లేదా పార్టీ కార్యకర్తల పట్ల శ్రద్ధ కంటే అధికార దాహం వల్లే జరిగిందని ఆయన ఆరోపించారు. ఎన్‌సిపి, ఎన్‌సిపి (ఎస్‌పి) పునరేకీకరణపై వస్తున్న ఊహాగానాలపై స్పందిస్తూ, ఈ చర్య సిద్ధాంతం కోసమా, కార్యకర్తల కోసమా లేక కేవలం అధికారం కోసమా అన్నదే అసలైన ప్రశ్న అని కాంగ్రెస్ శాసనసభాపక్ష నాయకుడు అన్నారు. ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకులు రోహిత్ పవార్, బారామతి ఎంపి సూలే మహారాష్ట్ర క్యాబినెట్, కేంద్ర ప్రభుత్వంలో చేరే అవకాశంపై విస్తృతంగా చర్చ జరుగుతోందన్నారు. ఎన్‌సిపి (శరద్ చంద్ర పవార్) ప్రతిపక్ష మహా వికాస్ అఘాడిలో శివసేన (యుబిటి), కాంగ్రెస్‌కు మిత్రపక్షంగా ఉంది. సంప్రదాయబద్ధంగా, ఎన్‌సిపి తన వైఖరిని మార్చుకుంటూ ఉంటుందని, అది అధికారం లేకుండా మనుగడ సాగించలేదని, అధికారం లేకుండా ఉంటే, పార్టీ కుప్పకూలిపోతుందని వడెట్టివార్ ఆరోపించారు. మరోవైపు, కాంగ్రెస్ అధికారం కోసం కాకుండా రాహుల్ గాంధీ నాయకత్వంలో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం కోసం పోరాడుతోందని అన్నారు.

# ఒడిశాలో కుప్పకూలిన చార్టర్డ్ ఫ్లైట్

**న్యూఢిల్లీ :** ఒడిశాలో ప్రమాదం చోటు చేసుకుంది. రూర్కెలావద్ద ఓ చార్టర్డ్ విమానం కుప్పకూలిపోయింది. ఈ నైన్ సీటర్ విమానం రూర్కెలా నుంచి భువనేశ్వర్ వెళ్తున్నట్లు అధికారులు తెలిపారు. అయితే,అయిన వెంటనే ఫ్లైట్ కూలిపోయినట్లు చెప్పారు. ప్రమాద సమయంలో అందులో ఎనిమిది మంది ఉన్నారు. ఇద్దరు పైలట్లు కాగా ఆరుగురు ప్రయాణికులు. విమానం అయి 10 కిలో మీటర్లు ప్రయాణించిన తర్వాత ఇంజిన్ విఫలమవడంతో పంట పొలాల్లో కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే అధికారులు, రెస్క్యూ టీమ్ హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టింది. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. ఈ విమానం ఇండియావన్ అనే సంస్థకు చెందినదిగా అధికారులు తెలిపారు.

# అయోధ్య రామాలయంలో 'నమాజ్'

### ముగ్గురిని అదుపులోకి తీసుకున్న భద్రతా సిబ్బంది



**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో భద్రతా వ్యవస్థ పూర్తిగా విఫలమైంది. రామ జన్మభూమి ప్రాంగణంలోకి ప్రవేశించి ప్రార్థనలు చేయడానికి ప్రయత్నించిన ముగ్గురు వ్యక్తులను శనివారం నాడు భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. అందులో ఒక మహిళ కూడా ఉంది. ఈ ఘటనతో అక్కడ మోహరించిన భద్రతా సిబ్బంది తక్షణమే స్పందించి చర్యలు చేపట్టింది. అధికారులు, ప్రత్యక్ష సాక్షుల ప్రకారం కశ్మీర్ నివాసులమని చెప్పుకుంటున్న ఇద్దరు యువకులు, ఒక మహిళతో కూడిన ఈ బృందం, డి1 గేటు ద్వారా రామ మందిర సముదాయంలోకి ప్రవేశించింది. ఆ ఇద్దరు యువకులలో ఒకరు ఆలయ వంటగది సమీపంలో కూర్చుని 'నమాజ్' చేయడం ప్రారంభించినట్లు సమాచారం. ఆ తర్వాత భద్రతా సిబ్బంది జోక్యం చేసుకుని విచారణ నిమిత్తం ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులు కశ్మీరీ దుస్తులు ధరించి ఉన్నారు. వారిలో ఒకరిని జమ్ముకశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాకు చెందిన అబు అహ్మద్ షేక్‌గా గుర్తించారు. మహిళను సోఫియాగా గుర్తించారు. అయితే మూడవ యువకుడి గుర్తింపు ఇంకా నిర్ధారించబడలేదు. భద్రతా సిబ్బంది వారిని అడ్డుకున్నప్పుడు ఆ ముగ్గురూ మతపరమైన నినాదాలు చేశారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ఘటన జరిగిన తర్వాత, నిఘా సంస్థలు, స్థానిక పోలీసులు, సీనియర్ పరిపాలనా అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే, జిల్లా యంత్రాంగం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కూడా ఈ విషయంపై వ్యాఖ్యానించడానికి నిరాకరించింది. జనవరి 22, 2024న రామ్ లల్లా ప్రాణప్రతిష్ఠ జరిగినప్పటి నుండి రామ మందిర ప్రాంగణానికి ప్రతిరోజూ సగటున 1.5 లక్షల మంది భక్తులు వస్తున్నారు. గతంలో జరిగిన ఉగ్రవాద బెదిరింపుల దృష్ట్యా, ఈ సముదాయంలో భద్రతా ఏర్పాట్లు విస్తృతంగా ఉన్నాయి. రామ జన్మభూమి సముదాయం భద్రతా బాధ్యతను స్పెషల్ సెక్యూరిటీ ఫోర్స్ (ఎస్ఎస్ఎఫ్) నిర్వహిస్తోంది. ఈ ప్రదేశంలో దాదాపు 200 మంది ఎస్ఎస్ఎఫ్ సిబ్బంది నిరంతరం విధులు నిర్వహిస్తున్నారు. భద్రతా ఏర్పాట్లను మరింత పటిష్టం చేయడానికి అయోధ్యలో నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జి) కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. ప్రతిపాదిత ఎన్ఎస్‌జి యూనిట్ ప్రత్యేక ఆయుధాలు, యాంటీడ్రోన్ వ్యవస్థలతో సన్నద్ధమవుతుంది. ఇటీవలి నెలల్లో రామ మందిరానికి అనేక బెదిరింపు సందేశాలు వచ్చాయి. వీటిలో సోషల్ మీడియా, ఫోన్ కాల్స్ ద్వారా వచ్చిన బాంబు బెదిరింపులు ఉన్నాయి. దీనిపై దర్యాప్తు జరిపిన తర్వాత యుపి ఎటిఎస్, పోలీసులు అరెస్టులు చేశారు. ఒక కేసులో బీహార్ నుండి ఒక అనుమానితుడిని అరెస్టు చేయగా, మరో కేసులో తూర్పు ఉత్తరప్రదేశ్‌లో ఒక మైనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. నవంబర్ 2024లో, ఖలిస్తానీ వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్నూ కూడా ఈ ఆలయాన్ని లక్ష్యంగా చేసుకుని బెదిరింపు జారీ చేశాడు.

# చలికి ఢిల్లీ గజగజ

**న్యూఢిల్లీ :** చలి తీవ్రతకు దేశ రాజధాని ఢిల్లీ గజగజ వణికిపోతోంది. ఉష్ణోగ్రతలు అత్యంత కనిష్ట స్థాయికి పడిపోయాయి. రాజధానిలో శనివారం ఉదయం ఉష్ణోగ్రతలు 4.2 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయి. ఇప్పటి వరకూ ఈ సీజన్‌లో ఇదే అత్యల్ప ఉష్ణోగ్రతలు అని భారత వాతావరణ శాఖ తెలిపింది. కనిష్ట ఉష్ణోగ్రతలు సీజన్ సగటు కంటే 2.7 డిగ్రీల కంటే తక్కువగా నమోదయ్యాయి. సఫ్దర్‌జంగ్ అబ్జర్వేటరీలో ఉష్ణోగ్రతలు 4.2 డిగ్రీల సెల్సియస్, పాలంలో 4.5, లోధి రోడ్డులో 4.7, రిడ్జ్‌లో 5.3, అయానగర్‌లో 4.5 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలి తీవ్రతకు నగర వాసులు వణికిపోతున్నారు. చలిమంటలు వేసుకొని ఉపశమనం పొందుతున్నారు. మరోవైపు నగరంలో దట్టంగా మంచు కురుస్తోంది. దీంతో దృశ్యమానత సున్నాకు పడిపోయింది. ఫలితంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.

### పొగమంచుతో విమానాల రాకపోకలకు అంతరాయం

విమాన రాకపోకలపై తీవ్ర ప్రభావం చూపింది. ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగించే అనేక విమానాలు రద్దయ్యాయి. కొన్ని ఆలస్యంగా నడుస్తుండగా... మరికొన్నింటిని దారి మళ్లించారు. గాలి నాణ్యత వెరీ పూర్ కేటగిరీలో నమోదైంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకారం... నగరంలో గాలి నాణ్యత సూచిక 358గా నమోదైంది. నెహ్రూ నగర్‌లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 426గా, ఆనంద్ విహార్‌లో 422, వివేక్ విహార్‌లో 408, సిరిఫోర్ట్‌లో 404గా నమోదైంది. పట్పర్‌గంజ్ 400, ద్వారకా సెక్టార్8లో 399, ఓఖ్లా ఫేజ్2లో 398, జేఎల్ఎన్ స్టేడియంలో 394, ఆర్కేపురం, చాందినీ చౌక్ వద్ద 390, పంజాబీ బాఘ్, ముంద్కాలో 368, అబావనాలో 346, ఆయా నగర్‌లో 344, ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు టర్మినల్3 వద్ద 325, ప్రాంతంలో 302గా గాలి నాణ్యత సూచిక నమోదైంది.

# ఇడికి మమత ఎదురుదెబ్బ

పశ్చిమ బెంగాల్‌లో రానున్న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను తారుమారు చేయటానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను ప్రయోగించిన బిజెపి దుష్టతంత్రాన్ని సాగనివ్వబోనని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తొడగొట్టారు. తమ పార్టీ ఎన్నికల వ్యూహాలను, అభ్యర్థుల జాబితాలను వడబోసే బాధ్యత స్వీకరించిన ఎన్నికల ఏజెన్సీ ఐ-ప్యాక్ కలకత్తా కార్యాలయంపై, దాని అధినేత ప్రతీక్ జైన్ నివాసంపై ఇడి అధికారులు గురువారం ఉదయాన్నే ఆకస్మికంగా దాడిచేసిన సోదాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిన మమతా బెనర్జీ ఆగ్రహోదగ్రురాలై 11 గంటల తర్వాత ఆ ప్రదేశాల్లోకి ప్రవేశించి కొన్ని ఫైళ్లు, కంప్యూటర్ డిస్కులు తీసుకెళ్లారు. ఇది వివాదాస్పదమైంది. బొగ్గు కుంభకోణంలో మనీ లాండరింగ్ ఆరోపణల కేసులో తాము సోదాలు చేస్తుండగా మమతా బెనర్జీ చొరబడి ముఖ్యమైన ఫైళ్లు ఎత్తుకెళ్లారని ఇడి ఆరోపిస్తోంది. ఈ చర్య 'అనైతికం, బాధ్యతారాహిత్యం, రాజ్యాంగ విరుద్ధం' అని బిజెపి వాపోతున్నది. తమ పార్టీ ఎన్నికల వ్యూహం సమాచారాన్ని దొంగిలించి మా పార్టీని దెబ్బతీసే దుష్టబుద్ధితో బిజెపి నాయకత్వం ఐ-ప్యాక్‌పై ఇడిని ప్రయోగించగా, పార్టీ చైర్‌పర్సన్‌గా తాను పార్టీని రక్షించుకునేందుకు ప్రత్యక్షంగా జోక్యం చేసుకుని, తమ పార్టీకి సంబంధించిన సమాచార ఫైళ్లను తీసుకెళ్లానని, ఈ పని ఇడి లాగా దొంగతనంగా కాకుండా పట్టపగలు బాహాటంగా చేశానని మమతా బెనర్జీ స్పష్టం చేశారు.

ఈ వివాదం హైకోర్టు ముందుకు కూడా వెళ్లింది. జస్టిస్ సువ్ర ఘోష్ కోర్టులో జనాగ్గోలతో రభసగా మారటంతో ఆయన విచారణను జనవరి 14కు వాయిదా వేశారు. కోర్టు ఏమి చెబుతుందో అలా వుంచితే, ప్రతిపక్ష పార్టీలను దెబ్బతీయటానికి కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రధాని, హోంమంత్రి దుర్వినియోగం చేస్తున్నారని కొన్ని సంవత్సరాలుగా ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తుండగా, ఎన్నికలు జరగబోతున్న రాష్ట్రాల్లోనే ముందుగా ఎన్నికల కమిషన్‌ను ప్రయోగించి పదుల లక్షల ఓట్లను తొలగించటం ఎన్నికల ఫలితాలను బిజెపికి అనుకూలంగా మార్చే దుశ్చర్యగా ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. నిశితంగా పరిశీలిస్తున్న వ్యక్తులు అదే సందేహిస్తున్నారు. ఇంతలోనే ఇటీవల తమిళనాడులో, తాజాగా పశ్చిమ బెంగాల్‌లో ఇడి సోదాలు చేబట్టటం ఎందుకు? అవినీతిని నిర్మూలించే ధర్మకార్యం ఇప్పుడే గుర్తుకొచ్చిందా? బొగ్గు కుంభకోణం, మనీ లాండరింగ్ కేసు ఎప్పటినుంచో నడుస్తోంది. ఆ అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలకు గురైన అప్పటి టిఎంసి నాయకులు బిజెపి తీర్థం పుచ్చుకున్నారని మమత అంటున్నారు. ఆ కేసులో ధన లబ్ధి కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు అందిందని ఆమె ఆరోపిస్తున్నారు. మీరు పిచ్చి వేషాలేస్తే ఆ పెన్ డ్రైవ్‌లు బయటపెడతానని శుక్రవారం కలకత్తాలో ఇడికి వ్యతిరేకంగా పెద్ద ర్యాలీ అనంతరం బహిరంగసభలో ప్రసంగించిన ముఖ్యమంత్రి హెచ్చరించారు.

నిజాయితీతో కేసును దర్యాప్తు చేయటమే ఇడి ధ్యేయమైతే ఈ రెండు నెలలు ఆగి ఎన్నికల అనంతరం చేబట్టవచ్చుగదా? ఇక్కడే కాదు ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలన్నింట్లో ఎన్నికలకు ముందు పాలకపార్టీ నాయకులు, వారి సన్నిహితుల ఇళ్లపై సిబిఐ, ఇడి దాడులు జరుగుతున్నాయి. బిజెపి దురుద్దేశం విదితం కావటం లేదా?

ఓటర్ల జాబితాల ప్రక్షాళనకూడా అటువంటిదే. ఎన్నికల కమిషన్‌కున్న హక్కును ఎవ్వరూ కాదనరు. అయితే అందుకు అది ఎంచుకున్న సమయం, ఎన్నికలు జరగబోయే రాష్ట్రాలనే ఎంపిక చేసుకుంటున్న తీరు, కార్యనిర్వహణలో ఏకపక్ష ధోరణి కమిషన్ ఉద్దేశాలను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు నాలుగైదు నెలలముందు జాబితాల పరిశీలన చేబట్టి బీహార్‌ను బిజెపి-జెడియు నిలుపుకునేలా చేసింది. హర్యానా, ఢిల్లీ, మహారాష్ట్రల్లో ఎంచుకున్న నియోజకవర్గాల్లో ఓట్లను వేల సంఖ్యలో చేర్చటమో, తొలగించటమో చేసి బిజెపి విజయానికి పరోక్షంగా సహకరించారన్న ఆరోపణ ఎదుర్కొంటున్నది. ఇప్పుడు ఏప్రిల్‌లోపు అసెంబ్లీ ఎన్నికలు జరిగే పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళలోపాటు 2027లో ఎన్నికలు జరిగే ఉత్తరప్రదేశ్, కొన్ని ఆలస్యంగా అస్సాంను ఎస్ఐఆర్ కిందకు తెచ్చి చూడు మా నిజాయితీ అంటోంది ఎన్నికల కమిషన్. ఎస్ఐఆర్ చేబట్టిన రాష్ట్రాల్లో 'శాశ్వతంగా చిరునామా మారిన ఓటర్ల పేరుతో తొలగించిన ఓట్లు 10 కోట్లు దాటాయి. వారు వేరే రాష్ట్రానికి వెళ్లి ఉండాలి కదా? ఎక్కడెక్కడ ఎందరున్నారో కేంద్రంగాని, ఎన్నికల కమిషన్ చెప్పటం లేదు. ఎందుకని?

రాజ్యాంగం ఆదేశించినట్లు సక్రమంగా ఓటర్ల జాబితాలు నిర్వహిస్తూ, 'స్వేచ్ఛగా, సజావుగా' ఎన్నికల నిర్వహణ ఎన్నికల సంఘం విధి. ఈ విశ్వాసాన్ని అది త్వరితంగా కోల్పోవటానికి బిజెపి నియమించిన దాని కమిషనర్లే కారకులు. ప్రజాస్వామ్య పునాదులు పటిష్టవంతం చేయటానికి ఎన్నికల కమిషన్ పట్ల విశ్వాస పునరుద్ధరణ ఎంతైనా అవసరం.



## భయాలు వాస్తవాలను ప్రతిబింబించలేవు

మలయాళం భాషా బిల్లు, 2025 విషయంలో అనేక సందేహాలు/భయాలు ఉన్నాయి కానీ అవన్నీ నిజాలు కావు. భయాలు వాస్తవాలను ప్రతిబింబించలేవు. లౌకికవాదం, బహుళవాదానికి సంబంధించిన రాజ్యాంగానికి కేరళ ప్రభుత్వం కట్టుబడి ఉంది. మైనారిటీలు ముఖ్యంగా కన్నడం, తమిళం మాట్లాడే వర్గీయులకు భాషాపరమైన భద్రత కల్పించడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశ్యం. 'ఏ భాషను బలవంతంగా అమలు చేయకుండా, భాషాపరమైన స్వాతంత్ర్యాన్ని కాపాడేలా కీలక నిబంధనలు ఉన్నాయి. నోటిఫై చేసిన ప్రాంతాలు, తమిళం, కన్నడం మాట్లాడే వారు తమ మాతృభాషను అధికారికంగా వినియోగించుకోవచ్చు. అంటే సెక్రటేరియట్, స్థానిక కార్యాలయాల్లో వాడుక భాషలోనే సమాధానాలు లభిస్తాయి.

- కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్





## కుక్క కోసం... డ్రోన్ సాయం!



'అబ్బీ' కనిపించడం లేదన్న ఫిర్యాదు అందుకున్న వెంటనే, వెతుకులాట మొదలైంది. తలా ఒక దిక్కున పరుగులు తీశారు. చివరికి డ్రోన్ సాయంతో ఎక్కడ ఉన్నదీ గుర్తించి, రక్షించారు. వివరాల్లోకి వెళితే, న్యూజెర్సీ టర్న్‌పైక్‌పైని ఒక విశ్రాంతి కేంద్రం వద్ద తప్పించుకున్న 'అబ్బీ' అనే తొమ్మిదేళ్ల గోల్డెన్ రిట్రీవర్ మిక్స్ కుక్క దక్షిణ కరోలినాలోని ఓ ఆశ్రయం నుంచి మెయిన్‌లోని కొత్త ఇంటికి తరలిస్తుండగా ఎటో తప్పిపోయింది. ఈస్ట్ బ్రన్స్‌విక్ ప్రాంతంలో వాహనం ఆగిన సమయంలో 'అబ్బీ' పరుగెత్తి పారిపోయింది. సుమారు 25 మైళ్లు (40 కి.మీ) దూరం తిరిగిన అబ్బీ, మరుసటి రోజు అర్ధరాత్రి సమయంలో అటవీ ప్రాంతంలో కనిపించింది. కుక్కకు అమర్చిన ట్రాకింగ్ ట్యాగ్ ద్వారా అంచనా స్థానం తెలుసుకున్న వలంటీర్లు, న్యూజెర్సీకి చెందిన 'అన్‌మ్యాన్డ్ సెర్చ్ అండ్ రెస్క్యూ' డ్రోన్ బృందం సహాయంతో థర్మల్ కెమెరా ఉపయోగించారు. డ్రోన్ ఇచ్చిన సమాచారం ఆధారంగా పోలీసులు అబ్బీని రక్షించారు. దీనితో కథ సుఖాంతమైంది.

## ఒకే ఒక్కడు...



యూరోపియన్ బాస్కెట్‌బాల్ చరిత్రలో అరుదైన ఘటన చోటుచేసుకుంది. ఇటలీకి చెందిన ట్రపానీ షార్క్ జట్టు ఒక మ్యాచ్‌లో కోర్టుపై కేవలం ఒక్క ఆటగాడితోనే మిగిలిపోవడం వల్ల ఆటను వదులుకోవాల్సి వచ్చి, టోర్నమెంట్ నుంచి నిష్క్రమించింది. ఫీబా ఛాంపియన్స్ లీగ్ ప్లేఇన్ దశలో భాగంగా, బల్గేరియాలో ఇజ్రాయెల్ జట్టు హాపోయెల్ నెటానెల్ హోలోన్‌తో ట్రపానీ షార్క్ తలపడింది. ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న ట్రపానీ జట్టు కేవలం ఐదుగురు ఆటగాళ్లతోనే మ్యాచ్‌కు హాజరైంది. వారిలో ఇద్దరు తొలిసారి ప్రొఫెషనల్ మ్యాచ్ ఆడుతున్నారు. కాగా, మ్యాచ్ మొదటి క్వార్టర్‌లోనే పరిస్థితి చేజారిపోయింది. కారణాలు స్పష్టంగా తెలియకపోయినా, ముగ్గురు ఆటగాళ్లు ఆటను మధ్యలోనే ఆపేయగా, మరో ఆటగాడు ఫౌల్ అవుట్ అయ్యాడు. దీంతో కోర్టులో ఒక్క ఆటగాడు మాత్రమే మిగిలాడు. నేను ఆడతా అంటూ ఆ ఒంటరి ఆటగాడు ఆత్మవిశ్వాసం వ్యక్తం చేసినప్పటికీ, నిబంధనల ప్రకారం కనీసం ఇద్దరు ఉండాలి కాబట్టి, నిర్వాహకులు మ్యాచ్‌ను నిలిపివేశారు. ఆ సమయంలో స్కోర్ 38–5గా హోలోన్ ఆధిక్యంలో ఉంది. నిబంధనల ప్రకారం ఫోర్ఫిట్‌గా పరిగణించడంతో ట్రపానీకి ఆటోమేటిక్ ఓటమి నమోదై, హోలోన్ రౌండ్ ఆఫ్ 16కు అర్హత సాధించింది. కాగా, 600,000 యూరోల (సుమారు రూ.6 కోట్లకు పైగా) భారీ జరిమానా తప్పించుకోవడానికే ఈ మ్యాచ్‌లో పాల్గొన్నామని ట్రపానీ క్లబ్ వెల్లడించింది. ఇప్పటికే ఇటాలియన్ బాస్కెట్‌బాల్ సమాఖ్య నుంచి జరిమానాలు, ఆంక్షలు ఎదుర్కొంటున్న ఈ జట్టు భవిష్యత్తు ఇప్పుడు అనిశ్చితిలో పడింది. ఇటీవలే లీగ్ మ్యాచ్‌ను కూడా ఆడకూడదని నిర్ణయించుకోవడం గమనార్హం. ఈ సంఘటన యూరోపియన్ బాస్కెట్‌బాల్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.

## గురుత్వాకర్షణ మౌలికం కాదు!



వినడానికి ఆశ్చర్యంగా ఉంటున్నప్పటికీ, కొన్ని సిద్ధాంతాలను అనుసరించి, గురుత్వాకర్షణ మౌలికమైనది కాదు. స్థలమంతటా క్వాంటం ఎంటాంగిల్‌మెంట్ వ్యవస్థలను పరస్పరం అనుసంధానించిన తరువాత మాత్రమే అది కనిపిస్తుంది. అంటే, సంబంధాలు ముందుగా వస్తాయి, వాటి ఫలితంగా తరువాత గురుత్వాకర్షణ ఉద్భవిస్తుంది. ఈ ప్రతిపాదన, దీర్ఘకాలంగా నమ్మిన ఆలోచనను తలకిందులు చేస్తుంది. ఈ భావన ధైర్యంగా అనిపించినప్పటికీ, కేవలం ఊహలపై కాకుండా జాగ్రత్తగా రూపొందించిన గణితంపై ఆధారపడి ఎదుగుతోంది. కణాలు ఎంటాంగిల్‌మెంట్‌కు లోనైనప్పుడు, వాటి మధ్య పంచుకున్న సమాచారం నిర్మాణాన్ని సృష్టిస్తుంది. ఆ అనుసంధానాల నుంచే జ్యామితి (జామెంట్రీ) ఉద్భవిస్తుంది. సమాచారం ఎలా పంపిణీ అయి, ఎలా అనుసంధానమై ఉందో దాని ఉపఫలితంగా గురుత్వాకర్షణ కనిపిస్తుంది. ఎంటాంగిల్‌మెంట్ లేకపోతే సజావైన స్థలం ఉండదు, వస్తువులను ఒకదానివైపు లాగడానికి గురుత్వాకర్షణ కూడా ఉండదు. భౌతిక శాస్త్రవేత్తలు ఈ ఆలోచనను బ్లాక్ హోల్స్, సమాచార సిద్ధాంతం, హోలో గ్రాఫిక్ సూత్రాల అధ్యయనాల ద్వారా పరిశీలిస్తున్నారు. సమీకరణాలు స్పేస్‌టైమ్ వక్రత ఎంటాంగిల్‌మెంట్ నమూనాలను ప్రతిబింబించగలదని చూపుతున్నాయి. ఎంటాంగిల్‌మెంట్ మారితే జ్యామితి స్పందిస్తుంది. ఈ దృష్టికోణం దశాబ్దాలుగా ఏకీకరణకు ఎదురు నిలిచిన క్వాంటం మెకానిక్స్, గురుత్వాకర్షణ మధ్య వంతెన నిర్మించడంలో సహాయపడవచ్చు. గురుత్వాకర్షణ ఎంటాంగిల్‌మెంట్ నుండి ఉద్భవిస్తే, ఈ రెండు సిద్ధాంతాలు ఒకే తీరులో ఉంటాయి. ప్రారంభ బిందువుగా ద్రవ్యం కాకుండా సమాచారం నిలుస్తుంది. పరిశోధకులు ఈ ఆలోచనలను అనుకరణలు, అధిక శక్తి భౌతిక శాస్త్రం నుండి లభించిన అవగాహనలతో పరీక్షిస్తున్నారు.

— బిఎస్ఎస్ మైత్రేయి

# మేడారం 'మహా జాతర'కు మహర్దశ



జి. లక్ష్మణ్ కుమార్
9676647807

మేడారం జాతర చరిత్రలో ప్రతి ఒక్కరికి తెలిసేలా.. వన దేవతల గద్దెలు, జంపన్న వాగు ఆధునీకరణ పనులు తరతరాలు నిలిచేలా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేయిస్తున్నది.

ఆసియా ఖండంలోనే అతి పెద్ద ఆదివాసీ జాతరగా పేర్కొనబడిన సమ్మక్క సారలమ్మ మేడారం మహా జాతర ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మాఘ పౌర్ణమి రోజులలో జరుగుతుంది. దశాబ్దాల కాలం నుండి బుధ, గురు, శుక్ర, శని వారాలలో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నా ఆచారం. ఈ మహా జాతర ను తెలంగాణా కుంభమేళా గా పేర్కొంటారు. ఈ జాతరకు లక్షలాది మంది తరలివస్తారు. కోరిక కోర్కెలు తీర్చే అమ్మవార్లకు ఘనమైన పూజలు చేస్తారు. ఇంత పెద్ద ఎత్తున జరిగే జాతరకు ఈ సారి మేడారం పున:నిర్మాణం పనుల వలన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

తెలుగు జాతి చరిత్రలో కాకతీయ సామ్రాజాన్ని స్వర్ణ యుగంగాను, మహోజ్వల ఘట్టంగాను పేర్కొంటారు. చరిత్ర పరిశీలిస్తే కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు ఓరుగల్లు ను రాజధానిగా చేసుకొని పరిపాలించిన కాలంలో ఆదివాసీలు తమ స్వేచ్ఛ, స్వాతంత్యాల కొరకు పోరాటం చేసి తమ ప్రాణాలను పణంగా పెట్టి ఆదివాసీ హక్కులను కాపాడిన వీరవనితలుగా సమ్మక్క సారలమ్మలు చరిత్రలో ప్రసిద్దిపొందారు. వారి బలిదానాలనే నేడు మేడారం మహా జాతరగా నిర్వహిస్తూ తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు.

**గతంలో చూసిన మేడారానికి.. ప్రస్తుతానికి ఎంతో తేడా**

ఎట్లున్న మేడారం ఎట్ల మారింది. నేడు మేడారం స్వరూపం పూర్తిగా మారిపోయింది. నాటి మేడారానికి నేటి మేడారానికి ఎంతో తేడా కనిపిస్తోంది. భక్తులు మెచ్చేలా.. మురిసేలా... రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతర నిర్వహణకు అవసరమైన అభివృద్ధి పనులు భారీ స్థాయిలో చేపట్టారు.

ఆదివాసీ పెద్దలు, పూజారుల సంఘం సంపూర్ణ ఆమోదంతోనే మేడారం అభివృద్ధి పునర్నిర్మాణ పనులకు ప్రజా ప్రభుత్వ శ్రీకారం చుట్టింది. జాతర నిర్వహణకు అవసరమైన వసతుల కల్పన, అభివృద్ధి పనులు అద్భుతంగా చేపడుతోంది. మేడారం సమ్మక్కసారలమ్మ మహా జాతరకు విస్తృత ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. మేడారం ధగధగా మెరుస్తోంది. ఏర్పాట్లు, అభివృద్ధి పనులను చూసి భక్తులు మురిసిపోతున్నారు. కొత్త సొగబులు.. కాంతులు వారిని కట్టిపడేస్తున్నాయి. గత పాలకులు ప్రతిసారి జాతర వచ్చిందంటే కోట్లాది రూపాయలు వెచ్చించి తాత్కాలికం గా అభివృద్ధి పనులు, వసతులు కల్పించేవారు. ప్రతీ సారి ఇదే జరుగుతుండేది.

**శాశ్వత నిర్మాణాలు..**

వందల ఏళ్లపాటు చెక్కుచెదరకుండా నిలిచేలా గద్దెల శాశ్వత పున: నిర్మాణం పనులు చేపట్టింది. జనవరి ఐదో తేదీ నాటికి పనులన్నీ పూర్తి చేసేందుకు రాత్రింభవళ్లు అధికార యంత్రాంగం శ్రమిస్తోంది. గద్దెల విస్తరణ, ఆలయ ప్రాంగణం చుట్టూ గ్రానైట్ రాతి ప్రాకార నిర్మాణం, స్వాగత తోరణాల ఏర్పాటు పనులు తుది దశలో వేగంగా సాగుతున్నాయి.

**పిల్లర్లపై సంస్కృతి, ఆచారాలు, చరిత్ర..**

మేడారం గద్దెల చుట్టూ నిర్మిస్తున్న 32 గ్రానైట్ ఫిల్లర్లపై ఆదివాసీ సంసృతి, ఆచారాలు, చరిత్రను తీర్చిదిద్దారు. మార్బుల్ శిలలతో గద్దెలూ జంపన్నవాగు సుందరీకరణ, డ్రైనేజీ వ్యవస్థలు, ఫ్లడ్ మేనేజ్మెంట్, 60 అడుగుల నుంచి నాలుగు లైన్లకు రోడ్ల విస్తరణ, క్యూ లైన్లు, సత్రాలు, వాచ్ టవర్లు, గ్రీనరీ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మరోవైపు జాతర సజావుగా సాగేందుకు మహా కుంభమేళాలో భాగస్వాములైన నిపుణుల బృందం మేడారానికి చేరుకుని.. జాతర జరిగే ప్రాంతం, అక్కడికి దారి తీసే మార్గాలు, జాతర రద్దీ ఉండే ఉప ఆలయాలను సందర్శించి.. అధికారులకు తగిన సూచనలు..సలహాలు చేసింది. ఈసారి జాతరకొచ్చే భక్తులకు పార్కింగ్ సమస్య తలెత్తకుండా గద్దెల సమీపంలోనే ఏకకాలంలో వేల వాహనాల పార్కింగ్కు అధికారులు చర్యలు చేపట్టారు. ఆ నాలుగు రోజులూ డ్రోన్షో ప్రత్యేక ఆకర్షణ కానున్నది. ఎక్కడ నిర్వహించాలో త్వరలో నిర్ణయం తీసుకుంటారు. జాతరపై సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు డాక్యుమెంటరీ కూడా రూపొందిస్తున్నారు.

**మేడారం సమగ్రాభివృద్ధికి రూ.251 కోట్లు మంజూరు..**

మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరకు తెలంగాణ ప్రజా ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. మొత్తం రూ. 251 కోట్లతో మేడారం సమగ్ర అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. గద్దెల విస్తరణకే రూ. 101 కోట్లు కేటాయించింది. 4,000 టన్నుల గ్రానైట్తో గద్దెల ప్రాంగణ నిర్మాణ పనులు చేపట్టారు. 750 మంది కోయ వంశీయుల పేర్లకు సంబంధించిన 7,000కి పైగా శిల్పాలు, 930 ఏళ్ల కోయల తాళపత్ర గ్రంథాల ఆధారంగా శిల్ప రూపకల్పన చేశారు. 46 స్తంభాలతో 271 చ.మీ విస్తీర్ణంలో ప్రాకారం, 8 స్తంభాలతో వృత్తాకార గద్దె నిర్మాణం చేపట్టారు. 40 అడుగుల వెడల్పుతో 3 స్వాగత తోరణాలు, 30 అడుగుల వెడల్పుతో 5 స్వాగత తోరణాలు, 50 అడుగుల వెడల్పుతో ప్రధాన స్వాగత తోరణం ఉంటుంది. ప్రస్తుతం ఉన్న చెట్లను తొలగించకుండా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. బండారి, మర్రి, వెదురు, వేప, ఇప్ప తదితర 12 రకాల పవిత్ర వృక్షాలు ఇక్కడ ఉన్నాయి. 140 రకాల ఆయుర్వేద మొక్కల నాటనున్నారు. పూజారుల సంఘం ఆమోదంతోనే అన్ని పనులు జరుగుతున్నాయి.

మేడారం నిర్మాణ పనులు 200 ఏళ్లపాటు చెక్కుచెదరకుండా ఉండేలా



చేపడుతున్నారు. గద్దెల ప్రాంగణాన్ని చారిత్రక కట్టడాల మాదిరిగా పటిష్ఠంగా ఉండేలా రాతితో పునర్నిర్మిస్తున్నారు. 46 పిల్లర్లతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్రాకారం ఉండనుంది. వీటి మధ్య 40 అడుగుల వెడల్పుతో మూడు, 30 అడుగుల వెడల్పుతో ఐదు స్వాగత తోరణాలుంటాయి. గద్దెల ప్రాంగణానికి ఎదుట 50 అడుగుల వెడల్పున ప్రధాన స్వాగత తోరణం నిర్మిస్తున్నారు. వృత్తాకారంలో ఉండే గద్దె చుట్టూ 8 స్తంభాలు, మధ్యలో వెదురు బొంగులతో తీర్చిదిద్దుతున్నారు. శిలలపై ఆదివాసుల సంస్కృతికి పెద్దపీట వేశారు. తాళపత్రాల్లోని కోయ వంశీయుల చరిత్రను ప్రాంగణం గోడలపై చిహ్నాలుగా, బొమ్మలుగా చెక్కించారు. ఇందుకోసం తెలుపు రంగు రాళ్లను ఆంధ్రప్రదేశ్లోని అన్నమయ్య జిల్లా రాయచోటి నుంచి నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు తరలించి శిల్పులతో చెక్కించాక మేడారానికి తీసుకొచ్చారు.

**భావి తరాలకు తెలిసేలా... శిలలపై తల్లుల చరిత్ర..**

మేడారంలో కోయల ఆచార సంప్రదాయాలకు తగ్గట్టుగా సర్కారు పనులు చేపడుతూ.. సమ్మక్క సారక్క తల్లుల చరిత్ర అందరికీ తెలిసేలా శిలలపై చెక్కించారు. కోయల వద్ద దొరికిన 930 ఏండ్ల నాటి తాళపత్ర గ్రంథాల ఆధారంగా చెక్కించిన శిల్పాలు, చిహ్నాలు. ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సమ్మక్క, సారక్క పగిడిద్దరాజు, గోవిందరాజు, కోయల ఇష్ట దైవాలకు ప్రతిరూపంగా భావించే పులి, జింక, దుప్పి, పావురం, ఏనుగు, నెమలి, మొసలి, పశుపక్ష్యాదులతో పాటు కోయల జీవనశైలికి, ఆచార సంప్రదాయాలకు, గొట్టుగోత్రాలకు ప్రతిరూపంగా భావించే సూర్యచంద్రులు, త్రిశూలం, నెలవంక, బండి చక్రాలు, అడ్డ, నిలువు గీతలకు స్తంభాలపై చోటు దక్కింది. అలాగే సమ్మక్క సారలమ్మ వంశస్తులైన దాదాపు 250 కోయల ఇంటి పేర్లు, వారి మూలాలను శిలలపై చెక్కడం ద్వారా వాళ్ల చరిత్రను భావితరాలు తెలుసుకునే అవకాశం దక్కుతుంది. అందు కోసమే ప్రత్యేకంగా కోయల ఇంటి పేర్లు, వారి మూలాలను శిలలపై చెక్కించేందుకు ప్రాధాన్యమిచ్చారు. గద్దెల ముందు తెల్లని గ్రానైట్ స్తంభాలతో ఏర్పాటు చేస్తున్న ప్రధాన ద్వారం, ఆయా శిలలపై సమ్మక్క సారలమ్మ పూర్వీకులతో పాటు, కోయల జీవనశైలిని తెలిపేలా చెక్కిన ఏడు వేల బొమ్మలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి.

50 ఫీట్ల వెడల్పుతో ఉన్న ఈ ప్రధాన ద్వా రానికి 25 ఫీట్ల ఎత్తు, 5 ఫీట్ల వెడల్పుతో రెండువైపులా రెండేసి నిలువు స్తంభాలు, వాటిపై 80 ఫీట్ల పొడవైన అడ్డ స్తంభం, దానిమీద 60 ఫీట్ల పొడువైన మరో అడ్డ స్తంభం ఆకట్టుకుంటున్నాయి. వీటితో పాటు గద్దెల చుట్టూ 25 ఫీట్ల ఎత్తు, 5 ఫీట్ల వెడల్పుతో 8 స్తంభాలు నిలుపుతున్నారు. వీటిపై సమ్మక్క సారలమ్మ తో పాటు 3,4,5,6,7 గొట్టుగోత్రాలను బొమ్మలుగా చెక్కారు. గద్దెల చుట్టూ బయటి వైపు శిలలపై ఆదివాసీల జీవన విధానం, వారి దేవతల బొమ్మలు, ఇంకా 750 కోయ ఇంటి పేర్లకు సంబంధించిన జీవన చిత్రాలను గీశారు. వీటిని చెక్కేందుకు ఏపీలోని నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో దాదాపు 450 మంది కళాకారులు నెలల తరబడి రేయింబవళ్లు శ్రమించారు. ఇంతటీ మహాద్భుతంగా మేడారం జాతర నిర్వహణకు ప్రభుత్వం కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పనులు చేపట్టడం రికార్డే..

**నాడు మాట ఇచ్చి.. నేడు నిజం చేసి..**

గతంలో పీసీసీ అధ్యక్షుడిగా వ్యవహరించిన సమయంలో రేవంత్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్నారు. ఆ సమయంలో ప్రజలు, ఆదివాసీలు మేడారంలో అభివృద్ధి పనులు , పునర్నిర్మాణ పనులు చేపట్టాలనీ, జాతరకు అన్ని హంగులు కల్పించాలని కోరారు. తాము అధికారంలోకి రాగానే తప్పకుండా మేడారంలో పునర్నిర్మాణ పనులు చేసి తీరుతామని నాడు రేవంత్ రెడ్డి మాట ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నేడు మేడారం అభివృద్ధికి నడుం బిగించారు. ఇచ్చిన మాటను నేడు నిలుపుకుంటున్నారు. మేడారం ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. దీంతో నిత్యం మేడారంలో జరిగే పనులపై సమీక్ష నిర్వహి స్తూ మంత్రులు, అధికారులకు సూచనలు చేస్తూ పనులను పరుగులు పెట్టిస్తున్నారు.

జనవరి చివరిలోగా పనులు పూర్తి చేసేలా అధికార యంత్రాంగాన్ని పురమాయిస్తున్నారు. మేడారం మహా జాతరను దేశ వ్యాప్తం గా గుర్తింపు వచ్చేలా కనులపండువగా నిర్వహించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుంచి ప్రతి రోజు పనుల వేగవంతం పై అడిగి తెలుసుకుంటున్నారు. మేడారం ఆలయంలో పున: నిర్మాణం పనులు వేగవంతానికి మంత్రుల బృందం ప్రతిరోజు సమీక్ష నిర్వహిస్తున్నది. వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రులు ధనసరి సీతక్క, కొండా సురేఖ నిత్యం పనులను పరిశీలిస్తూ అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. పనుల్లో పూర్తి నాణ్యత పాటించేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

**మేడారం మహా జాతర ప్రత్యేకత**


మన దేశంలో లెక్కలేనన్ని జాతర్లు ఉన్నప్పటికిని మేడారం జాతర ప్రత్యేకతనే వేరు. రెండేళ్లకు ఒకసారి జరిగే ఈ ఉత్సవంను తిలకించేందుకు ఎందరో భక్తులు ఎదరు చూస్తూ ఉంటారు. 2026 జనవరి 28వ తేదీ బుధవారం సారలమ్మ రాకతో మేడారం మహా జాతర ప్రారంభమవుతుంది. 29న గురువారం సమ్మక్క దేవత గద్దెకు రావడం, 30న శుక్రవారం భక్తులు మొక్కులు సమర్పించుకోవడం, 31వ తేదీ దేవతల వనప్రవేశంతో జాతర ముగియనుంది.

సమ్మక్క సారలమ్మలను దర్శించుకునేందుకు దేశ నలుమూలల నుంచి భక్తులు రావడం ఆనవాయితి. భక్తులను నిరుత్సాహపరచకూడదనే ఉద్దేశ్యంతో పాటు, భక్తుల మనోభావాలను గౌరవిస్తూ ప్రభుత్వం ఈ మహా జాతర పనులను పున: నిర్మిస్తుంది. ఈ జాతర నిస్సందేహంగా ఆధ్యాత్మిక శోభాయాత్ర .

**రచయిత: అసిస్టెంట్ డైరెక్టర్**
**సమాచార, పౌర సంబంధాల శాఖ, కరీంనగర్ జిల్లా**

# ప్రపంచం ముగిసిపోతుందా?

ప్రతి విషయానికీ 'సైన్స్' అనే పదం, లేదా 'నాసా' వంటి అంతరిక్ష పరిశోధనా సంస్థల పేర్లను ఉదహరించ డం.. ఒక చిన్న వాస్తవానికి అభూతకల్పనలు జోడించడం సోషల్ మీడియాలో విపరీతమవుతున్నది. దీనితో అబద్ధాలు కూడా నిజాలుగా, విస్తృత ప్రాచుర్యం పొందుతున్నాయి. అలాంటిదే ఒకటి 'ప్రపంచం ముగిసిపోతుందా?' అనే శీర్షికన దర్శనమిస్తున్న వందలాది వ్యాసాలు.. వేలాది పోస్టులు.. మీడియా కూడా కేవలం ప్రచారం కోసం ఇలాంటి భయంకరమైన శీర్షికలతో కథనాలను ప్రచారం చేయడం శోచనీ యం. సంచలనాలకు దూరంగా, శాస్త్రానికి దగ్గరగా ఉండి చూస్తే, 'ప్రపంచం ముగిసిపోతుంది' అంటూ వచ్చిన ల్యాబ్ అనలాగ్ పరిశోధన గురించి ముందుగా తెలుసుకోవాలి. ఈ పరిశోధన నిజమే. ఇందులో భౌతిక శాస్త్రవేత్తలు ల్యాబ్ అనలాగ్ అనే విధానాన్ని ఉపయోగించారు. ఇది నిజమైన విశ్వాన్ని నాశనంచేసే ప్రయోగం కాదు. విశ్వం ఎలా ముగిసే అవకాశాలు ఉండవచ్చో చెప్పే క్లిష్ట సిద్ధాంతాలను సురక్షితంగా అనుకరించే ఒక విధానం మాత్రమే. మరో రకంగా చెప్పాలంటే, ల్యాబ్ అనలాగ్‌ల లో విశ్వాన్ని కాదు, దాని వెనుక పనిచేసే గణిత నియమాలను చిన్న, నియంత్రిత వ్యవస్థల్లో పునఃసృష్టిస్తారు. దీని వల్ల ప్రమాదం లేకుండా, లోతైన ప్రశ్నలను పరిశీలించవచ్చు. సౌర వ్యవస్థ కట్టుబాట్లలో ఉన్నంత కాలం అది పూర్తిగా నియంత్రితంగా, ప్రశాంతంగా ప్రవర్తించిందని ఈ పరిశోధనలో తేలిన ముఖ్యమైన ఫలితం. చిన్న మార్పులు జరిగితే, వ్యవస్థ కూడా మారుతున్నదని, కానీ, ఈ మార్పు అస్తవ్యస్త విధ్వంసంగా కాకుండా, అంచనా వేయగలిగే విధంగా ముందుకు వ్యాప్తి చెందాయని తెలిసింది. అంటే, చిన్న మార్పు... 'అతి పెద్ద విధ్వంసం' వంటి నాటకీయ పరిస్థితి ఇక్కడ కనిపించలేదు. ఈ విధానం ద్వారా శాస్త్రవేత్తలు, వాక్యూమ్ కూలిపోవడం వంటి అత్యంత తీవ్రమైన ఆలోచనలను కూడా భయం లేకుండా పరిశీలించగలుగుతున్నారు. ఇది విశ్వ అస్థిరతకు నిదర్శనం. వీటిని



నిజంగా జరిగే ప్రమాదం లేకుండా అధ్యయనం చేయడానికి ల్యాబ్ అనలాగ్‌లు ఒక కీలక మార్గం. ఇందులో మార్పులు (ఛేంజెస్) హద్దులు (త్రెష్‌హోల్డ్స్), ప్రతిచర్యలు (ఫీడ్‌బ్యాక్ లూప్స్) తదితరాలను స్పష్టమైన సంకేతాలతో కొలవగలుగుతారు. ఈ ప్రయోగాల అర్థాన్ని క్వాంటం ఫ్రేమ్‌వర్క్‌లు నియంత్రిస్తాయి. అవి లేకపోతే, 'శ్వాంతం దగ్గరలోనే' వంటి శీర్షికలతో కథలు మరింత విస్తారంగా ప్రచారమయ్యే ప్రమాదం ఉంది. శాస్త్రవేత్తలు ఆ భాషను కాకుండా... డేటాను, గణితాన్ని, పరిమితులను మాత్రమే నమ్ముతారు. అందుకే శాస్త్రీయ నిర్ణయాలు సంచలనంగా కాకుండా స్థిరంగా ఉంటాయి. ఈ పరిశోధన ప్రధాన్యత వాక్యూ మ్ స్టెబిలిటీపై మన అవగాహనను పదును పెట్టడంలో ఉంది. విశ్వానికి నిజంగా హద్దులు ఉన్నాయా? ఉంటే అవి ఎక్కడ ఉన్నాయి? అనే ప్రశ్నలకు సమాధానలను శాస్త్రీయ విధానంలో గణితాన్ని ఉపయోగించి తెలుసుకునే ప్రయత్నం జరుగుతున్నది. ఈ ప్రశ్నలకు వచ్చే సమాధానాలు భవిష్యత్తు మోడల్స్‌ను మెరుగుపరచడానికి ఉపయోగపడతాయి. అంతేగానీ, 'విపత్తు ముంచుకొస్తున్నది' అని జోస్యం చెప్పడానికి కాదు. భయం కాదు, వినయం ఈ పరిశోధన వెనుక ఒక లోతైన శాస్త్రీయ సంస్కృతి ఉంది. ఎందుకంటే శాస్త్రవేత్తలు భయాన్ని వెంబడించరు. వాళ్లు తమ అంచనాలను పరీక్షిస్తారు. ఇది ఏళ్ల తరబడి చేసిన పరిశోధనలు, అధ్యయనాల ఫలితాలే తప్ప అకస్మాత్తుగా పుట్టుకొచ్చిన ఆలోచనలు కూడా కావు. స్థూలంగా చెప్పాలంటే, మనుషుల కాలప్రమాణంలో విశ్వం స్థిరంగానే ఉంది. శాస్త్రం శీర్షికలను నమ్మి కాదు.. ఆలోచనలను పరీక్షించి ముందుకు సాగుతుంది. ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు వెతుకున్నది. ఒకప్పుడు అద్భుతాలు.. అంతుచిక్కని రహస్యాలు అనుకున్న ఎన్నో విషయాలు ఇప్పుడు శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాల కారణంగానే సామాన్యమైన అంశాలుగా మారాయి. నేటి ప్రశ్న.. రేపటి సమాధానమవుతుంది.

## ప్రతీ ఆదివారం గోదావరి హారతి



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఏరుది రివర్ ఫెస్టివెల్‌లో భాగంగా ఇక నుండి ప్రతీ ఆదివారం గోదావరి నదికి హారతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రజలు, భక్తుల కోరిక మేరకు ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. గత నెల 27న భద్రాచలం గోదావరి తీరంలోని కరకట్ట సమీపంలో నిర్వహించి ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో పాటు ఆధ్యాంతం భక్తి భావాని నింపడంతో భక్తులు పెద్ద ఎత్తున ఆకర్షితులయ్యారు. మరో ప్రక్క సాంస్కృతిక కార్యక్రమాలు జరగడంతో యువతను కూడా ఈ కార్యక్రమం ఆకట్టుకుంది. నదుల ప్రాముఖ్యత, సంస్కృతి సంప్రదాయాల వారసత్వంగా ఈ కార్యక్రమాన్ని మరింత మందికి తెలిసే విధంగా ఈ వేడుకను ఇక నుండి ప్రతీ ఆదివారం నిర్వహించేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయనున్నారు.

## యూనివర్సల్ విద్యాలయంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు



**ప్రజాపక్షం/ తల్లాడ :** స్థానిక యూనివర్సల్ ఇంగ్లీష్ మీడియం విద్యాలయం నందు ముందస్తు సంక్రాంతి వేడుకలు శనివారం పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ టికె.ప్రసన్నన్ మాట్లాడుతూ భారతదేశ సంప్రదాయ పండుగల్లో సంక్రాంతి అత్యంత పవిత్రమైన, ఆనందభరితమైన పండుగ అని, పంట చేతికొచ్చిన సంతోషాన్ని పంచుకునే ఈ పండుగ రైతుల శ్రమకు గౌరవం తెలిపే మహోత్తరమైన సందర్భమని అన్నారు. అనంతరం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టికె.మేరిసోపియా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## న్యూ సెంచరీ హైస్కూల్‌లో...



**ప్రజాపక్షం/బూర్గంపాడు:**మండల కేంద్రంలోని న్యూసెంచరీ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. శుక్రవారం పాఠశాల ఆవరణలో కరస్పాండెంట్ ఆశిక్ లైక్ ఆధ్వర్యంలో సంక్రాంతి శోభ ఉట్టిపడేలా కొబ్బరి ఆకులతో చెరుకుగడలతో సుందరంగా అలంకరించారు. తెలుగు వారి సంస్కృతి సాంప్రదాయాలలో భాగంగా సంక్రాంతికి ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అదే ముగ్గులు పాఠశాల ఆవరణలో విద్యార్థినీలు గ్రూపులుగా రంగు రంగుల వల్లికలతో అలంకరించారు. గొబ్బెమ్మలతో, కుండ మీద పాలమీదగ పొంగు చెరుకు గడలతో గాలిపటాలతో అందంగా అలంకరించారు. ముగ్గుల పోటీలలో పోటాపోటీగా పాల్గొన్న విద్యార్థినీలకు ప్రత్యేక బహుమతులు అందించారు. విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రియదర్శినీ కాలేజీలో...




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** స్థానిక ప్రియదర్శిని డిగ్రీ, పీజీ కాలేజీలో శనివారం సంక్రాతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో భాగంగా విద్యార్థులకు పలు సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. రంగోలి, కోలాటం, గ్రూప్ డాన్స్, పాటలులతో పాటు క్రికెట్, కబడ్డీ, పతంగుల పోటీలు ఆనందాన్ని నింపాయి. ఈ సందర్భంగా డైరెక్టర్ కాటేపల్లి నవీన్ బాబు మాట్లాడుతూ సంక్రాంతి వంటి సంప్రదాయ పండుగలను విద్యార్థులతో కలిసి జరుపుకోవడం ద్వారా సంస్కృతి, సంప్రదాయాలు, విలువలు మరింతగా బలపడతాయని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో దాగున్న సృజన్మాకత, ఐఖ్యత పెంపొందుతాయని చెప్పారు. అనంతరం షీ టీమ్ ఎస్ఐ రమాదేవి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు పలు సాంస్కృతిక, సామాజిక రంగాల్లో ప్రతిభను చూపినప్పుడే సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల కోసం కళాశాల యాజమాన్యం నిర్వహించడం అభినందనీయం అన్నారు. అనంతరం కలాశాల డైరెక్టర్ మాచినేని చలపతిరావు, ప్రిన్సిపల్ డా. నయూమ్ పాషా మాట్లాడుతూ ఇలాంటి వేడుకలు విద్యార్థుల్లో నాయకత్వపు లక్షణాలు పెరిగేలా చేస్తాయని, మరింత బాధ్యతను పెంచుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రాయల వివేక్, పిడి కాశిమల్ల రమేష్, అధ్యాపకులు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో..



**ప్రజాపక్షం/సత్తుపలి :** మండల పరిధిలోని సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా శనివారం ముందస్తు సంబురాలు విద్యార్థులు, ఫ్యాకల్టీ సభ్యులు ఘనంగా జరుపుకున్నారు. బీటెక్ అన్ని బ్రాంచీలు, డిప్లొమా, ఎంబీఏ విద్యార్థులు, సాయిస్ఫూర్తి సేవాసమితి, జాతీయ సేవా పథకం (ఎన్ ఎస్ ఎస్) సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను వివరించారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగల ప్రత్యేకతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ముగ్గుల (రంగోలి) పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రంగురంగుల ముగ్గులతో కళాశాల వాతావరణం పండుగ కళతో కళకళలాడింది. ఈ వేడుకకు వర్చువల్‌గా హాజరైన కళాశాల చైర్మన్ డాక్టర్ బండి పార్థసారథి రెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద లు ఫ్యాకల్టీ, విద్యార్థులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్స్ పాల్ డా. వూటుకూరి.శేషారత్నకుమారి, అన్ని బ్రాంచీల విభాగాధిపతులు, కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేసిమెంట్ ఆఫీసర్ డా.డియన్ వి.కృష్ణారెడ్డి, జాతీయ సేవా పథకం (ఎన్ ఎస్ ఎస్) ఆఫీసర్ బలుసుపాటి సీతారాములు అసిస్టెంట్ ప్రొఫెసర్, ఫ్యాకల్టీ మెంబర్స్ విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమంలో ఎక్కడా తగ్గేదేలే

❑ పాలేరు నియోజకవర్గ పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ❑ రూ.4కోట్ల వ్యయంతో నిర్మించనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** రెండేళ్ల క్రితం మీరు ప్రజా ప్రభుత్వం కావాలని నన్ను మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. ఆ నాడు మీరు నాపై ఉంచిన నమ్మకాన్ని గుండెల్లో పెట్టుకుని పాలేరు నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దులా పరిగెట్టిస్తున్నానని రాష్ట్ర రెవిన్యూ, గృహ, నిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం ఖమ్మం రూరల్, ఏదులాపురంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని విద్యాగనగర్‌లో రూ.4కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అంతర్గం సిసిరోడ్లు, డ్రైన్లు, కల్వర్టు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయుడుపేటలో రూ.కోటి రెండు లక్షల యాభైవేల వ్యయంతో అంతర్గత సీసీరోడ్లు, బస్ షెల్టర్, జంక్షన్ అభివృద్ధి, కమ్యూనిటీహాల్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే నడిమి తండాలో రూ.77.10లక్షలు, గొల్లగూడెంలో రూ.37.20లక్షలు, జలగంనగర్‌లో రూ. 29.30 లక్షలు, బారుగూడెంలో రూ.24.27లక్షలు, ఆటోనగర్‌లో రూ.24.27 లక్షలు, ఆటోనగర్‌లో రూ.17.20లక్షల అంచనా వ్యయంతో చేపట్టే సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి బిఆర్‌ఎస్ పదేళ్ల పాలనపై నిప్పులు చెరిగారు. గత పది సంవత్సరాల కాలంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం పేదవాడి కష్టాలను పట్టించుకోలేదని, రేషన్‌కార్డులు అడిగితే మొహం, చాటేశారని మండిపడ్డారు. పదేళ్లుగా కొత్త రేషన్ కార్డులే ఇవ్వకుండా దగా చేసిన గత పాలకుల తీరును ఎండగడుతూ తమ ఇందిరమ్మ రాజ్యంలో అర్హులందరికీ కార్డులు అందజేయడమే కాకుండా, దేశంలోని ఏరాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని విధంగా తెలంగాణలో సన్న బియ్యం అందిస్తున్నామని చెప్పారు. గతంలో హాస్టళ్లలో పేద పిల్లలకు సరైన తిండి పెట్టలేదని, తమ ప్రభుత్వం వచ్చాక డైట్ ఛార్జీలను 40శాతం, కాస్మొటిక్ ఛార్జీలను ఏకంగా 200శాతం పెంచి పేద విద్యార్థులకు అండగా నిలిచామని వివరించారు. సొంత ఇల్లు లేని ప్రతి పేదవాడికి గూడు కల్పించడమే తమ ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. వచ్చే ఏప్రిల్ నెల నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ చేపడతామని, ఈ ప్రక్రియ దఫాలవారీగా నిరంతరం కొనసాగుతుందన్నారు. పేదవారికి ఎల్లవేళలా అండగా ఉండే విధంగానే ఈ ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని, రాబోయే ఎన్నికల్లోనూ ప్రజల దీవెనలు ఇలాగే కొనసాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ, కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, తహశీల్దార్ పిలి రాంప్రసాద్, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు, జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి, అంబటి సుబ్బారావు, తమ్మినేని నవీన్, ధరావత్ రామ్మూర్తినాయక్, భూక్య సురేష్‌నాయక్, మండల కాంగ్రెస్ నాయకులు వెంపటి రవి, పల్లెర్ల పాండయ్య, పొన్నెకంటి యాకూబ్, చింతమళ్ల రవి, సిపిఐ నాయకులు సురేందర్, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## బెటాలియన్ సమస్యల పరిష్కారానికి కృషి

❑ 15వ బెటాలియన్ ఇంటర్ కంపెనీ స్పోర్ట్స్ మీట్ 2026 ముగింపు వేడుకల్లో మంత్రి సీతక్క




**ప్రజాపక్షం/సత్తుపల్లి :** 15వ బెటాలియన్‌కు సంబంధించిన సమస్యలను న్యాయపరంగా పరిశీలించి, అతి త్వరలో పరిష్కరిస్తానని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. మండల పరిధిలోని గంగారంలో గల 15వ బెటాలియన్‌లో నిర్వహించిన ఇంటర్ కంపెనీ స్పోర్ట్స్ మీట్ 2026 ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ యన్ పెద్దబాబు మంత్రి సీతక్కను సాధరంగా స్వాగతించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మంత్రి 100 మీటర్ల పరుగు, టగ్ ఆఫ్ వార్ వంటి క్రీడా పోటీలను ప్రారంభించారు. వివిధ క్రీడా పోటీలలో ప్రతిభ చూపిన పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు బహుమతులు అందజేశారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది ఉద్యోగ రీత్యా ఎన్నో ఒత్తిడులను ఎదుర్కొంటారని, ఇలాంటి క్రీడా పోటీలు వారికి మానసిక ఉత్సాహం, శారీరక ఆరోగ్యం, పని ఒత్తిడి నుంచి ఉపశమనాన్ని కలిగిస్తాయని తెలిపారు. వివిధ కంపెనీల కంటిన్జెంట్లు నిర్వహించిన కవాతు తనను ఎంతగానో ఆకట్టుకుందని, అలాగే 15వ బెటాలియన్‌కు సంబంధించిన సమస్యలను న్యాయపరంగా పరిశీలించి అతి త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానందు మాట్లాడుతూ మంత్రి సూచించిన విధంగా బెటాలియన్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారానికి తాము పూర్తిగా సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమాండెంట్‌యన్ పెద్దబాబు మాట్లాడుతూ తెలంగాణ స్పెషల్ పోలీస్ అదనపు డీజీ సంజయ్ కుమార్ జైన్ ఆదేశాల మేరకు ఈ ఇంటర్ కంపెనీ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించామని తెలిపారు. ఇందులో పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, మినిస్టీరియల్ స్టాఫ్, ఫోర్త్ క్లాస్ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్కకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఎసిపి వసుందర యాదవ్ ఐపీఎస్, అడిషనల్ కమాండెంట్ ఏ. అంజయ్య, అసిస్టెంట్ కమాండెంట్లు ఎస్. శ్రీధరరాజ్, పి. వేణుగోపాల్ రెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, మినిస్టీరియల్ స్టాఫ్, హోంగార్డులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మణుగూరు మండల పరిధిలో సింగరేణి ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/మణుగూరు :** సింగరేణి సేవ సమితి, సింగరేణి వైద్య, ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో మణుగూరు మండల పరిధిలోని రామానుజవరం గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యలయం నందు శనివారం సింగరేణి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి ఏరియా హాస్పిటల్ మెడికల్ డాక్టర్ వి.రమణయ్య మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం తమ వంతు సామాజిక బాధ్యతగా ప్రాజెక్ట్ ప్రభావిత గ్రామాలతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిచడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో భాగంగా ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ ఆదేశం మేరకు మణుగూరు ఏరియా రామానుజవరం గ్రామం నందు నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో అధిక సంఖ్యలో విచ్చేసి మొత్తం 106 మంది వైద్య సేవలు అందుకున్నారు. ఈ వైద్య శిబిరంలో సాధారణ సీజనల్ వ్యాధులతో పాటు బిపి, షుగర్ వ్యాధి గ్రస్తులను పరీక్షించి ఆయా వ్యాధుల నివారణకు ఉచితంగా మందులు అందజేయడం జరిగిందన్నారు. టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ వంటి విష జ్వరాలు దోమల వల్ల సోకుతాయి కాబట్టి ఇంటి పరిసరాల్లో పూల కుండీల్లో, మురికి కాలువల్లో, కూలర్లలో నీరు నిలువ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ డాక్టర్ వి. రమణయ్య, స్టాఫ్ నర్స్ రూప శ్రీ, సింగరేణి సేవ సమితి కో ఆర్డినేటర్ కె. వి. మారేశ్వర రా వు, ఆసుపత్రి సిబ్బంది నందిని, పంచాయతీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## చోరీల నియంత్రణకు పటిష్ట చర్యలు

పండుగ వేలా ఊరు వెళ్లెవారు జాగ్రత్త

సిపి సునీల్‌దత్ సూచన



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** పండుగ వేలా కమిషనరేట్ పరిధిలో చోరీలను నియంత్రించేందుకు పోలీసు పహారా మరింత పెంచుతున్నట్లు పోలీసు కమిషనర్ సునిల్‌దత్ తెలిపారు. సంక్రాంతి పండుగకు ఇల్లు వదిలి ఊర్లకు వెళ్లే వారు పాటించవలసిన ముందస్తు జాగ్రత్తలను శనివారం మీడియాకు ఆయన వివరించారు. పండుగకు గ్రామాలకు వెళ్లేవారు ఇంట్లో విలువైన అభరణలు, నగుదు ఉంచవద్దని బ్యాంక్‌లో కాని భద్రపరచడం కాని వెంట తీసుకుని వెళ్లటం కాని చేయలన్నారు. రాత్రి వేళ వీధుల్లో పోలీసు పెట్రోలింగ్, బీట్‌గస్తీ ముమ్మరం చేశామన్నారు. బస్టాండ్, ఆటో అడ్డా, రైల్వే స్టేషన్లను తనిఖీ చేయాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు.

### చైనా మాంజా నిషేదం నిబంధనలు ఉల్లంఘిస్తే జైలుకే

పక్షులతో పాటు ప్రజల ప్రాణాలకు ప్రమాదకరంగా మారిన నిషేధిత చైనా మాంజాను ఎవరైనా విక్రయించినా, వినియోగిం చినా చట్టపరమైన చర్యలు తీసుకోవటంతో పాటు కేసులు న మోదు చేసి జైలుకు పంపుతామని పోలీసు కమిషనర్ సునిల్ దత్ హెచ్చరించారు. శనివారం ఈ మేరకు ఒక ప్రకటన విడు దల చేశారు. సంక్రాంతి సమీపిస్తున్న నేపథ్యంలో యువత ఎ క్కువగా గాలిపటాలు ఎగురవేసేందుకు ఆసక్తి చూపుతారని దీనికి సాధారణ దారం బదులు సింథటిక్ దారం, గాజు పొడి తో తయారు చేసిన చైనా మాంజా వాడితే శిక్ష తప్పదన్నారు. దీ ని వాడకం వలన పక్షుల రెక్కలు, గొంతు తెగిపోవడంతో పా టు మనుషులకు గాయాలు కావడం జరుగుతోందన్నారు. చట్టవిరుద్దమైనా చైనా మాంజా నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎవరైనా మాంజా విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసు కమిషనర్ ప్రజలకు విజ్ఞాప్తి చేశారు.

## గురుకుల బాలికలకు రోడ్డు భద్రతపై అవగాహన

భద్రాచలం ఎంవిఐ సంగం వెంకట పుల్లయ్య




**ప్రజాపక్షం/మణుగూరు :** మణుగూరు మండలంలోని మహాత్మా జ్యోతిభా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పినపా క బాలికల పాఠశాలలో, జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు 2026 సందర్భంగా రోడ్డు భద్రత పై అవగాహన సదస్సు నిర్వహించబడింది. ఈ కార్యక్రమం పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. సరిత అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న భద్రాచలం మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెకర్ సంగం వెంకట పుల్లయ్య మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు కోకరిక్యులర్ యాక్టివిటీస్ నేర్చుకోవడం ఎంత ముఖ్యమో, అదే విధంగా రోడ్డు భద్రతపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండటం కూడా అత్యంత అవసరమని తెలిపారు. ప్రస్తుతం పురుషులు మాత్రమే కాకుండా మహిళలు కూడా అన్ని రంగాల్లో రాణిస్తున్నట్లే వాహన డ్రైవర్లుగా ముందుకు వస్తున్నారని, అందువల్ల ప్రతి వాహన డ్రైవర్ తప్పనిసరిగా రోడ్డు పక్కన ఉన్న ట్రాఫిక్ బోర్డులు, సిగ్నల్స్ అర్థం తెలుసుకొని వాటిని కచ్చితంగా పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. రోడ్డు భద్రతపై అవగాహన ఉండటం వల్ల పిల్లలు రోడ్డుపై నడిచేటప్పుడు, సైకిల్ తొక్కేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటిస్తారని, తద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించి ప్రాణ నష్టం లేకుండా తమను తాము కాపాడుకోవచ్చని వివరించారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా అతివేగం, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయ డం, మద్యం లేదా నిద్ర మత్తులో వాహనం నడపడం, దూర ప్రయాణాల్లో విరామం తీసుకోకపోవడం, రోడ్డు మీద దృష్టి పెట్టకపోవడం వంటి అంశాలను వివరించారు. ద్విచక్ర వాహన డ్రైవర్లకు నాణ్యమైన హెల్మెట్, నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారికి సీట్ బెల్ట్ తప్పనిసరిగా ప్రాణా లు కాపాడుతాయని పేర్కొంటూ, "అమ్మ జన్మనిస్తే హెల్మెట్, సీట్ బెల్ట్ పునర్జన్మనిస్తాయి" అని తెలిపారు. ఈ సదస్సులో తెలుసుకున్న విషయాలను విద్యార్థులు తమ తల్లిదండ్రులు, సోదరులు, తోటి పిల్లలకు తెలియజేసి రోడ్డు ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోఅసిస్టెంట్ ప్రిన్సిపాల్ జె.జయశ్రీ, ఉపాధ్యాయులు మమత, సుజాత, బి.జ్యోతి, కొమురమ్మ,నాన్‌టీచింగ్ సిబ్బంది శ్రావణి పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు





**ప్రజాపక్షం/సత్తుపల్లి :** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణ పరిధిలోని టాలెంట్ స్కూల్, శ్రీ చైతన్య టెక్నో స్కూల్, విశ్వశాంతి, మదర్ థెరిస్సా టెక్నో స్కుల్స్ నందు శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడులలో సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి దయానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పులి అరుణ, విశ్వశాంతి కరస్పాండెంట్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## ఎసిపి వసుంధర యాదవ్‌ను కలిసిన వనమా విశ్వేశ్వరరావు

**ప్రజాపక్షం/వైరా :** వైరా వర్తక సంఘం అధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు, వైరా వాసవి కళ్యాణ మండపం చైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళ కృష్ణమూర్తి, ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ మొదటి ఉపాధ్యక్షులు నూకల శ్రీనివాసరావు, వైరా ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షులు మిట్టపల్లి కిరణ్‌కుమార్ వైరా ఎసిపి వసుంధర యాదవ్ ఐపిఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ నెల11న జరిగే ఆర్యవైశ్య మహాసభ, సంతూర్ వారి ఆధ్వర్యంలో జరిగే ముగ్గుల పోటీకి ఆహ్వానించారు. అనంతరం వైరా సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వెంకటప్రసాద్‌ని, వైరా సబ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్ పుప్పాల రామారావుని శాలువాతో సన్మానించి సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.




## సత్తుపల్లిని అభివృద్ధిలో అగ్రభాగాన నిలబెడతాం




పలువురికి సిఎంఆర్‌ఎఫ్, కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** ప్రజల చిరునవ్వులే తమకు ఆశీర్వాదాలని, వారికి కష్టం రాకుండా శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి దయానంద్. శనివారం పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన చేశారు. అదేవిధంగా పట్టణంలోని మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో స్వయంగా ఇంటింటికి వెళ్లి 42 మంది లబ్ధిదారులకు రూ.42,04,872 విలువ గల కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులు, 15 మందికి సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. చెక్కుల పంపిణీతో పాటు వార్డులలోని ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి తక్షణ పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల కుటుంబాల ఆరోగ్య, సంక్షేమ వివరాలను తెలుసుకుంటూ, రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వెంగళరావు నగర్ కాలనీలో సింగరేణి ఆధ్వర్యంలో నూతన బస్ షెల్టర్, కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన, భూమిపూజ నిర్వహించి అనంతరం సత్తుపల్లి మార్కెట్ యార్డులో రాష్ట్ర ఇసుక బజార్‌ను పరిశీలించారు. సుమారు 6 గంటల పాటు నిర్విరామంగా అన్ని వార్డుల్లో పర్యటించి చె క్కులు అందజేశారు. ఈ కార్యక్రమం ప్రజ ల్లో విశేష స్పందన పొందింది. అసత్తుపల్లి మున్సిపాలిటీని అవినీతి లేని అభివృద్ధి ము న్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం" అని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదే చెన్నారావు, కమల్ పాషా, విరివాడ నాగభూషణం, దూదిపాళ్ళ రాంబాబు, టోపి శ్రీను, ఆయా వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో కళాకారులకు అవకాశం కల్పించాలి

**సాంస్కృతి జానపద కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరెంపుల సతీష్**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** జరగబోవు మున్సిపాలిటీ, జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికలలో రిజర్వేషన్ల ప్రకారం జానపద కళాకారులకు అవకాశం కల్పించాలని సాంస్కృతి జానపద కళాకారుల సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరెంపుల సతీష్ రాజీకయ పార్టీలను కోరారు. ఈ మేరకు శనివారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులోని సిపిఐ కార్యాలయంలో కళాకారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్ర స్థాయిలో ప్రజా గాయకుడు గద్దర్, రసమయి బాలకృష్ణ, దేశపతి శ్రీనివాస్, గోరెటి వెంకన్న, వెన్నెల సాయిచంద్‌లాగానే తమను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలను చైత్యం చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలు, పార్టీల విజయాగాథలను వివరిస్తూ సమాచార కేంద్రంగా తమ వృత్తి పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతి సేవ జానపద కళాకారుల అధ్యక్షుడు వంగపండు పుల్లారాఉవ, ప్రజాగాయకుడు చందర్రావు, డప్పు నాగేశ్వరరావు, కొచ్చర్ల గురవయ్య, పేరలా నగేష్, తాళ్లపల్లి మనోజ్, కాంపాటి శ్రీను, కుమారి, లలిత, రేణుక, అరుణ, హర్షిత, మాలతి, డప్పు వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.



## గ్రామీణ ఉపాధిహామీ పథకం రద్దుకు కేంద్ర కుట్రను ప్రతిఘటించండి



**ప్రజాపక్షం/జనగామ:** దేశంలో రైతు కూలీలు,పేదలపై కక్షకట్టినటువంటి మోదీ ప్రభుత్వం, దేశంలో సీపీఐ సపోర్ట్‌తో ఏర్పడ్డ నాటి కాంగ్రెస్ ప్రభుత్వం, గ్రామీణ పేదల బతుకుల బాగుకొరకు సీపీఐ సూచనతో ఏర్పాటుచేసిన మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మోదీ ప్రభుత్వం రద్దు చేయడం కోసం కంకణం కట్టుకుందని ఆ కుట్రను కార్మికులు, ప్రజలు ప్రతిఘటించాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు సీహెచ్ రాజారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్‌లో సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం యాదగిరి అధ్యక్షతన జరుగగా రాజారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఇప్పటికే దేశంలో రైతులను నాశనం చేయడం కోసం రైతు వ్యతిరేక చట్టాలను తెచ్చి వేల మంది చావుకు కారణమై, లక్షలాది మందిరైతులు తిరుగుబాటుతో ఉపసంహరించుకుందని, మరోవైపు కోట్లాది మందిగా ఉన్న కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి కార్మికుల మెడపై కత్తి వేలాడదీసిందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, జిల్లా నాయకులు సొప్పరి సోమయ్య, జువారి రమేష్, రావుల సదానందం, తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజాపక్షం' ముమ్మాటికీ ప్రజలపక్షమే!



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** 'ప్రజాపక్షం' ముమ్మాటికీ ప్రజలపక్షమేనని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ అన్నారు. ప్రజాపక్షం మహబూబాబాద్ జిల్లా 2026 నూతన సంవత్సర క్యాలయండర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పక్షాన నిలుస్తూ అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర, స్థానిక రాజకీయ, సామాజిక అంశాలను ఎప్పటికప్పుడు ప్రజలకు అందిస్తూ ప్రజాపక్షం ప్రజలపక్షానే నిలుస్తోందని అన్నారు. ప్రజాసమస్యలు ప్రభుత్వానికి, ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తూ ప్రభుత్వానికి ప్రజలకు అనుసంధాన కర్తగా వ్యవహరిస్తూ ప్రజల మన్ననలు పొందడంలో ప్రజాపక్షం ముందు వరుసలో ఉందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షులు గణపురపు అంజయ్య, ఖలీల్, నీరుడి లక్ష్మినారాయణ, సురేష్‌నాయక్, ఎడ్ల రమేష్, సాయి, నీరుడి సురేష్, సల్వాది దిలీప్, భూక్య శ్రీను, విజయలక్ష్మి , కాటాభాస్కర్, సత్యమనోరమ, నజీర్, మాదరబోయిన యాకయ్య, కొమ్మకుల రాజేశ్వర్ పాల్గొన్నారు.

## ప్రజల కోసం నిరంతరం పని చేసే పత్రిక...



**ప్రజాపక్షం/గూడూరు:** ప్రజల కోసం నిరంతరం పని చేసే పత్రిక ప్రజాపక్షం అని గూడూరు వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ మాలిక్ టియుడబ్ల్యూజె(ఐజెయు) గూడూరు మండల అధ్యక్షుడు గుర్రపు యాకాబరం అన్నారు. శనివారం గూడూరు మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో అబ్దుల్ మాలిక్ గుర్రం యాకాబ్రం వీరి చేతుల మీదగా ప్రజాపక్షం 2026 నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించారు ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మీడియా ప్రభుత్వానికి నాలుగో స్తంభం లాంటిదని విలువైన సమాచారం ప్రజలకు చేరవేయాలన్నారు. పత్రికలు సామాజిక బాధ్యతతో ప్రజా సమస్యలను ప్రభుత్వం అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సామాజిక సేవలో భాగస్వాములు కావాలని సూచించారు. ఎప్పుడు ప్రజల పక్షన ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్యాధికారులకు ప్రజాప్రతినిధులకు అనుసందాంగా ఉండాలన్నిరు.గూడూరు మడలం కేంద్రంలో రైతులకు యూరియా అందించడంలో మీడియా ప్రధాన పాత్రను పోషించాయని ఎప్పటికప్పుడు రైతులకు సమాచారాన్ని అందిస్తూ ఎంతగానో తోడ్పాటు అందించారని ప్రజాపక్షం పత్రిక ను అభినందించారు. ఈకార్యక్రమంలో నాయకలు రైతులు పత్రిక మిత్రులు పాల్గోన్నారు.

## చిన్నారుల కిడ్నాప్ ముఠా అరెస్ట్



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** వరంగల్ నగరంలో చిన్నపిల్లల కిడ్నాప్ లకు పాల్పడుతున్న నిందితులను కాజిపేట్ పోలీసులు,టాస్క్ ఫోర్స్ పోలీసులు కలిసి పట్టుకోవడం జరిగిందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. శనివారం పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 28న తెల్లవారుజామున కాజీపేట రైల్వే స్టేషన్ బయట ఫుట్ పాత్ పైన నిద్రిస్తున్న కన్నా నాయక్ కుమారుడైన 5 నెలల వయసున్న మల్లన్న అనే బాలుడిని గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసిన సంఘటనలో బాలుడి తండ్రి కన్నా నాయక్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కాజీపేట పోలీసులు కేసు నమోదు చేశారు.ఇట్టి కేసు దర్యాప్తులో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కాజిపేట్, టాస్క్ ఫోర్స్ పోలీసులు బృందాలుగా ఏర్పడి విచారించగా నేర స్థలంలో లభించిన ఆధారాలతో శనివారం ఉదయం మళ్ళీ చిన్న పిల్లల్ని కిడ్నాప్ చేద్దామని ప్రయత్నిస్తున్న నేరస్తులైన పెద్దపల్లి జిల్లాకు చెందిన కొడుపాక నరేష్, వెల్పుల యాదగిరి ఇద్దరు కలిసి అద్దెకు తీసుకున్న కారులో అనుమానాస్పదంగా కాజీపేట రైల్వే స్టేషన్ బయట ఫుట్ పాత్ వద్ద రెక్కి నిర్వహిస్తుండగా నిందితులను కాజీపేట పోలీసులు పట్టుకొని విచారించగా వాళ్లు 28 డిసెంబర్, 2025 రోజున కిడ్నాప్ చేసిన ఐదు నెలల బాబు కిడ్నాప్ తో పాటుగా గతంలో నలుగురు చిన్న పిల్లల్ని కిడ్నాప్ చేసినట్టుగా ఒప్పుకున్నారు. ఇట్టి పిల్లలను వీళ్ళు పిల్లలు కలగలేని దంపతులకు అనాధాశ్రమాల నుంచి తీసుకొచ్చి ఇస్తున్నట్టుగా నమ్మబలికి డబ్బులకు అమ్ముకున్నారు. ఇట్టి నేరస్తుల నేర ఒప్పుకోలు ఆధారంగా కాజీపేటలో అపహరణకు గురైన ఐదు నెలల బాబు మల్లన్నతో పాటుగా మిగతా నలుగురు పిల్లల పిల్లలను రెస్క్యూ చేయడం జరిగిందని పోలీస్ కమిషనర్ తెలిపారు. అదేవిధంగా ఎలాంటి చట్టబద్ధ ఆధారాలు లేకుండా కొనుగోలు చేసిన దంపతులను కూడా అదుపులోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు. చిన్నపిల్లల కిడ్నాపకు పాల్పడుతున్న నిందితులను పట్టుకోవడంలో ప్రతిభకనబరిచిన టాస్కోర్స్, కాజీపేట పోలీస్ స్టేషన్కు చెందిన పోలీస్ అధికారులు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించి రివార్డులను అందజేసారు.

# ములుగు జిల్లా పర్యాటకులకు స్వర్గధామం

మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు/హనుమకొండ టౌన్ :** పర్యాటకులకు స్వర్ధధామం ములుగు జిల్లా అని మంత్రి సీతక్క అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ పర్యాటకులు ఎక్కడికో వెళ్ళి పర్యటించి పట్టణ ప్రాంతాల్లో కలుషిత వాతావరణంలో గడిపే బదులు, ములుగు జిల్లా పచ్చని అడవి అందాల పర్యాటక ప్రదేశంలో కుటుంబ సమేతంగా సరాదాగా గడుపుతూ ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచుకుంటూ ఆరోగ్యవంతమైన పర్యటన చేసుకునే విధంగా ములుగు జిల్లా స్వాగతం పలుకుతుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శనివారం తాడ్వాయి మండలం పరిధిలోని జలగలంచ వాగు ప్రాంతంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పచ్చని అడవి అందాల వ్యూ పాయింట్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు జిల్లాలో బొగత జలపాతం ఎంతో మంది పర్యాటకులను ఆకర్షిస్తూ చాలా ప్రాంతాల ప్రజలు వస్తు వెళుతున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, ఎస్‌పి సుధీర్ రాంనాథ్ కేకన్, డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, రేగ కళ్యాణి, అడవిశాఖ అధికారులు, పాల్గొన్నారు. **పెప్సీ-2026 క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి సీతక్క:** ప్రజాపక్షంఉమ్మడి వరంగల్ బ్యూరో : పెరికకుల ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పెప్సీ) 2026 క్యాలెండర్ శనివారం ఉమ్మడి వరంగల్ జిల్లా పెప్సీ అధ్యక్షులు ఆక రాధాకృష్ణ ఆధ్వర్యంలో ములుగు జిల్లా క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆవిష్కరించారు. **మేడారం జాతరలో ప్లాస్టిక్ వాడకుండా పర్యావరణాన్ని రక్షించాలి:** మేడారం జాతరలో ప్లాస్టిక్‌ను వాడకుండా పర్యావరణాన్ని రక్షించాలని మంత్రి సీతక్క అన్నారు. ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారం జాతర అటవీ ప్రాంతంలో శనివారం మంత్రి సీతక్క ప్లాస్టిక్‌ను వాడకండి.పర్యావరణాన్ని పరిరక్షించండి అనే గోడపత్రికలను, జాతరకు వచ్చే భక్తులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడకంటి అనే కరపత్రాలను ఆవిష్కరించారు.

# టాలెంట్ ఎవరిసొత్తూ కాదు

ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, ఎమ్మెల్సీ సారయ్య
ముగిసిన కాకా వెంకటస్వామి మెమోరియల్ టీ-20 క్రికెట్ పోటీలు

**ప్రజాపక్షం/చిల్పూర్ :** జనగాం జిల్లా చిల్పూర్ మండలం పరిధిలోని కాకా వెంకటస్వామి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన టీ-20 క్రికెట్ పోటీల ము గింపు కార్యక్రమానికి మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డిలతో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ టాలెంట్ ఎవరి సొత్తు కాదని, యువతలో, క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో కాకా వెంకటస్వామి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ తరహా క్రికెట్ పోటీల నిర్వహణ అభినందనీయమని అన్నారు. తాను పోలీస్ అధికారిగా పనిచేసిన సమయంలో ట్రాన్స్‌ఫర్ సందర్భంలో కాకా వెంకటస్వామి కలిసిన అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. వరంగల్ అంటేనే క్రీడాకారుల హబ్ అని, క్రీడారంగ బలోపేతానికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఓరుగల్లు నగరంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి జిల్లాకు క్రికెట్ స్టేడియం కేటాయించారని, త్వరలోనే క్రికెట్ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం చేపడతామని వెల్లడించారు. అలాగే, ఓరుగల్లు నగరంలో రాష్ట్రంలోనే నాలుగవ స్పోర్ట్స్ స్కూల్ మంజూరై ప్రా రంభమైందని తెలిపారు. స్పోర్ట్స్ స్కూల్, క్రికెట్ స్టేడియం మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. క్రీడల్లో రాణిస్తూ ఓరుగల్లు జిల్లా, తెలంగాణ రాష్ట్రానికి జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకు రావాలని యువతను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ అయూబ్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి మేడారం పర్యటనకు సన్నాహాలు

**ప్రజాపక్షం/ములుగు:** ఈ నెల 18న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేడారానికి రానున్న నేపథ్యంలో, ఆయన పర్యటనకు సంబంధించిన ఏర్పాట్ల పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. సిఎం కార్యక్రమం ఎలాంటి లోపాలు లేకుండా సజావుగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో మేడారంలో కొనసాగుతున్న ఆదివాసీ మ్యూజియం, ఆర్‌టిసి పార్కింగ్ స్థలాలు, టెంట్ సిటీ పనులకు జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర, జిల్లా ఎస్‌పి రామ్‌నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్రాలు క్షేత్రస్థాయిలో పరిశీలిచారు. ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకొని అన్ని పనులు నిర్ణీత గడుపులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. సిఎం పర్యటన సురక్షితంగా, క్రమబద్ధంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా యంత్రాంగం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## సమ్మక్క సారలమ్మ జాతర ఘనంగా నిర్వహించాలి

ఎమ్మెల్యే కడియం శ్రీహరి,
ఎంపి కడియం కావ్య



**ప్రజాపక్షం/స్టేషన్‌ఘన్‌పూర్:** నియోజకవర్గ పరిధిలో సమ్మక్క సారలమ్మ జాతరలను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించాలని వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్‌లోని రైతు వేదికలో శనివారం నియోజకవర్గ పరిధిలో జరుగనున్న మినీ సమ్మక్క సారలమ్మ జాతరల ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై వివిధ శాఖల అధికారులతో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతర కమిటీ ఛైర్మన్లు, సర్పంచులను జాతరలో చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 8 ప్రాంతాల్లో జరిగే సమ్మక్క సారలమ్మ వన దేవతల జాతరలను ఘనంగా నిర్వహించాలన్నారు. జాతర నిర్వహణకు రూ. 54 లక్షలు మంజూరయ్యాయన్నారు. ప్రతీ జాతరకు తహసీల్దారు ఇన్‌ఛార్జిగా, విద్యుత్, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్, పోలీసు శాఖల అధికారులతో పాటు జాతర కమిటీ ఛైర్మన్లు, సర్పంచులతో కమిటీ ఏర్పాటుచేయాలన్నారు. ఈ కమిటీ 12 లోపు చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రతిపాదనలు సిద్ధం చేసి 13న కలెక్టర్‌కు అందించాలన్నారు. జాతరలో 24 గంటలు విద్యుత్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జాతర ప్రాంతంలో పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని పోలీసులకు సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాతరలను నిర్వహించాలన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు ఇన్‌ఛార్జులుగా కమిటీలు 12 లోగా ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ లావణ్య శిరీష్‌రెడ్డి, శ్రీధర్ రావు, ఆర్డీవో డీఎస్ వెంకన్న, ఏసీపీ భీమ్‌శర్మ, సీఐ శ్రీనివాస్ రెడ్డి, వేణు, ఎస్ఈలు, డీఈలు, ఏఈలు, సర్పంచులు, జాతర కమిటీ ఛైర్మన్లు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## రోడ్ సేఫ్టీ పాటిస్తేనే ప్రమాదాల నివారణ ఏసిపి

**ప్రజాపక్షం/నెక్కొండ:** రోడ్ సేఫ్టీ మాసోత్సవాల్లో భాగంగా నెక్కొండ మండలంలో వాహనదారులకు, ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నర్సంపేట ఏసిపి పి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి నెక్కొండ మండలానికి చెందిన ఆటో డ్రైవర్లు, జీప్ డ్రైవర్లు, స్కూల్ బస్సుల డ్రైవర్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసిపి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు మానవ తప్పిదాల వలనే ఎక్కువగా జరుగుతున్నాయని, మద్యం సేవించి వాహనాలు నడపడం, ర్యాష్ డ్రైవింగ్, ఓవర్ స్పీడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటి అలవాట్లను పూర్తిగా విడిచిపెట్టాలని సూచించారు. రోడ్ సేఫ్టీని పాటించడం చట్టబద్ధమైన బాధ్యత మాత్రమే కాకుండా, ప్రతి ఒక్కరూ నియమాలను గౌరవిస్తేనే ప్రమాద రహిత సాధ్యమని ఆయన పిలుపునిచ్చారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** రానున్న సంక్రాంతి పండుగ సెలవుల సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా గ్రామీణ ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో తమ స్వగ్రామాలకు, బంధువుల ఇళ్లకు ప్రయాణం చేయనున్న నేపథ్యంలో ఖాళీగా ఉండే ఇళ్లలో దొంగతనాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, సంక్రాంతి పండుగలను దృష్టిలో ఉంచుకొని జిల్లా వ్యా ప్తంగా, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, కాలనీలు, ఒంటరిగా ఉన్న ఇళ్ల పరిసరాల్లో పోలీస్ గస్తీని మరింత పటిష్టం చేసినట్లు తెలిపారు. రాత్రి వేళల్లో ప్రత్యేక మొబైల్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ, బీట్ పోలీస్ వ్యవస్థను బలోపేతం చేసి, అనుమానాస్పద కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

## మోడీ విధానాలతో రైతు, కార్మికుల పరిస్థితి అగమ్యగోచరం

ఎఐకెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్




**ప్రజాపక్షం/వరంగల్ :** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు వ్యతిరేక విధానాలతో రైతుల కార్మికుల పరిస్థితి ఆందోళన కరంగా మారిందని తక్షణమే నాలుగు లేబర్ కోడ్స్, నూతన విత్తన, విద్యుత్తు చట్టాలను, విబిజిరామ్‌జి పథకాన్ని ఉపసంహరించాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్), అఖిలభారత కార్మిక సంఘాల వేదిక (ఏఐసిటియు), అఖిలభారత వ్యవసాయ కార్మిక సమాఖ్య (ఏఐఏడబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన కార్మిక కర్షక కూలీల వ్యతిరేక చట్టాలను వ్యతిరేకిస్తూ తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో భారీ రాస్తారోకో నిర్వహించి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ రైతాంగం ఆరుగాలం కష్టించి పంటలు పండిస్తున్న సరైన ధర లేక మార్కెట్ దోపిడీకి గురై దివాలా తీస్తూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అలాగే కేంద్ర విద్యుత్ చట్టాన్ని తీసుకురావడం అన్యాయం అన్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో ఏఐసిటియు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నర్ర ప్రతాప్, ఏఐకేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుంబా బాబురావు, సుంచు జగదీశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు మాలోత్ సాగర్, రత్నం, పాల్గొన్నారు.

## అభివృద్ధికి తోడ్పాటు అభినందనీయం

**ప్రజాపక్షం/జనగామ:** సామాజిక బాధ్యతతో కార్పోరేట్ సంస్థలు ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తోడ్పడడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ సంస్థ రౌండ్ టేబ్ ఇండియా వారి సహకారంతో అసంపూర్తి భవనాన్ని పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినులు మెరుగైన వసతులను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ సహాయ కార్యదర్శి రామరాజు, నాగలక్ష్మి, సునీల్ కుమార్, అఖిల్, మాధవరెడ్డి, కార్తీక్, హిమబిందు, శ్రీనివాస్, రవి, పాల్గొన్నారు.

## పేదల పొట్టగొడుతున్న మోదీ ప్రభుత్వం: ఎమ్మెల్యే గండ్ర



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పునరు ద్ధరించి, విబిజి రాంజీ చట్టం గా పేరు మార్చడా న్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బట్టు కర్ణాకర్ డిమాండ్ చేశారు. శనివారం ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు జయశంకర్ భూపాలపల్లి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బట్టు కర్ణాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్యఅతిథి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని మాట్లాడుతూ, 2005లో యూపీఏ ప్రభుత్వం గ్రామీణ పేదలకు, కూలీలకు బతుకు భరోసా ఇస్తూ తెచ్చిన ఈ చట్టాన్ని కేంద్రం లో బిజెపి ప్రభుత్వం కొత్త చట్టం (విబిజిరామ్ జి )తో నిర్వీర్యం చేయడం కోసం చూస్తోందని అన్నారు. గతంలో పని అడిగిన 15 రోజుల్లోపు పని కల్పించడం చట్టపరమైన హక్కుగా ఉండేదని, కానీ కొత్త చట్టం ఆ హక్కును కాల రాస్తోందని, గ్రామ సభలకు, పంచాయతీలకు ఉన్న అధికారా లను లాగేసుకుని, ఢిల్లీ నుండి నిర్ణయాలు తీసుకునేలా మార్పులు చేశారని ఆరోపించారు. కేంద్రం నిధుల వాటాను 100 శాతం నుండి 60 శాతానికి తగ్గించి, మిగతా 40 శాతం భారం రాష్ట్రాల మీద మోపడం వల్ల నిధుల కొరత ఏర్పడి పనులు ఆగిపోయే ప్రమాదం ఉందని, ఈ చట్టాన్ని నీరుగార్చి రద్దు చేయడానికి బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో చల్లూరి మధు, జంపన్న, భువన సుందర్, పిప్పాల రాజేందర్, సుంకరి రామచంద్రయ్య, రాజేందర్, గూట్ల తిరుపతి, ఆకుతోట కుమార స్వామి కోటగిరి సతీష్, దబెట రమేష్, బౌతు రమేష్, ఇప్ప కాయల నరసయ్య, కడారి మాలతి, పద్మ, పరమేశ్వరి, రాధా, రజిత, మాజీ కౌన్సిలర్లు, సిరుపఅనిల్, ముంజల రవి, సజ్జనపు స్వామి, వెంకన్న, బౌతు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి: ఎమ్మెల్యేలు



**ప్రజాపక్షం/హనుమకొండ :** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని, వీబీ జీ రామ్ జీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ డీసీసీ భవన్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు, శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకంపై కక్షసాధింపు చర్యలకు పాల్పడడం తీవ్రంగా ఖండించదగ్గ విషయమన్నారు. పేదల కోసం రూపొందించి అమలు చేస్తున్న పథకాలను నిర్వీర్యం చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా కోట్లాది కుటుంబాలు జీవనాధారం పొందుతున్నాయని, అలాంటి పథకాలను అడ్డుకోవడం పేదల పాలిట శాపంగా మారుతుందన్నారు. పథకాల పేర్లు మార్చాలనే నెపంతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం బీజేపీ చేస్తోందని విమర్శించారు. అసలు సమస్య పరిష్కారం కాకుండా పేర్ల రాజకీయాలు చేయడం వల్ల ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతోందని చెప్పారు. గ్రామాల్లో పనులు నిలిచిపోవడంతో కూలీలు, పేద కుటుంబాలు తీరని అన్యాయాన్ని ఎదుర్కొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకే రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు జరగాల్సి ఉందని, ఆ హామీల అమలుపై కేంద్రం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీను బాబు, వెంకటేశ్వర్లు, పింగళి వెంకట్రామ్ రెడ్డి,పెరమాండ్ల రామకృష్ణ,కూచన రవళి, వీసం సురేందర్ రెడ్డి,కార్పొరేటర్లు జక్కుల శ్రీనివాస్, విజయశ్రీ రజాలి తదితరులు పాల్గొన్నారు.

## పరకాల మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరవేద్దాం

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి




**ప్రజాపక్షం/పరకాల :** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలే కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తాయని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. పరకాల పట్టణానికి మౌలిక వసతులు కల్పించి అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యం అన్నారు.శనివారం పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల సన్నాహక కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి నిర్వహించారు. అంతకుముందు కార్యకర్తలకు మున్సిపల్ ఎన్నికలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రానున్న పరకాల మున్సిపల్ ఎన్నికల్లో 22 వార్డులను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుని పరకాల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ గెలుపు కార్యకర్తలదేనని, ప్రతి ఒక్కరూ పాత కొత్త అని తేడా లేకుండా సమన్వయంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు.పార్టీ కార్యకర్తలే కాంగ్రెస్ బలమని, క్రమశిక్షణతో ముందుకు సాగాలని, పార్టీకి వ్యతిరేక కార్యక్రమాలు పాల్పడితే సస్పెండ్ చేస్తామని అన్నారు. ఇప్పటికే టియు ఎఫ్ఐడిసి నిధులతో పట్టణాన్ని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతున్నామని, గత ప్రభుత్వ పాలకులు అభివృద్ధి ముసుగులో దోచుకున్నారని అన్నారు.

## 10 పరుగుల తేడాతో..
# యుపిపై గుజరాత్ విజయం



మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్‌లో మరో ఉత్కంఠ పోరు. కానీ, ఈసారి ఛేజింగ్ టీమ్‌కు నిరాశే మిగిలింది. హోరాహోరీగా సాగిన తొలి డబుల్ హెడర్‌లో గుజరాత్ జెయింట్స్ 10 పరుగుల తేడాతో యూపీ వారియర్స్‌కు షాకిచ్చింది. భారీ స్కోర్ల నమోదైన ఈ మ్యాచ్‌లో ఫోబ్ లిచ్‌ఫీల్డ్(78) అర్ధ శతకంతో పోరాడినా డెత్ ఓవర్లలో గుజరాత్ బౌలర్లు అద్భుతంగా కట్టడి చేశారు. చివర్లో ఆశా శోభన(27 నాటౌట్) వరుసగా 6, 4తో భయపెట్టినా యూపీ జట్టుకు ఓటమి తప్ప లేదు. నాలుగో సీజన్ డబ్ల్యూపీఎల్ అంచనాలకు తగ్గట్టే ఉత్కంఠగా, ఆసక్తిగా సాగుతోంది. తొలిపోరులో చివరి బంతికి ఆర్సీబీ గెలుపొందగా.. ఈసారి యూపీ వారియర్స్ చివరి ఓవర్ వరకూ పోరాడింది. కానీ, డీవై పాటిల్ మైదానంలో 208 పరుగుల ఛేదనలో ఈ జట్టును గుజరాత్ జెయింట్స్ బౌలర్లు 197కే కట్టడి చేశారు. గుజరాత్ బౌలర్లలో రేణుకా సింగ్(2–25), జార్జియా వరేహం(2–30), సోఫీ డెవిన్(2–55)లు రెండేసి వికెట్లతో రాణించారు.

### ఒకే ఓవర్లో 2 వికెట్లు

భారీ ఛేదనలో యూపీ వారియర్స్‌కు ఆదిలోనే షాకిచ్చింది రేణుకా సింగ్. డేంజరస్ ఓపెనర్ కిరణ్ నవగిరే(1)ను ఔట్ చేసిన గుజరాత్ జెయింట్స్‌కు బిగ్ బ్రేకిచ్చింది. ఆ తర్వాత ఫోబ్ లిచ్‌ఫీల్డ్(78), మేగ్ లానింగ్(30)లు ధనాధన్ ఆడుతూ స్కోర్ బోర్డును నడిపించారు. అయితే.. వరేహం ఒకే ఓవర్లో లానింగ్, హర్లీన్ డియోల్(0)ను వెనక్కి పంపి యూపీని కష్టాల్లోకి నెట్టగా.. ఆ తర్వాత ఆల్ రౌండర్ దీప్తి శర్మ(1)ను రిటర్న్ క్యాచ్‌తో వెనక్కి పంపింది రేణుక. అంతే.. చూస్తుండగానే మూడు బిగ్ వికెట్లు పడ్డాయి.

74కే 4 వికెట్లు పడిన వేళ క్రీజులోకి వచ్చిన శ్వేత షెహ్రావత్(25) తొలి బంతినే సిక్సర్‌గా మలవగా స్కోర్ 80 దాటింది. ఆ తర్వాత గార్డ్‌నర్ ఓవర్లో రెండు ఫోర్లు, సింగిల్‌తో అర్ధ శతకం పూర్తి చేసుకుంది లిచ్ ఫీల్డ్. నేనేమీ తక్కువా అని షెహ్రావత్ 4, 6 బాదేయగా స్కోర్ వంద దాటింది. దూకుడుగా ఆడుతున్న ఈ జోడీని విడదీసిన రాజేశ్వరి గైక్వాడ్ యూపీని దెబ్బకొట్టింది. ఆ తర్వాత డియాంద్ర డాటిన్(12) బ్యాట్ ఝులిపించినా.. వికెట్ ఇచ్చేసింది. అంతే.. చివరి ఓవర్లో ఎక్లెస్టోన్ వికెట్ కోల్పోయినా.. 10 పరుగుల తేడాతో గుజరాత్ బోణీ చేసింది.

### గార్డ్‌నర్ అర్ధ శతకం

కెప్టెన్‌గా తొలి మ్యాచ్‌లోనే ఆష్ గార్డ్‌నర్(65) అర్ధ శతకంతో మెరవగా.. అనుష్క శర్మ(44) యూపీ బౌలర్లను ఉతికేసింది. వీరిద్దరూ [illegible] బౌండరీలతో విరుచుకుపడ్డారు. జార్జియా వరేహం(27 నాటౌట్), భారతి ఫుల్మలి(14 నాటౌట్)లు సైతం సిక్సర్లతో చెలరేగారు. దాంతో, నిర్ణీత ఓవర్లలో గుజరాత్ 4 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది.

## జెమ్మీకి సునీల్ సర్‌ప్రైజ్



భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ నుంచి టీమ్ ఇండియా మహిళా క్రికెట్ స్టార్ జెమీమా రోడ్రిగ్స్‌కు అరుదైన బహుమతి లభించింది. గతంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ అరుదైన బ్యాట్ ఆకారంలో ఉన్న గిటార్‌ను జెమీమాకు గవాస్కర్ బహుమతిగా ఇచ్చారు. శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఈ ప్రత్యేక బహుమతి ఇచ్చి జెమీమాను ఆశ్చర్యపరిచారు. ఇక ఈ గిటారుతో వీరిద్దరూ ఫొటోలకు ఫోజులిస్తూ సందడి చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. కాగా, గతేడాది జరిగిన మహిళల వన్డే ప్రపంచ కప్‌లో ఆస్ట్రేలియాపై సెమీఫైనల్‌లో జెమీమా 127 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడి జట్టును ఫైనల్‌కు చేర్చిన విషయం తెలిసిందే. ఆ సమయంలో టీమ్ ఇండియా కనుక కప్పు గెలిస్తే.. జెమీమా గిటార్ వాయిస్తుంటే తాను పాట పాడుతానని గవాస్కర్ వాగ్దానం చేశారు. ఇక ఫైనల్ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించి కప్పు గెలిచింది. దీంతో అప్పుడు ఇచ్చిన హామీని గవాస్కర్ ఇప్పుడు నెరవేర్చుకున్నారు.

## ఓడిన సింధు



హైదరాబాదీ స్టార్ షట్లర్ పివి సింధు.. మలేషియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో సెమీస్‌లో ఓటమి పాలైంది. చైనా క్రీడాకారిణి వాంగ్ జిహి చేతిలో ఆమె పరాజయాన్ని చవిచూసింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో వరల్డ్ నెంబర్ టూ ప్లేయర్ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. 16–21, 15–21 స్కోరుతో సింధుపై సునాయాస విజయాన్ని నమోదు చేసుకున్నది. చైనీస్ ప్లేయర్ దూకుడు ముందు సింధు తేలిపోయింది. కాలికి గాయం కావడం వల్ల గత అక్టోబర్ నుంచి ఆటకు దూరంగా ఉన్న పివి సింధు చాలా గ్యాప్ తర్వాత తొలి టోర్నమెంట్ ఆడింది. రెండో గేమ్‌లో 11–6 స్కోరుతో లీడింగ్‌లో ఉన్నా.. ఆ తర్వాత తన పట్టు కోల్పోయింది. సింధు ఓటమితో మలేషియా ఓపెన్ టోర్నీలో ఇండియన్ ప్లేయర్ల స్టోరీ ముగిసింది. వాస్తవానికి సింధు ఈ మ్యాచ్ ఆరంభంలో తన సామర్థ్యానికి తగినట్లు ఆడింది. హాఫ్ పాయింట్ చేసింది. క్రాస్ కోర్టు స్మాష్‌లతో ప్రత్యర్థిని ఇబ్బంది పెట్టింది. ఓ దశలో 5–2 తేడాతో తొలి గేమ్‌లో ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. కానీ ఆ తర్వాత వాంగ్ తన ప్రతాపాన్ని చూపించింది. 13–13 పాయింట్లతో తీవ్ర పోటీ ఇచ్చారు. ఇక 15–14 స్కోరు ఉన్నప్పుడు వాంగ్ తన ప్రతాపాన్ని చూపించింది. సింధుపై తీవ్ర వత్తిడి తెచ్చింది. ఏకధాటిగా పాయింట్లతో చెలరేగింది. ఆ జోరుకు పీవీ సింధు చేతులెత్తేసింది. రెండో గేమ్ ఆరంభంలో కూడా సింధు దూకుడుగా ఆడినా.. రెండో హాఫ్‌లో వాంగ్ తన స్ట్రోక్ ప్లేతో ప్రత్యర్థిని చిత్తు చేసింది.

# బిజినెస్

## ఈ వారం స్టాక్ మార్కెట్లు

బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ/ క్లోజింగ్): సెన్సెక్స్ 83,576.24 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 85,762.01 పాయింట్లు. నష్టం 2185.77 పాయింట్లు). జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ/ క్లోజింగ్): నిఫ్టీ 25,683.30 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 26,328.55 పాయింట్లు. నష్టం 645.25 పాయింట్లు).

(ఈ వారం భారత ఈక్విటీ మార్కెట్ అంతర్జాతీయ మొదట సానుకూల వాతావరణంలో కొనసాగినప్పటికీ, వారాంతంలో తీవ్ర పతనం తప్పలేదు. మొదటి వాణిజ్య దినం నూతన సంవత్సర మొదటి వారంలో సెన్సెక్స్, నిఫ్టీ రెండూ పూర్వ రికార్డులతో పాటు స్థిరంగా ఉన్నప్పటికీ, వారాంతంలో తీవ్ర నష్టాలు సంభవించాయి. జనవరి 4–6: సంవత్సర ప్రారంభంలో సెన్సెక్స్ 26,300కు పైగా నిఫ్టీ రంగం పాజిటివ్ భావనతో కొనసాగినప్పటికీ, మధ్యలో విశ్లేషకులు కొన్నిసార్లు స్వల్ప లాభాల వద్ద నిలిచాయి. జనవరి 7–9: వారంలో చివరి మూడు రోజుల్లో సూచీలు వరుసగా దిగిపోయాయి. ముఖ్యంగా 8వ రోజు సెన్సెక్స్ – 780 పాయింట్లతో తీవ్రత తగ్గిపోయినట్లు కనిపించింది. 9వ రోజున కూడా సెన్సెక్స్– 604 పాయింట్లతో భారీ నష్టంతో ముగిసింది. నిఫ్టీ సైతం ఇదే రీతిలో పతనాన్ని చవిచూసింది).

## స్పష్టమైన అడుగులు..

ఈ వారం తీవ్ర హెచ్చుతగ్గులతో అయోమయానికి గురైన బంగారం, వెండి మార్కెట్‌కు ఇప్పుడు స్పష్టమైన దిశ కనిపిస్తోంది. మార్కెట్ నిపుణుల అంచనాల ప్రకారం విలువైన లోహాలు కొత్త అప్‌ట్రెండ్‌లోకి ప్రవేశించే సంకేతాలు బలపడుతున్నాయి. శనివారం హైదరాబాద్ రిటైల్ మార్కెట్లో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర ఒక్కరోజులోనే రూ.1,000 పెరిగి రూ.1,29,000కు చేరగా, పౌన్ బంగారం ధర రూ.800 పెరిగి రూ.1,03,200గా నమోదైంది. వెండి ధర కిలోకు రూ.7,000 పెరిగి రూ.2,75,000కు చేరింది. ప్లాటినం 10 గ్రాములకు రూ.1,020 పెరిగి రూ.65,580గా ఉంది. అంతర్జాతీయంగా స్పాట్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ఔన్స్ ధర 4,460 డాలర్ల నుంచి 4,509 డాలర్ల వరకు ఎగబాకింది. దేశీయంగా ఎంసిఎక్స్ మార్కెట్లో కూడా బంగారం ఉదయం నష్టాలను తుడిచిపెట్టి 10 గ్రాములకు రూ.1,38,875 వద్ద ముగిసింది, వెండి రూ.2,52,002 వద్ద స్థిరపడింది. ఈ వారం మొత్తం మీద అంతర్జాతీయ మార్కెట్లో బంగారం దాదాపు 4 శాతం లాభాన్ని నమోదు చేసింది. అమెరికా డిసెంబర్ ఉద్యోగ గణాంకాలు అంచనాలకు తక్కువగా రావడం, ఉద్యోగ సృష్టి మందగించడం, ఆర్థిక మందగమన సంకేతాలు కనిపించడం వల్ల ఫెడరల్ రిజర్వ్ ఈ ఏడాది వడ్డీ రేట్లు కనీసం 50 బేసిస్ పాయింట్లు తగ్గించవచ్చన్న అంచనాలు పెరిగాయి. వడ్డీ రేట్లు తగ్గితే బంగారం వంటి వడ్డీ లేని ఆస్తులపై డిమాండ్ పెరగడం సహజం కావడంతో ధరలకు బలమైన మద్దతు లభిస్తోంది. దీనికి తోడు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కూడా పెట్టుబడిదారులను సురక్షిత పెట్టుబడుల వైపు మళ్లిస్తున్నాయి. ఈ అన్ని అంశాల సమిష్టి ప్రభావంతో సమీప కాలంలో బంగారం, వెండి ధరలు మరింత బలపడే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

## ఇక... రిస్క్ ఆధారిత బీమా

భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) రిస్క్ ఆధారిత డిపాజిట్ బీమా ప్రీమియం వ్యవస్థకు ఆమోదం తెలిపింది. దశాబ్దాలుగా అమలులో ఉన్న ఫ్లాట్‌రేట్ విధానానికి బదులుగా, బ్యాంకుల ఆర్థిక స్థిరత్వం (సౌండ్నెస్), రిస్క్ ప్రొఫైల్‌కు అనుసంధానమైన కొత్త విధానాన్ని తీసుకురానుంది. ఈ విధానం 2026–27 ఆర్థిక సంవత్సరం నుంచి అమల్లోకి వస్తుంది. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఫ్లాట్‌రేట్ ప్రీమియం విధానాన్ని రద్దు చేసి, బ్యాంకుల ఆర్థిక బలం, రిస్క్ స్థాయిని బట్టి ప్రీమియం నిర్ణయించే రిస్క్‌బేస్డ్ ప్రీమియం (ఆర్‌బిపి) మోడల్‌ను ప్రవేశపెట్టింది. 1962 నుంచి డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ (డిఐసిజిసి) ఫ్లాట్ రేట్ ఆధారిత డిపాజిట్ బీమా పథకాన్ని నిర్వహిస్తోంది. ప్రస్తుతం బ్యాంకులు ప్రతి రూ.100 అంచనా డిపాజిట్లపై 12 పైసలు ప్రీమియంగా చెల్లిస్తున్నాయి. కాగా, ఫ్లాట్‌రేట్ విధానంలో అన్ని బ్యాంకులు ఒకే రేటు చెల్లించాల్సి రావడం వల్ల, ఆర్థికంగా బలమైన బ్యాంకులు ప్రమాదకర స్థితిలో ఉన్న బ్యాంకులకు పరోక్షంగా సబ్సిడీ ఇస్తున్న పరిస్థితి ఏర్పడుతోంది. రిస్క్ ఆధారిత విధానం ద్వారా ప్రతి బ్యాంకు తన రిస్క్ స్థాయికి అనుగుణంగా బీమా ఖర్చు భరించాల్సి ఉంటుంది. దీంతో మంచి పాలన, సరిపడా మూలధనం (క్యాపిటల్ అడిక్వసీ), జాగ్రత్తైన రిస్క్ మేనేజ్‌మెంట్‌కు ప్రోత్సాహం లభిస్తుంది.ఈ మార్పు అతిగా రిస్క్ తీసుకునే ధోరణిని తగ్గించి, మార్కెట్ క్రమశిక్షణను మెరుగుపరుస్తుంది. అదే సమయంలో డిపాజిటర్ల రక్షణలో ఎలాంటి తగ్గుదల లేకుండా, దేశంలోని ఆర్థిక స్థిరత్వాన్ని మరింత బలపరుస్తుంది.




'బిజినెస్' శీర్షికన ఇస్తున్న సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పెట్టుబడులు లేదా లాభనష్టాలపై 'ప్రజాపక్షం' ఎలాంటి బాధ్యత వహించదు. నిపుణులను సంప్రదించి, మార్కెట్ తీరును సమీక్షించుకొని, వ్యక్తిగత బాధ్యతపై నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నాం.

## ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలకు సిద్ధం కండి

### హైదరాబాద్ జిల్లా సిపిఐ కార్యదర్శి స్టాలిన్ పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిపిఐ వందేళ్ల పోరాట స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలను నిర్మించి, పాలకవర్గాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పైన రాజీలేని పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ పిలుపునిచ్చారు. ఈనెల 18న ఖమ్మంలో జరగనున్న సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు ర్యాలీ, బహిరంగ సభకు లక్షలాదిగా తరలివచ్చి, జయప్రదం చేయాలని కోరారు. సిపిఐ శాతాబ్ది ఉత్సవాల ప్రచారజాత హైదరాబాద్‌లోని టోలిచౌకి లేబర్ అడ్డ నుండి శనివారం ప్రారంభమైంది. ప్రచార జాతను ఖైరతాబాద్ నియోజకవర్గంలోని గురుబ్రహ్మనగర్,యాకత్ పుర నియోజకవర్గంలోని గౌలిపుర డివిజన్ లో ఛత్రినాక చౌరస్తా ,సరళదేవి నగర్, ఐఎస్ సదన్ డివిజన్ లో సింగరేణి కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించింది. సిపిఐ వందేళ్ల ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేయాలని సిపిఐ నాయకులు ఇంటింటికి తిరిగి కరపత్రలు పంపిణీ చేశారు. కాగా ఛత్రినాక చౌరస్తాలో బహిరంగ సభకు చెందిన గోడ పత్రిక ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని, కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడులను వెంటనే రద్దుచేసి, గతంలో కార్మిక వర్గం సాధించుకున్న చట్టాలను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్వాన్ నియోజకవర్గ కార్యదర్శి షేక్ శంషుద్దీన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు అహ్మద్ ఎఐటియుసి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు అబ్బాస్,జాకీర్,కౌసర్, షఫీ,హైమద్, షాకీర్ షరీఫ్,అరుణ్ , బ్రహ్మ నగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎఐవైఎఫ్ ఖైరతాబాద్ కార్యదర్శి భగత్ సింగ్ సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సునీత, ఈశ్వరమ్మ, చెన్నమ్మ ,లావణ్య, శ్రీనివాస్, ఛత్రినాక చౌరస్తా లో జరిగిన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గడ్డమీది చంద్ర మోహన్ గౌడ్, డివిజన్ నాయకులు జి.ప్రభాకర్,నాగరాజు, అరుణ్, సాయి, తిరుపతి, దేవేందర్, అశోక్, చంద్రా యాన్ గుట్ట చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ బాధ్యులు మహమ్మద్ సలీం, కన్వీనర్ ఇమ్రాన్, సరళదేవి నగర్‌లో సిపిఐ సంతోష్ నగర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## రేషన్‌షాప్, ఇళ్ల స్థలాలు మంజూరు చేయండి

### మంత్రి పొంగులేటికి సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ వినతి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** రేషన్‌షాప్ ఏర్పాటు చేయడంతో పాటు పేదలకు ఇండ్ల స్థలాలను మంజూరు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కోరారు. ఈ మేరకు అక్కడి ఆటోనగర్ కాలనీలో సీసీరోడ్డు శంకుస్థాపనకు విచ్చేసిన మంత్రికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఏదులాపురం పాత పంచాయతీపరిధిలోని పేదలు ఇండ్ల స్థలాలు లేక ఏండ్లుగా గుడిసెలు, కిరాయి ఇళ్లలో మగుతున్నారన్నారు. అలాగే వరంగల్‌క్రాస్‌రోడ్ పరిశర ప్రాంతాల్లో రేషన్‌షాప్ లేకపోవడంతో బియ్యం కోసం అవస్థలు పడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంపటి సురేందర్, సిపిఐ మండల కార్యవర్గ సభ్యుడు దండి రంగారావు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ కార్మికులకు
# కనీస వేతనం రూ.26 వేలు

- ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి. యూసఫ్ డిమాండ్
- మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాలుగో మహాసభలను విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం / వరంగల్ :** రాష్ట్రంలో నిత్యవసర వస్తువుల ధరలు నిత్యం పెరుగుతూ ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల జీతాలు మాత్రం పెరగటం లేదని, గత 15 సంవత్సరాలుగా రాష్ట్రంలో కనీస వేతనాలను సవరించకపోవడం వలన ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేయుచున్న కాంట్రాక్ట్ శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్ అన్నారు. వరంగల్ పట్టణంలోని సిపిఐ జిల్లా కార్యాలయం తమ్మెర భవన్‌లో కలకుంట్ల రాజు అధ్యక్షతన తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 4వ మహాసభల ఆహ్వాన సంఘం సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూసుఫ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేయుచున్న కార్మికులకు కేంద్ర ప్రభుత్వం గొప్పలు చెబుతున్నప్పటికీ ఆసుపత్రుల్లో కనీస హక్కులు కానీ, చట్టాలను కానీ అమలు కావటం లేదని అందుకు ఉదాహరణ నేటికి కూడా కార్మికులకు పండగ సెలవులు, జాతీయ సెలవులు, ఆర్థిక సెలవులు అమలు కావటం లేదన్నారు.




తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మాట్లాడుతూ గత 12 సంవత్సరాల క్రితం అప్పుడున్నటువంటి రాష్ట్ర ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగి బేసిక్ వేతనం ఇవ్వాలని నిబంధన ఉన్నప్పటికీ ఆ నిబంధనలను తుంగలో తొక్కి అతి తక్కువ జీతాలు ఫిక్స్ చేయడం తీవ్ర అన్యాయమని వారు విమర్శించారు. 2004 సంవత్సరం నుండి ఔట్‌సోర్సింగ్ విధానం కొనసాగుతున్నప్పటికీ అప్పటి నుండి 2014 వరకు కూడా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగి బేసిక్ వేతనమే ఉన్నదని కెసిఆర్ ప్రభుత్వం ఆ నిబంధనలను తుంగలో తొక్కి మూడు కేటగిరీలుగా విభజించి కనీస వేతనం కూడా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు చెల్లించకుండా తీవ్ర అన్యాయాన్ని చేయడం జరిగిందన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో పనిచేయుచున్న కాంట్రాక్టు కార్మికులు 78 రకాల క్యాడర్లు ఉన్నప్పటికీ వారికి క్యాడర్ చేసి బేసిక్ వేతనం ఇవ్వాలని అనేక సంవత్సరాలుగా పోరాడుతున్న ఈ ఒక్క క్యాడర్ కూడా కనీస వేతనం అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉన్నదన్నారు. ఇఎస్ఐ ఆసుపత్రిలో పనిచేయుచున్న కార్మికులు కార్మిక శాఖ పరిధిలో ఉన్నప్పటికీ వీరికి కనీస వేతనాలు అందకుండా ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం రాబోవు రోజుల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్నటువంటి అన్ని రకాల కార్మికులకు కనీస వేతనం 26 వేలుగా నిర్ణయించకపోతే పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ కాంటాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి హసీనా బేగం, ఎఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షులు చెన్నకేశవులు, ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ కన్నా, శంకర్ సంధ్య, కాల్యాణి, లావణ్య. సతీష్, చారి, శోభ, సులోచన, వహిద్, రజిత, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం

### హలో కామ్రేడ్ ... చలో ఖమ్మం

### సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు

**ప్రజాపక్షం/అమరచింత :** కార్మిక, కర్షక, ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేసేది సిపిఐయేనని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి విజయరాములు పేర్కొన్నారు. శనివారం అమరచింత మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో మండల జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ రాములు మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదటి పార్టీ 1925 నుండి నేటి వరకు ప్రజా సమస్యలపై ఉద్యమాలు నడిపిస్తూ సిపిఐ ముందుండి పోరాటం చేస్తోందన్నారు. ఆనాడు భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాటం చేసి భూమి లేని నిరుపేదలకు భూములను పంచిన ఘనత సిపిఐకే దక్కుతుందని ఆయన తెలిపారు. సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఖమ్మంలో ఈ నెల 18న జరిగే వందేళ్ల సిపిఐ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొని ఆసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అబ్రహం, సహాయ కార్యదర్శి భాస్కర్, అమరచింత పట్టణ సమితి కార్యదర్శి రవీందర్, సభ్యులు శ్యాంసుందర్, కె. తిరుపతయ్య, కథలప్ప, నిస్సార్ , లక్ష్మీ నారాయణ, ఇజ్రాయిల్, సాలు, భారతి, గీతమ్మ, రఘు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## జన చైతన్యమే శతాబ్ది ఉత్సవాల లక్ష్యం




### ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాట కార్యాచరణ : బాగం

### ఖమ్మంలో కాగడాల ప్రదర్శన

**ప్రజాపక్షం/ ఖమ్మం :** జనచైతన్యమే లక్ష్యంగా భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో జరిగే బహిరంగ సభకు ఖమ్మం జిల్లా నుండి భారీ జన సమీకరణతో పాటు ఇంటింటికి, ప్రతి వ్యక్తికి శతాబ్ది ఉత్సవ సందేశాన్ని అందిస్తున్నామన్నారు. శనివారం శతాబ్ది ఉత్సవాల ప్రచార కార్యక్రమంలో భాగంగా కాగడాల ప్రదర్శన నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్‌లోని గిరి ప్రసాద్ విగ్రహం వద్ద నుండి ప్రారంభమైన ప్రదర్శన జెడ్‌పి సెంటర్ వరకు సాగింది. ఈ ప్రదర్శనుద్దేశించి హేమంతరావు మాట్లాడుతూ వందేళ్ల పరిణామ క్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ అనేక నిర్భందాలను ఎదుర్కొందని, 1925 డిసెంబర్ 26న సిపిఐ ఆవిర్భావం నుండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలోను తదనంతరం స్వాతంత్ర్య భారతదేశంలో నికరంగా నిలబడి ప్రజల కోసం పోరాడిన పార్టీ సిపిఐ మాత్రమేనని హేమంతరావు తెలిపారు. శతాబ్ది ఉత్సవాలు కాన్పూర్‌లో ప్రారంభమయ్యాయని ముగింపు సభలు ఖమ్మంలో జరుగుతున్నాయని, ఈ సభలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో పాటు సిపిఐ యావత్తు నాయకత్వం 45దేశాల నుండి విదేశీ ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. 19న సిపిఐ జాతీయ కార్యవర్గం, 20న భారతదేశ పరిస్థితులు వామపక్షాలు ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై సెమినార్ జరుగుతుందని, ఈ సెమినార్‌కు సిపిఐ జాతీయ కార్యదర్శి డి. రాజా, వామపక్షాల నేతలు ఎంఎ బేగి, దీపంక ర్ భట్టాచార్య, తదితరులు పాల్గొంటారని హేమంతరావు తెలిపారు. ఈ ప్రదర్శనలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్కే.జానిమియా, సిద్దినేని కరుణకుమార్, సింగ్ నర్సింహారావు, పగడాల మల్లేష్, శ్రీనివాసరావు, సాంబశివారెడ్డి, యువజన, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ ద్వారానే పేదలకు న్యాయం

### నిజామాబాద్ సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.ఓమయ్య

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** సిపిఐ ద్వారానే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని నినదించిన ఏకైక పార్టీ సిపిఐ అని సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.ఓమయ్య అన్నారు. శనివారం పార్టీ కార్యాలయ ఆవరణలో సిపిఐ వంద సంవత్సరాలు ఆవిర్భావ దినోత్సవం ముగింపు ఉత్సవాల సందర్భంగా ఛలో ఖమ్మం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిపిఐ పార్టీ ఆవిర్భవించిన అనంతరం భారతదేశ ప్రజల అభ్యున్నతి కోసం కార్మికులు, కర్షకులు, మహిళలు, విద్యార్థుల ప్రతి ఒక్కరి సమస్యలపై నిరంతరం పోరాటంతో పాటు ప్రజలందరికి కూడు, గూడు, గుడ్డ ఉండాలని, ప్రభుత్వ రంగ సంస్థలు బలోపేతం కావాలని, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్న పార్టీ సిపిఐ అని అన్నారు. తెలంగాణ ప్రాంత ప్రజలకు పది లక్షల ఎకరాల భూమి పంచిన చరిత్ర గిలిగిన పార్టీ సిపిఐ అన్నారు. ఖమ్మంలో ముగింపు ఉత్సవాలకు ఐదు లక్షల మందితో బహిరంగ సభ జరుగుతుందని, సభకు నిజామాబాద్ జిల్లాలోని ప్రజలు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు హనుమాండ్లు, అనిల్, దేవేందర్, భాగ్యలక్ష్మి , ఫెరోజ్, అలీ ఇమ్రాన్, సురేష్, భానుచందర్, రఘురాం నాయ క్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రమ జీవుల హక్కుల కోసమే ఎర్రజెండా

లారీ దెబ్బలు, తుపాకీ కాల్పులకు
రక్తంతో తడిసి పుట్టిందే కమ్యూనిజం
విడిపోతే పడిపోతాం..
ఎర్రజెండాలు ఏకం కావాలి
సిపిఐ కార్యదర్శివర్గ సభ్యుడు
చాడ వెంకట్ రెడ్డి




**ప్రజాపక్షం / రామకృష్ణాపూర్/ మంచిర్యాల :** లారీ ఛార్జీలకు, తుపాకుల కాల్పులకు రక్తంతో తడిచి పుట్టిందే కమ్యూనిజం అని, శ్రమ జీవుల హక్కుల కోసమే ఎర్ర జెండా ఆవిర్భవించిందని సిపిఐ నాయకులు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. మంచిర్యాల జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జాత ముగింపు బహిరంగ సభ రామకృష్ణాపూర్ లో శనివారం జరిగింది. చాడ వెంకట్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యద్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, ఎఐటియుసి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వాసిరెడ్డి సీతరామయ్య ముఖ్య అథిదులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ మిగతా జెం డాలు ఎవరో ఒకరు నెలకొల్పితే పుట్టాయని, ఎర్రజెండా మాత్రం మనుషుల రక్తం నుండి పుట్టిందన్నారు. శ్రమకు తగిన ఫలితం దక్కాలని, కర్షకుడిని రాజును చేయాలని, బలహీన వర్గాలను అందలం ఎక్కించి వెట్టిచాకిరీ, బానిస బతుకులకు చరమగీతం పాడాలనే సిద్ధాంతాలతో కమ్యూనిస్టు పార్టీ పుట్టిందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో బూర్జువ పార్టీలు ప్రజల హక్కులను కాలరాసేందుకు కుట్రలు పన్నుతున్నాయని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పేరు మార్చి అందులోని హక్కులను ప్రజలకు దూరం చేస్తోందని ఆరోపించారు. మత రాజకీయాలతో అధికారంలోకి వచ్చిన బిజెపి తన విధానాలు మార్చుకోవాలని హితవు పలికారు. వందేళ్ల చరిత్ర కలిగిన కమ్యూనిస్టు పార్టీతో బిజెపిని పోల్చుకోవడం సిగ్గుచేటన్నారు. విడిపోతే పడిపోతామని, ఎర్రజెండాలు అన్నీ ఏకమై ఒక్కతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్ కగార్ పేరుతో నక్సలిజాన్ని అంతం చేయాలని బిజెపి ఎంత ప్రయత్నం చేసినా సూర్యచంద్రులు ఉ న్నంత వరకు ఎర్రజెండాల పోరాటం ఉంటుందని, మనుషులు దోపిడికి గురైనంత కాలం, ఆర్తనాధాలు ఉన్నంత కాలం, ఆకలి మంటల పోరాటాలు ఉన్నంత కాలం, అనచివేతలు ఉన్నంత కాలం ప్రశ్నించే గొంతుకలుగా ఎర్రజెండాలు ఉంటాయని స్పష్టం చేశారు.రామడుగు లక్ష్మ ణ్ ఆధ్వర్యం లో చేపట్టిన ప్రచార జాత ముగింపు కార్యక్రమానికి బ్ర హ్మరథం పట్టిన ప్రజలకు, స్వాగతం పలికిన రామకృష్ణాపూర్ పట్టణ వాసులకు విప్లవాభినందనాలు తెలిపారు. ఈ నెల 18న ఖమ్మం జిల్లాలో సిపిఐ తలపెట్టిన దశాబ్ది ఉత్సవాల ముగింపు సభకు ఈ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. రాబోయే పరిషత్, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల ను భారీ సంఖ్యలో గెలిపించుకోవాలని కోరారు. అంతకుముందు జరిగిన ర్యాలీలో డప్పు చప్పుళ్లు, కోలాటాలు, నృత్యాలతో కళాకారులు అలరించగా, సేవాదళ్ వాలంటీర్లు ఎర్ర జెండాలతో కవాతు చేశారు.సిపిఐ నాయకులు బొల్లం పూర్ణిమ, మేకల దాసు, దాగం మల్లేష్, రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, ఇప్పకాయల లింగయ్య, మిట్టపల్లి శ్రీనివాస్, మిట్టపల్లి పౌల్, సిపిఐ శ్రేణులు,అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## టీకాలతోనే వ్యాధి నిరోధక శక్తి



**ప్రజాపక్షం/మంచిర్యాల :** పిల్లలకు సకాలంలో టీకాలు వేయించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ తెలిపారు. రాజీవ్ నగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మున్సిపల్ ఏరియా అంగన్వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన జెబ్ రెడ్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కోల్డ్ చైన్ సిస్టమ్, టీకాలు వేసుకునే వారి వివరాలను తనిఖీ చేశారు. అనంతరం తల్లులు, గర్భిణులకు టీకాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ముందస్తు చర్యగా టీకాలు వేయించడం వల్ల పిల్లలకు వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని సూచించారు. తల్లులు స్వచ్ఛందంగా పిల్లలను టీకాలకు తీసుకురావడం సంతోషకరమన్నారు. ఆరోగ్య కార్యకర్తలు స్వప్న, పద్మ, అపర్ణ, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మైనారిటీ గురుకుల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/మంచిర్యాల :** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన బెల్లంపల్లి మైనారిటీ బాలికల గురుకుల ప్రిన్సిపాల్‌పై తక్షణం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రిన్సిపాల్ విద్యార్థుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసి, ఎలాంటి అనుమతులు లేకుండా వారిని ఎగ్జిబిషన్‌కు తీసుకెళ్లారని ఆరోపించారు. అక్కడ ఆరోగ్యానికి హానికరమైన చైనీస్ ఫుడ్ తినిపించడం వల్ల పలువురు విద్యార్థులు వాంతులు, అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. మైనర్ బాలికల భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధ్యతారాహిత్యమని, వారికి ఏదైనా జరగరానిది జరిగితే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, భద్రత కల్పించాల్సిన గురుకులాలు అక్రమాలకు వేదికలు కాకూడదని హితవు పలికారు. వెంటనే సమగ్ర విచారణ జరిపి ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా గురుకులాలపై పర్యవేక్షణ పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో పత్రికల పాత్ర కీలకం



**ప్రజాపక్షం/నస్పూర్ :** ప్రజా సమస్యల పరిష్కారంలో పత్రికల పాత్ర ఎంతో కీలకమని నస్పూర్ సిఐ ఆకుల అశోక్ అన్నారు. శనివారం నస్పూర్ లో ప్రజాపక్షం దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు.ప్రజాస్వామ్యంలో పత్రికలు నాలుగో స్తంభంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తెస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా వ్యవహరించాలని సూచించారు. సమాజంలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను, అవినీతిని ప్రశ్నించడంలో పత్రికలు ముందుండాలని ఆకాంక్షించారు. వాస్తవాలను నిర్భయంగా రాస్తూ ప్రజలకు అండగా నిలవాలని కోరారు. ప్రజాపక్షం పత్రిక ప్రజా పక్షాన నిలుస్తూ మరిన్ని మం చి కథనాలు అందించాలని అభిలషించారు. నస్పూర్ పాత్రికేయులు నారమల్ల పురుషోత్తం, కుమ్మరి సతీష్ పాల్గొన్నారు.

## నాటు సారా అమ్మితే కేసులు తప్పవు

గుడుంబా అమ్మిన పలువురిపై కేసు చర్యలు



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ నియోజకవర్గం ఖానాపూర్,కడెం మండలాలలో ఎక్సైజ్ అధికారుల సంయుక్త దాడులు చేశారు.నిర్మల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రజాక్ ఆదేశాల మేరకు కడెం మండలంలోని పెద్దూర్ తండా,చిన్న బెల్లాల,పెద్ద బెల్లాల,ఖానాపూర్ మండలంలోని రాంరెడ్డి పల్లె,సత్తన్‌పల్లి లో అబ్కారీ అధికారులు దాడులు నిర్వహించారు.ఈ దాడులలో పెద్దూర్ తండాకు చెందిన లాకవత్ విజయ,హవహత్ అనిల్,భూక్యా నీలా బాయ్,రాంరెడ్డి పల్లెకి చెందిన భూక్యా అరవింద్ లపై కేసులు నమోదు చేశారు.వారి దగ్గర నుండి 23 లీటర్ల నాటు సారాయి స్వాధీనం చేసుకొని 800 లీటర్ల నల్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు తెలిపారు.నాటుసారాయి తయారు చేసిన,అమ్మిన రవాణా చేసిన,నల్ల బెల్లం,పటిక అమ్మిన కఠిన చర్యలు తప్పవని నిర్మల్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ రంగస్వామి తెలిపారు.ఈ దాడులలో ఆదిలాబాద్ ఎన్ఫోర్స్‌మెంట్ ఇన్స్పెక్టర్ గంగారెడ్డి,అక్బరుహుస్సేన్,నిర్మల్ ఎక్సైజ్ ఎస్ఐ అభిషేక్,డీటీఎఫ్ ఎస్ఐ సింధు,సిబ్బంది వెంకటేష్,ఇర్ఫాన్, హరీష్, రాజేందర్,నిరోషా పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/బాల్కొండ :** మండల టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేసి అకాల మరణం పొందిన ధనుంజయ్ కుటుంబానికి లక్ష ఇరవై వేల రూపాయలు ఆర్థిక సాయం జిల్లాలోని అందరూ ఏపీఓలు కలిసి గౌరవ డీఆర్డీఓ సాయ గౌడ్ చేతుల మీదుగా వారి కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ సాయగౌడ్, ఏపీఓ నారాయణ, అంబుడ్స్‌మెన్ శ్రీనివాస్, ఎంపీడీఓ విజయభాస్కర్, ఏపీఓ ఇందిరా, టెక్నికల్ అసిస్టెంట్, జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి నాగార్జున, అరవింద్, రవీందర్, వరగంగా, ఆపరేటర్ రామ, అనిల్, కిషోర్, రాజన్నర్సయ్య, గంగాధర్, నర్సయ్య, లక్ష్మీ, రాజేందర్, సురేష్, విష్ణు, పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

**ప్రజాపక్షం/కౌటాల :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల లబ్ధిని సులభంగా పొందేందుకే ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి తెలిపారు. కౌటాల మండలంలోని నాగేపల్లి గ్రామంలో శనివారం రైతుల వివరాల ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి ఫార్మర్ రిజిస్ట్రీ ఐడీ తప్పనిసరి అని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలన్నింటికీ ఈ ఐడీ అనుసంధానం చేసే అవకాశం ఉందని వివరించారు. రైతులు తమ ఆధార్ కార్డు, దానికి అనుసంధానమైన మొబైల్ ఫోన్ తీసుకువెళ్లి సంబంధిత క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద లేదా మీసేవ కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.నాగేపల్లి గ్రామ సర్పంచ్ కాపుదే బిక్కు పటేల్, మండల వ్యవసాయ అధికారి పి రామిలత, వ్యవసాయ విస్తరణ అధికారులు చౌదరి అంజన్న, ఎం రాజేశ్వర్, జి ఘనశ్యామ్, ఎస్ కల్పనా, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించాలి

సావిత్రిబాయి ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి : ఎమ్మెల్యే భూపతిరెడ్డి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఆరోగ్యవంతమైన స మా జం నిర్మించాలని సావిత్రిబాయి ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. శనివారం జిల్లా బీసీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ పురస్కారాలు 2026 కార్యక్రమం శనివారం నగరంలోని న్యూఅంబేద్కర్ భవన్‌లో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యా రు. మహిళా విద్యకు మార్గదర్శకురాలైన సావిత్రిబాయి పూలే ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, ఆరోగ్యం, యు వత నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని గుర్తు చేశా రు. 03 ఏళ్ల చిన్నారులకు పౌష్టికాహారం, పీ ప్రైమరీ స్కూళ్ల ఏర్పాటు, యువత కోసం స్కిల్ యూనివర్సిటీ, మ హిళల కోసం మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేయటం ప్రభుత్వ సంకల్పమన్నారు. గేమ్స్, జోన్ స్థాయి టోర్నమెంట్ల ద్వారా యువతను ఆరోగ్యవంతంగా ఉంచే చర్యలు చేపడుతున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పం పినా కేంద్ర ప్రభుత్వంఅడ్డుకుంటోందని విమర్శించారు. ప్రభుత్వ స్కూళ్లు, ప్రైవేట్ స్కూళ్లకు పోటీగా నిలుస్తున్నాయని, ప దవ తరగతి ఫలితాల్లో శాతానికి శాతం ఉత్తీర్ణత రావటం గర్వకారణమన్నారు. బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవపురం గోపాలకృష్ణ, అసోసియేటెడ్ అధ్యక్షులు మోహన్, కార్యనిర్వాహక అధ్యక్షులు కొట్టాల రామకృష్ణ, బీసీటీయు నాయకులు మహేందర్, విజయలక్ష్మి, స్వప్న, ప్రతిభ, నరాల సుధాకర్, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, డీఈఓ అశోక్, మాజీ జడ్పీ చైర్మన్ విఠల్‌రావు, నాయకులు రామచంద్రగౌడ్ పాల్గొన్నారు.

## బాలల సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలి

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం/మెదక్ :** బాలల సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శనివారం మెదక్ జిల్లా కేంద్రంలోని బాలల సదనాన్ని కలెక్టర్ సందర్శించారు. అక్కడి పిల్లల సౌకర్యాలు, విద్య, పోషకాహారం వంటి విషయాలు అడిగి తెలుసుకున్నారు. వారికి అందిస్తున్న మెనూ నిత్యావసర వస్తువులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలల వారి సంక్షేమం, ఉన్నత భవిష్యత్తుకు ఆసక్తిని, గమనించి వారి అభివృద్ధికి చేదోడును అందించాలని సూచించారు. బాల సదన్‌లలో నివాసం, విద్య, ఆహార పదార్థాలు నిత్యవసర వస్తువులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిపారు. వారి సమస్యలు, అవసరాలుతెలుసుకొని, బాధ్యతతో చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలల సదనం సిబ్బంది తదితరులు ఉన్నారు.



## బ్యాంకుల ప్రైవేటీకరణ ఆపాలి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** బ్యాంకుల ప్రైవేటీకరణను ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని సిపిఐ డిమాండ్ చేసింది. శనివారం ఎఐటియుసి అనుబంధ ఎఐబిఎ, యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో బ్యాంకుల పట్ల కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలను వ్యతిరేకిస్తూ జరుగుతున్న జనచైతన్య యాత్ర శనివారం నిజామాబాద్‌కు విచ్చేసిన సందర్భంగా ఎన్టీఆర్ చౌరస్తా నుంచి యూనియన్ బ్యాంకు వరకు ర్యాలీ నిర్వహించి సుధాకర్, భూ మయ్య మాట్లాడారు. ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్, లిబరలైజేషన్ విధానాలతో దేశంలో బ్యాంకులు, ప్రభుత్వరంగ సంస్థలు భ్రష్టు పట్టిపోయాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.అలీ ఇమ్రాన్, భాను, సాయగౌడ్, శుభోదు, కుషాల్, యూనియన్ బ్యాంకు నాయకులు పాల్గొన్నారు.

## హోరాహోరీగా సాగుతున్న మీడియా క్రికెట్ టోర్నమెంట్



**ప్రజాపక్షం/ముథోల్ :** నియోజకవర్గ కేంద్రమైన ముథోల్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ప్రింట్ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి.ముథోల్ నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ మండలాలకు చెందిన క్రికెట్ జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయి.శనివారం మండల మాజీ ఎంపీపీ అఫ్రోజ్ ఖాన్,బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న,నాయకులు మదన్ మోరే,లడ్డు పోతన్న,మగ్దూమ్ లు క్రీడాకారులను పరిచయం చేసుకుని టాస్ ఎగరవేసి మ్యాచ్ ను ప్రారంభించారు.అదే విధంగా పక్క రాష్ట్రమైన మహారాష్ట్రలోని పలు పట్టణాలకు చెందిన క్రికెట్ జట్లు సైతం పాల్గొంటూ గట్టి పోటీనిస్తున్నాయి. యవతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి దోహదపడతాయి.ప్రతిరోజు నాలుగు మ్యాచ్లు నిర్వహిస్తుండడంతో చూడడానికి పెద్ద సంఖ్యలో స్థానికులు వచ్చారు.క్రీడాకారులు సైతం ఎంతో ఉత్సాహంగా తమలోని క్రీడా నైపుణ్యాన్ని క్రికెట్ టోర్నీలో ప్రదర్శిస్తు ఆహా అనిపిస్తున్నారు. నిర్వాహకులు ఆశించిన స్థాయి కంటే అధిక సంఖ్యలో క్రికెట్ జట్లు టోర్నీలో భాగస్వాములు అయ్యాయి.వారం రోజులపాటు జరిగే క్రీడా సంబరా లు విద్యార్థులు,యువకులు,స్థానికుల్లో ఎంతో ఉ త్సాహాన్ని నింపింది. సెలవుల్లో మరిన్ని టోర్నీలను నిర్వహించి గ్రామీణ స్థాయి క్రీడాకారులను వెలికి తీసి జాతీయస్థాయిలో ప్రాతినిధ్యం వ హించే వేదికగా మార్చాలని స్థానికులు ఆకాంక్షించారు.నిర్వాహకులు క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను చేశారు.

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీలో అక్రమాలపై విచారణ

బిసి సంక్షేమ సంఘం డిమాండ్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా కేంద్రంగా ఏర్పడిన నాటి నుండి జిల్లా ఉపాధి కల్పన శాఖ ద్వారా ఏఏ ఉద్యోగాలకు ఎంత మంది నిరుద్యోగులకు కాల్ లెటర్లు పంపిణీ చేశారో పూర్తి వివరాలతో కూడిన శ్వేతపత్రాన్ని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. జిల్లాలో సాగుతున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ,అసలు ఈ ఉద్యోగాలు ఎవరికి ఇస్తున్నారో ఎవరికీ అర్థం కావడం లేదని విమర్శించారు.అవుట్ సోర్సింగ్ ఏజెన్సీల వ్యవహారశైలిపై ప్రభుత్వం తక్షణమే విజిలెన్స్ విచారణ చేపట్టాలని కోరారు. ముఖ్యంగా ఉద్యోగాల పేరుతో అమాయక నిరుద్యోగులను నమ్మించి మోసం చేసే దళారుల పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.అటువంటి అకమార్కులపై పి.డి.యాక్ట్ కేసులు నమోదు చేసి చర్లపల్లి ,చంచల్ గూడ వంటి జైళ్లకు పంపినప్పుడే ఇతరులకు భయం ఉంటుందని పేర్కొన్నారు.ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న అవుట్ సోర్సింగ్ నియామకాల్లో బీసీ కుటుంబాలకు చెందిన నిరుద్యోగులకు ఘోరమైన అన్యాయం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ అక్రమ నియామకాలపై త్వరలోనే బీసీ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. నిరుద్యోగుల హక్కుల కోసం బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల ఆఖరులో పెద్ద ఎత్తున దీక్ష చేపడతామని ఎంబడి చంద్రశేఖర్ హెచ్చరించారు.

## మెదక్ నుంచి కొరివిపల్లి వరకు బైక్ ర్యాలీ



**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ మాజీ ఎమ్మెల్యే,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మైనంపల్లి హన్మంతరావు 60వ పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కౌ న్సిలర్ అరునార్తి వెంకట రమణ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా కేంద్రం లోని ధ్యాన్ చంద్ చౌర స్తా నుంచి శంకరంపేట్ మండలంలోని కొరివిపల్లి గ్రామం వరకు 2000 మంది కాంగ్రెస్ పార్టీ నేతలు, యువకులతో భారీ ఎత్తున బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ బైక్ ర్యాలీలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పాల్గొన్నారు. ర్యాలీ మొత్తం హన్మంతరావుకు శుభాకాంక్షలు తెలుపుతూ హోరెత్తించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జనం మెచ్చిన నాయకుడు, జనహృదయనేత మైనంపల్లి హన్మంతరావు ప్రజల గుండెల్లో ఉంటారన్నారు. ఆపదలో ఉన్న వారికి అన్నం పెట్టే అన్న ఇలాంటి పుట్టినరోజు వేడుకలు ఆయన జీవితంలో మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటిద్దాం

ట్రాఫిక్ నిబంధనలు మన కుటుంబానికి రక్ష : జిల్లా ఎస్‌పి పరితోష్ ఫంకజ్



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ ఆదేశానుసారంగా శనివారం ఉదయం సంగారెడ్డి టౌన్ ఇన్స్పెక్టర్ సిబ్బందితో కలిసి హెల్మెట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించ కుండా విధులకు హాజరవుతున్న పోలీసు సిబ్బందికి ఫైన్ విధించడం జరిగింది. ముం దుగా ట్రాఫిక్ నిబంధనలు పోలీసులుగా మనం పాటించి ఇతరులకు చెప్పాలని అన్నారు. ఇటీవల కాలంలో అనేక మంది పోలీసులు హెల్మెట్ ధరించక రోడ్డు ప్రమాదాలకు గురైన ఘటనలు చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు. ఒక చిన్న తప్పిదం కుటుంబాన్ని రోడ్డున పడేసి పరిస్థితి తెస్తుందని హెల్మెట్ తలకు మాత్రమే కాదు మొత్తం కుటుంబానికి రక్షణ ఇస్తుందన్నారు. విధిగా హెల్మెట్ సీట్ బెల్ట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సిబ్బందికి సూచనలు చే శారు. జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానులేనని నిబంధనలు పాటించని పోలీసు సిబ్బందికి కూడా ట్రాఫిక్ చాలాన్ విధించడం జరుగుతుందన్నారు. వాహనాదారులు విధిగా ట్రాపిక్ నిబంధనలు పాటించి హెల్మెట్ సీట్ బ్లెట్ ధరించాలని మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు. అదే వేగం ప్రమాదానికి దారి తీయవచ్చునన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాద ని మైనర్లు వాహనాలు నడుపుతే సంబంధిత వాహన యజమానులు ,తల్లి దండ్రులపై చట్టరీత్య చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## ఎస్‌సి, ఎస్‌టి సర్పంచ్‌లకు సన్మానం

తెలంగాణ రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య



**ప్రజాపక్షం/కౌడిపల్లి :** ఎస్‌టి, ఎస్‌సిల సమస్యలను పరిష్కరిస్తానని ఎస్సీ, ఎస్టీ కమిషన్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు శనివారం మండల పరిధి తునికి నల్ల పోచమ్మ ఆలయ వద్ద అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు దళిత రత్న కల్లూరి సంజీవ మిత్ర బృందం ఆధ్వర్యంలో నూతనంగా గెలుపొందిన ఎస్టీ, ఎస్సీ సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హాజరయ్యారు, నల్లపోచమ్మ ఆలయ ఈవో రంగారావు పూజారుల ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణం మినీ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ నూతనంగా ఎన్నికైన సర్పంచులు ఉప సర్పంచ్లు వార్డు సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాజకీయ పదవులలో సర్పంచ్ పదవి కీలకమని సర్పంచి పదమంటే ముళ్ళ కిరీటం లాంటిదని ప్రజా సేవతోనే గుర్తింపు వస్తుందని అన్నారు. గ్రామాలలో సర్పంచులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా వచ్చే సీసీ రోడ్లే కాక నిధులు గ్రామాలలో అంగన్వాడి భవనం మహిళా సమైక్య భవనం పాఠశాలలకు ప్రహరీ గోడలు వాష్ రూమ్ లో గ్రామానికి కూరగాయల మార్కెట్ నిర్మించుకుంది వెసులుబాటు ఉందని దాన్ని వెంటనే గ్రామ పంచాయతీలో తీర్మానం చేసి ఎంపీడీవోలకు అందియాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు గ్రామ ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకోవాలన్నారు. అంబేద్కర్ రాజ్యాంగ కల్పన ద్వారానే ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యత కల్పించిందన్నారు నేను కూడా గ్రామ సర్పంచిగా చేసి గ్రామానికి అభివృద్ధి పనులు చేసి నేటికీ తన సతీమణిని ఏకగ్రీవ సర్పంచిగా చేసింది తాను చేసిన సేవల వల్లే అని గుర్తు చేశారు. అంబేద్కర్ ఓటు హక్కు ద్వారానే ప్రజాస్వామ్యంలో ఎస్టీ ఎస్సీలకు తగిన ప్రాధాన్యత కల్పించిందన్నారు. సర్పంచులు తమ గ్రామాలలో ఉత్తమ సేవలందించి ఉత్తమ సర్పంచులుగా అవార్డు తీసుకోవాలన్నారు. రాబోయే కాలంలో మరిన్ని ఉన్నతమైన పదవులలో ఉండాలని ఆకాంక్షించారు. ఎస్సై మురళి పోలీసు శాఖ వారి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతా ప్రమాణాలను అందరూ పాటించాలని హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ సందర్భంగా చైర్మన్ బక్కి వెంకటయ్యను సంఘాల నేతలు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. అనంతరం నూతనంగా గెలుపొందిన నియోజకవర్గస్థాయి సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శాలువాలతో ఘనంగా సత్కరించి మేమంటూ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కౌడిపల్లి తహసిల్దార్ కృష్ణ అంబేద్కర్ సంగం జిల్లా నాయకులు ఊరట్ల శివ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు, డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, అంబేద్కర్ జిల్లా నాయకులు తంబళ్ల బిక్షపతి, పంబల రామచందర్ ఆకుల యాదగిరి, గోవు యాదగిరి, తాళ్ల ఆనంద్ కుమార్, సర్పంచులు కుమార్, కుత్బుద్దీన్, ఆకుల కొమరయ్య, అంబేద్కర్ సంఘం నాయకులు నర్సాపూర్ నియోజకవర్గ స్థాయి సర్పంచులు, ఉప సర్పంచ్లు వార్డు సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు అవగాహన



ప్రజాపక్షం/కొత్తపల్లి:మండలంలోని నగునూరు, చామనపల్లి, మొగ్దుంపూర్ గ్రామాల్లో వ్యవసాయ అధికారులు రైతులకు రైతు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న వ్యవసాయ పథకాలు ఈ గుర్తింపు కార్డు ద్వారా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మాదాసు శీనమ్మ, ఉపసర్పంచ్ రమేష్, మండల వ్యవసాయ అధికారి బొడ్డు సత్యం, వ్యవసాయ విస్తరణ అధికారులు జాపరుల్లా, స్వర్ణలత, శ్రీలత, సుచరిత రైతులు పాల్గొన్నారు.

## వెన్నెముక సర్జరీకి భయపడాల్సిన పనిలేదు




ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:వెన్నెముక సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని, సర్జరీలకు భయపడాల్సిన పనిలేదని మెడికవర్ న్యూరో సర్జన్ డాక్టర్ రాజీవ్‌రెడ్డి అన్నారు. శనివారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్పైన్ సర్జరీలపై వివరించారు. నడుం నొప్పి వచ్చిన ప్రారంభంలోనే స్పైన్ సర్జరీ చేయించుకుంటే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. గతంలో మాదిగా స్పైన్ ఓపెన్ సర్జరీలు లేవని, ఉత్తర తెలంగాణలోనే మొదటిసారిగా మెడికవర్‌లో అత్యాధునిక ఎండోస్కోపిక్ సర్జరీ అందుబాటులోకి రావడంతో హోల్‌తో తక్కువ సమయంలో ఖచ్చితత్వంతో సర్జరీ పూర్తవుతుందన్నారు. ఒకటి రెండు రోజుల్లోనే పేషెంట్ రికవరీ ఉంటుందని, సాధారణంగా అన్ని పనులు చేసుకునే వీలు కలుగుతుందన్నారు. ఈ సర్జరీతో మజిల్ డ్యామేజ్, బోన్ రిమూవల్ చాలా తక్కువగా ఉంటుందన్నారు. ముఖ్యంగా వ్యవసాయపనులు, కూలీ పనులు చేసుకునే వారికి డిస్క్‌పై ఒత్తిడి పెరిగి లోబ్యాక్ పెయిన్‌తో బాధపడుతుంటారన్నారు. కీ హోల్ సర్జరీ వీరికి ఎంతో మేలు చేస్తుందన్నారు. తిరిగి యధావిధిగా పనులు చేసుకునేందుకు వీలు కలుగుతుందన్నారు. నడుం నొప్పిని నిర్లక్ష్యం చేయకుండా నిపుణులైన వైద్యులు, ఎండోస్కోపిక్ సర్జరీలు అందుబాటులో ఉన్న ఆసుపత్రిలో సర్జరీ చేయించుకుంటే త్వరగా కోలుకుని సాధారణ జీవితం గడపవచ్చన్నారు. ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో అనెస్థీషియా హెడ్ డాక్టర్ వినయ్, ఎమర్జెన్సీ మెడిసిన్ డాక్టర్ సత్యనారాయణ, క్రిటికల్ కేర్ నిపుణులు డాక్టర్ పల్లవి, సూపరిండెంట్ డాక్టర్ ప్రియాంక, మార్కెటింగ్ మానేజర్ కోట కర్ణాకర్, దాసరి చంద్రశేఖర్, మనోజ్ తదితరులున్నారు.

## వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా

ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : విద్యుత్ వినియోగదారులు భద్రతా నియమాలు పాటించాలని విద్యుత్ శాఖ ఏఈ దొంతి శ్రీధర్ అన్నారు. జగిత్యా ల రూరల్ మండలం మోరపల్లి గ్రామంలో శనివారం ప్రజాబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ శ్రీధర్ మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాల నివారణ చర్యలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, అందరు నాణ్యమైన విద్యుత్ వైర్లను వాడుకోవాలని, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే సంస్థ లక్ష్యమని ఏఈ శ్రీధర్ పేర్కొన్నారు. వినియోగదారులు విద్యుత్ పరంగా ప్రతి గ్రామంలో ఇంటిలోగాని అంతరాయం కలిగితే విద్యుత్ సంస్థ టోల్ ఫ్రీ నెంబర్ 1912 ను సంప్రదిస్తే త్వరతితగతిన సమస్యను పరిష్కరిస్తామని ఏఈ శ్రీధర్ ఈ సందర్భంగా తెలిపారు. మోరపెల్లి సర్పంచ్ కట్ట రాజేందర్, ఉపసర్పంచ్ అగునూరి గంగారాం, మాజీ సర్పంచ్ బోల్లే గంగారాం, మాజీ ఉపసర్పంచ్ రాజేశ్వర్ రావు, వార్డు సభ్యులు గంగాధర్, బట్టు లత వేణు, నాయకులు ముంజల శేఖర్, లచ్చన్న ఏఎల్‌ఎంలు శ్రీనివాస్, సంతోష్ ఉన్నారు.

## గంజాయిపై ఉక్కుపాదం!

యువత దూరంగా ఉండాలని డిసిపి పిలుపు

ప్రజాపక్షం/రామగుండం : గంజాయి, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని, వీటికి యువత దూరంగా ఉండాలని పెద్దపల్లి డిసిపిబి.రామ్‌రెడ్డి అన్నారు. విద్యార్థులు, యువతలో చైతన్యం, నేర నియంత్రణ ముందస్తు చర్యల్లో భాగంగా రామగుండం పట్టణం ఎస్టీ కాలనీలో మాదక ద్రవ్యాల నియంత్రణ, ట్రాఫిక్, సైబర్ క్రైమ్, ట్రాఫిక్ రూల్స్, తదితర అంశాలపై పోలీసులు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల చేకూరే నష్టాల గురించి వివరించారు. ప్రధానంగా గంజాయి సాగు, వినియోగం, రవాణాకు పాల్పడితే తీవ్రమైన శిక్షలు అనుభవించాల్సి ఉంటుందన్నారు. గంజాయి, డ్రగ్స్ వల్ల వ్యక్తిగతంగా తమకు, సమాజానికి కలిగే నష్టాలను గుర్తించాలని, వాటిని సంపూర్ణంగా నిర్మూలించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రజలతో పోలీసులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్.ఐ. సంధ్యారాణిలు పాల్గొన్నారు.

## సంకల్ప్ యాత్రను ప్రారంభించిన ఎస్ఐ శ్రీకాంత్



ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్లా:ఇన్సురెన్సు ఫర్ ఆల్ అనే నినాదంతో సంకల్ప్‌యాత్రను రాజన్నసిరిసిల్లా ఎస్ఐ శ్రీకాంత్ జెండా ఊపి ప్రారంభించారు.శనివారం టాటా ఏఐజి బ్రాంచ్ మేనేజర్స్ కాశబోయిన వీరస్వామి,కొండ ఆదర్శ్‌కుమార్ అద్వర్యంలో నిర్వహించిన సంకల్ప్‌యాత్రను సిరిసిల్లా టౌన్ ఎస్ఐ శ్రీకాంత్,ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ దిలీప్ జెండా ఊపి ప్రారంభించారు.సిరిసిల్లా బతుకమ్మ ఘాట్‌నుండి గాంధీచౌక్,అంబేద్కర్ చౌక్,గోపాల్‌నగర్ చౌరస్తా మీదుగా పాతబస్టాండ్ బజార్‌లో సంకల్ప్ యాత్ర పేరుతో పాతయాత్ర చేపట్టారు.ఈసందర్భంగా మాట్లాడుతూ రతన్‌టాటా ఆశయాల మేరకు ఇండియాలో ప్రతి ఒక్కరికి ఇన్సురెన్సు ఉండాలనే నినాదంతో ముందుకు వెళుతున్నామన్నారు.బీజిగా ఉండే జీవితంలో ఎప్పుడు,ఎలాంటి సంఘటనలు జరుగుతాయో ఊహించలేని జీవితంలో బీమాచేసి కుటుంబాలకు దీమా కల్పించాలన్నారు.కార్యక్రమంలో ట్రైనింగ్ మేనేజర్ వెంకటేష్‌వర్మ,అసిస్టెంట్ మేనేజర్‌చంద్రశేఖర్,శ్రీకాంత్, ప్రవీణ్,పార్ట్‌నర్ గూడెల్లిరాజు,సీబిఏలు గైని శ్రీకాంత్,దూలం రమేష్, వెం క ట్,నాగూర్ బిషేక్ ఆరిష్,రామకృష్ణ,రమేష్ ఎండిఆర్టి అడ్వైజర్లున్నారు.

# ఎరువుల కొరత లేకుండా తగు జాగ్రత్తలు

రాష్ట్ర శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్




ప్రజాపక్షం / హుస్నాబాద్:నియోజకవర్గంలో రైతులకు ఎక్కడ ఎరువుల కొరత లేకుండ వ్యవసాయ అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అలాగే రైతులు ఎరువుల కోసం ఎక్కడాక్యూలైన్లు కనిపించ వద్దని వ్యవసాయ అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ అదేశించారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మూడు జిల్లాల డి విఎఒ లు ఎడి లు,డిహెచ్ఎస్ ఒలుఎఇఒలు విఎఒలు, హెచ్ ఒలు ,ఎఒలు అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. మండలాల వారిగా వ్యవసాయ అధికారులను రైతులకు అందుతున్న ఎరువులు, మరియు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతులకు ఎప్పటికప్పుడు వివరించాలని కోరారు. ముఖ్యంగా రైతలకు నూతన యాంత్రీకరణ విధానం ,నూతన వరి వంగడాలు, అంతర్ పంటలు సాగుపై వారికి వివరించి అమలు చేసే విధంగా చూడాలని కోరారు. ఎరువుల ఇబ్బందులు లేకుండ గ్రామమాల్లో రైతుల వేదికలు, మహిళాసంఘాల సహకారంతో ఎరువుల పంపిణీని చేయాలని అన్నారు. త్వరలో నర్మెట్టలో నిర్మితమైన ఆయిల్‌పాంను ముఖ్యమంత్రిచే ప్రారంభిస్తారని తెలిపారు. నియోజకవర్గంలో ఆయిల్ పాం సేకరించే కేంద్రంను ఏర్పాటు చేస్తామని రైతులకు ఆయిల్ పాం సాగుపై దృష్టి సారించే విధంగా అధికారులు శ్రద్ధ పెట్టాలని కోరారు.

**హుస్నాబాద్‌లో అడవి అభివృద్ధి చేపడుతాం, ప్రభుత్వ భూములను కాపాడుకుందాం**

హుస్నాబాద్ నియోజకవర్గంలో అటవీ సంపదను అభివృద్ధిచేసి ప్రభుత్వ భూములను కాపాడుకుందామని తెలంగాణ బిసి రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడు అన్నారు. శనివారం ఆయన హుస్నాబాద్ మండల జిల్లెల గడ్డలోజిల్లా కలెక్టర్ కె హైమవతి,పి సిసిఎఫ్ సువర్ణ,డిఎఫ్ఒ పద్మజారాణి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి,అర్‌డిఒ రాంమూర్తి కమీషర్ మల్లికార్జున్, మార్కెట్ కమీటి చైర్మన్ తిరుపతిరెడ్డి, సర్పంచే స్వరూప, లతో కలిసి అర్బన్‌ఫారెస్టు పనులకు శంకుస్తాపన చేశారు. హుస్నాబాద్‌లోని ఎల్లమ్మచెరువు, మహాసముద్రంగండి, రాయికల్ వాటర్‌ఫాల్స్, సర్వాయి పాపన్న గగుట్టలను భైరవగుడి, అన్నికలిపి అర్బన్ ఫారెస్టు క్రిందికి తెచ్చి వీటితో పర్యాటక కేంద్రంగా అభివృద్ధిచేస్తామని అన్నారు.హుస్నాబాద్ అటవి ప్రాంతంగా అభివృద్ధిచెందుతే అన్నిరకాల పండ్లు, వనమూలికలను మొక్కలను నాటుతామనితెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ఒకప్పుడు అర్బన్ ఫారెస్టు అంటే హైద్రాబాద్‌కు మాత్రమే ఉండేది నేడు హుస్నాబాద్‌కు తీసుకురావడం సంతోషంగా ఉందని అన్నారు. హుస్నబాద్‌లో ఇంజనీరింగ్ కాలేజి , మెడికల్ కాలేజి, మున్సిపాలీటి,యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్‌స్కూల్, లాంటి అభివృద్ధి పనులు సకాలంలో అయితే నియోజకవర్గ రూపురేఖలు మారిపోతాయని అన్నారు.

## సింగరేణి కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం విఫలం



ప్రజాపక్షం/రామగిరి: అర్జీ త్రీ ఏరియా కేవెల్ మహేంద్ర భవన్‌లో సెంట్రల్ సెక్రటరీ జూపాక. రామచందర్ ఆధ్వర్యంలో, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బండారి. క్రాంతి అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ సింగరేణి కి చెందిన బొగ్గు విద్యుత్ ను రాష్ట్ర ప్రభుత్వం కు చెందిన విద్యుత్ సంస్థలు వాడుకొని 47 వేల కోట్ల రూపాయలు బకాయిలు పడ్డారని, వాటిని ఇంత వరకు సింగరేణి కి చెల్లించకపోవడంతో సంస్థ ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా తయారైందిని వారు తెలిపారు. దీనివల్ల సంస్థ లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఆగిపోయాయని, ముఖ్యంగా కార్మికుల కు ప్రతి నెలా వేతనాలు చెల్లింపులకు సంస్థ బ్యాంకు నుండి అప్పులు చేసి ఇవ్వడం జరుగుతుందని సంస్థ కు కొత్త గనులు వస్తేనే మనుగడ కొనసాగుతుందని, లేకుంటే సంస్థ భవిష్యత్తులో కొనసాగడం కష్టమని, కొత్త గనులు ప్రైవేటుకు ఇవ్వకుండా సింగరేణి కి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సంస్థ కు శాశ్వత మైన సీ అండ్ ఎండి డెరైక్టర్ ఫైనాన్స్‌ను నియమించక పోవడం వల్ల గుర్తింపు సంఘం ఎఐటియుసితో యాజమాన్యం అంగీకరించిన డిమాండ్ లపై అమలు కోసం సర్క్యులర్ జారీ కాకా కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని వారు పేర్కొన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం, కార్మికుల సంక్షేమం కోసం కోల్ బెల్ట్ శాసనసభ్యులు సిపిఐ ఎమ్మెల్యే కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు తప్ప ఇతర పార్టీల కు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చట్ట సభల్లో మాట్లాడకపోవడం విచారకరమని సింగరేణి లో మితిమీరిన రాజకీయ జోక్యం వల్ల సంస్థ దివాలా తీసే పరిస్థితి ఉందని గుర్తింపు సంఘం కాలపరిమితి 2026 సెప్టెంబర్ వరకు ఉన్న విషయం తెలిసి కొన్ని కార్మిక సంఘాలు కార్మికుల ను తప్పు దో వ పట్టిస్తున్నారని ఆరోపించారు. పాల్గొన్న డి ప్యూటీ జనరల్ సె క్రెటరీ ,బ్రాంచ్ సె క్రెటరీ ఎం ఆర్ సి రె డ్డి ,అసిస్టెంట్ , ట్రెజరర్ వెం కటస్వామి, ఏ రి యాలోని అన్ని గనులు డిపా ర్ట్మెంట్ లోని పిట్ సెక్రటరీలు, అసిస్టెంట్ ఫిట్ సె క్రటరీలు, షిఫ్ట్ సెక్రటరీలు, వర్క్ మెన్ ఇన్స్పె క్టర్లు, సేఫ్టీ కమిటీ ,మైన్స్ కమిటీ , టెంపుల్ కమిటీ , క్యాంటీన్ కమిటీ,యూనియన్‌డెలిగేట్స్,యూనియన్ నా య కులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అభివృద్ధి కాదు.. అన్నీ కూల్చివేతలే !

ప్రజాపక్షం/గోదావరిఖని: గత రెండేళ్ల కాలంలో రామగుండం నియోజకవర్గంలో అభివృద్ధి పూర్తిగా కుంటుబడిపోయిందని, స్థానిక ఎమ్మెల్యే దౌర్జన్య పాలన కొనసాగిస్తూ కూల్చివేతల పాలన సాగిస్తున్నారని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టాలని, బిఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, విహెచ్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వ్యాళ్ల హరీష్‌రెడ్డి అన్నారు. శనివారం గోదావరిఖనిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూల్చివేతల విషయంలో మాస్టర్ ప్లాన్ ఉండదని, ప్రజాభిప్రాయ సేకరణ ఆసలే ఉండదని, అర్ధరాత్రి బుల్డోజర్లు ఇండ్లపైకి వచ్చి అక్రమంగా కూల్చివేతలు మాత్రం చేస్తారని ఆరోపించారు. దేశంలో ఎక్కడ లేని విధంగా 46 మైసమ్మ గుళ్లు కూల్చి తీవ్ర పాపం మూటగట్టు కున్నారని, ప్రజాస్వామ్యం అంటే ఇదేనా అని ప్రశ్నించారు. రామగుండంలో ఐ.టి. టవర్ ఏర్పాటుకు రూ.25 కోట్ల నిధులు మంజూరు చేసిన వాటి జాడలేదన్నారు. రూ.15 కోట్లతో పవర్ ప్రాజెక్టు తెస్తున్నామని చెబుతున్న ఎమ్మెల్యే ఈ ప్రాంతంలో పెరుగుతున్న కాలుష్యంపై ఎందుకు మాట్లాడటం లేదన్నారు. కాలుష్యంతో నిత్యం అనేక మరణాలు సంభవిస్తున్న స్పందించడంలేదన్నారు. ఎమ్మెల్యే సతీమణికి పోలీసులు రాచమర్యాదలు చేస్తు న్నారన్నారు. ఈ సమావేశంలో నాయకు లు తస్లీమాభాను, అయిత శివ, అడ్డాల గట్టయ్య, రవినాయక్, బొబ్బిలి సతీష్, బక్కీ కిషన్, కృష్ణస్వామి, జాహీద్‌పాషా, నర్సింగ్, శ్రీనివాస్, అనుముల కళవాతి, పరుశ స్వామి, బూరుగు వంశీకృష్ణ, మెరుగు చంద్రమౌళి, పొలాడి శ్రీనివాసరావు, అల్లి గణేష్, శ్రీహరి, బోట్ల పోషం, రవి శంకర్, రొడ్డ సంపత్, మోబిన్, కొండ సురేష్, గోలి ప్రకాష్, కదర్ల శ్రీధర్, పోయిల రవి, అనిల్, అంజయ్య, షరీఫ్, యాదగిరి, చాంద్‌పాషా, రాజులు పాల్గొన్నారు.

## యువతకు స్వామి వివేకానంద ఆదర్శం

ఎమ్మెల్యే గంగుల

ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:స్వామి వివేకానంద యువతకు ఆదర్శమని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కోరారు. జనవరి 12న తెలంగాణ యువజన సమితి ఆధ్వర్యంలో నిర్వహించే వివేకానంద జయంతి ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆవిష్కరించారు. తెలంగాణ యువజన సమితి జిల్లా అధ్యక్షుడు, ఉత్తమ యువజన అవార్డు గ్రహీత సత్తినేని శ్రీనివాస్ మాట్లాడుతూ యువతకు యువసేవ పురస్కార్ 2026 అవార్డులు ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌లు హాజరు కావడం జరుగుతుందని తెలిపారు. సమితి జిల్లా యువసేవా పురస్కార్ అవార్డు కమిటీ చైర్మన్, బిఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా అధ్యక్షుడు సత్తినేని శ్రీనివాస్, తెలంగాణ యువజన సమితి జిల్లా కన్వీనర్ వొడ్నాల రాజు, జిల్లా ఉపాధ్యక్షులు జక్కని సాయిరాం, పటేల్ సుధీర్‌రెడ్డి, గంగాధర చందు, బొంకూరి మోహన్, అన్వేష్, మహేందర్, సుస్మిత, కిరణ్మయి తదితరులున్నారు.


## నేడు 'ఖని'కి రాష్ట్ర మంత్రులు రాక!



ప్రజాపక్షం/గోదావరిఖని : రాష్ట్ర ఐ.టి. ప రిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బా బు, రాష్ట్ర రెవెన్యూ, గృహా, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్‌కుమార్‌లు ఆదివారం గోదావరిఖని పర్యటనకు రానున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో భారీ బహిరంగసభలో పాల్గొననున్నారు. పలు పథకాలకు సంబంధించి అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు, రెండు పడకల గదుల ఇండ్ల పట్టాలను లబ్ధిదారులకు అందజేయనున్నారు. ఈ మేరకు శనివారం బహిరంగసభ జరిగే స్థలం, వేదిక వద్ద చేపడుతున్న ఏర్పాట్లను రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్. జిల్లా అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ, పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. కాగా, మంత్రుల పర్యటన నేపథ్యంలో బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందికి గోదావరిఖని ఎసిపి మడత రమేష్ సూచనలు చేశారు. మార్కండేయకాలనీలో పోలీసు సిబ్బందితో సమావేశమై పబ్లిక్ గ్యాలరీ, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల రాకపోకల మార్గాలు, వాహనాల పార్కింగ్, హెలిప్యాడ్ వద్ద భద్రత, భోజనాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో ఏవిధంగా విధులు నిర్వహించాలో సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఎఆర్ ఎసిపి ప్రతాప్, ఒకటో పట్టణ సిఐలు ఇంద్రసేనారెడ్డి, రవీందర్, రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, రెండో పట్టణ సిఐలు ప్రసాద్‌రావు, లింగమూర్తి, మంథని సిఐ బి.రాజు, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ రాజేశ్వర్ రావు, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, ఎస్.ఐ.లు, ఆర్.ఎస్.ఐ.లు పాల్గొన్నారు.

## కరీంనగర్ నియోజక వర్గ ఇన్‌చార్జీగా వెలిచాల

రెండు రోజుల క్రితమే కథనం రాసిన 'ప్రజాపక్షం'



ప్రజాపక్షం/కరీంనగర్:ఎట్టకేలకు కాంగ్రెస్‌లో ఉత్కంఠకు తెరపడింది. ఆ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ నియమాకం పూర్తయింది. పలువురు కీలక నేతలు ఆ పదవిని ఆశించినా అధిష్టానం మాత్రం వెలిచాల వైపే మొగ్గు చూపింది. తాజాగా వెలిచాల రాజేందర్ రావును నియమిస్తూ పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ పోస్టు గత కొంత కాలంగా ఖాళీగా ఉండటంలో పలువురు సీనియర్లు ఆ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. ఎట్టకేలకు పార్టీ సీనియర్ నాయకుడు వెలిచాల రాజేందర్ రావును నియమించడంతో ఉత్కంఠకు తెరపడినట్లయింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున కరీంనగర్ నుంచి పోటి చేసిన పురుమల్ల శ్రీనివాస్ నియోజక వర్గ ఇన్‌చార్జీ గా కొనసాగారు. కొన్ని సంఘటనల కారణంగా ఆయన సస్పెన్షన్ గురి కావడంతో అప్పటి నుంచి నియోజకవరఇన్‌చార్జీ పదవి ఖాళీగా ఉంది. కరీంనగర్ ఇన్‌చార్జీగా తమకు అవకాశమివ్వాలని పార్టీలోని సీనియర్లు కొందరు అధిష్టానాన్ని కోరినప్పటికి అధిష్టానం మాత్రం వెలిచాల వైపే మొగ్గు చూపింది. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన నియోజకవర్గ ఇన్‌చార్జీల సమీక్ష సమావేశాల్లో రాజేందర్ రావును ఆహ్వానించినప్పటికీ ఇంతకాలం అధికారిక ప్రకటన వెల్లడించలేదు. ఇదే విషయాన్ని ప్రజాపక్షం దిన పత్రిక రెండు రోజుల క్రితమే ప్రచురించింది.కరీంనగర్ నియోజక వర్గఇన్‌చార్జీ గా వెలిచాలను నియమించడంతో ఆయన వర్గీయులు, పార్టీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికలకు ముందు పార్టీ అధిష్టానం నియోజకవర్గ ఇన్‌చార్జీ గా వెలిచాలను నియమించడంతో పార్టీ శ్రేణులు హర్షం వక్తం చేస్తున్నారు. కరీంనగర్ నియోజకవర్గానికి కేంద్ర బిందువైన కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్ లో తమ సత్తా చాటి మున్సిపల్ ను కైవసం చేసుకుంటామని ధీమాను వ్యక్తం చేస్తున్నారు.

**కరీంనగర్ లో కాంగ్రెస్ కు పూర్వవైభవం తీసుకొస్తా..**

కరీంనగర్ లో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొస్తానని కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జీగా నియమితులైన వెలిచాల రాజేందర్ రావు అన్నారు. తనపై నమ్మకంతో నియోజక వర్గ ఇంచార్జీగా నియమించిన పార్టీ అధిష్టానం పెద్దలు సిఎం రేవంత్ రెడ్డికి, ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ కు, పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కు, మంత్రులకు, ఎమ్మెల్యేలకు రాజేందర్ రావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ కార్పోరేషన్ లో అత్యధిక సీట్లు సాధించి కార్పోరేషన్ పై కాంగ్రెస్ జండా ఎగుర వేస్తామని ధీమా వ్యక్తం చేశారు. డిసిసి అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఇతర నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## సమష్టి కృషితోనే యూనియన్ బలోపేతం, విలేకరుల సంక్షేమం

ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగిత్యాల జిల్లాలో విలేఖరుల సంక్షేమమే ప్రధాన ఎజెండాగా పని చేస్తామని టియుడబ్ల్యూజె ఐజెయు జగిత్యాల జిల్లా అధ్యక్షులు చీటి శ్రీనివాస రావు అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తా వద్ద గల (టియుడబ్ల్యూజె ఐజెయు) అనుబంధ ప్రెస్ క్లబ్ లో శనివారం జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాస రావు అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు.

**సమష్టి కృషితోనే యూనియన్ బలోపేతంతో పాటు విలేకరుల సంక్షేమం :**

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాస రావు మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో గత సమావేశాల్లో చర్చించిన పలు సమస్యలు ఇంకా పెండింగ్ లోనే ఉన్నాయన్నారు. కార్యవర్గ సభ్యులందరూ సమిష్టిగా కృషి చేసి యూనియన్ బలోపేతానికి సహకరించాలని ఆయన అన్నారు. జగిత్యాల జిల్లాలో ప్రతి సభ్యుడికి ఐడి కార్డులు ఇవ్వడంలో కొంత వరకు జాప్యం జరిగిందని జిల్లాలో నూతన సభ్యత్వాలు వేగవంతంగా పూర్తి చేసిన తర్వాత ఐడి కార్డులు అందజేస్తామని వివరించారు. జిల్లాలోని జర్నలిస్ట్ కుటుంబసభ్యుల కోసం హెల్త్ క్యాంపును ఏర్పాటు చేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. అనంతరం ఎంఐఎం జిల్లా అధ్యక్షునిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన లియాఖత్ అలీ మొహాసిన్ టియుడబ్ల్యూజె ఐజెయు జిల్లా కార్యవర్గాన్ని శాలువాలతో ఘనంగా సన్మానించి స్వీట్లు పంపిణి చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎంఐఎం పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాడానికి జర్నలిస్టులు సహకరించాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలు ఎంఐఎం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసి దృష్టికి తీసుకువెళ్లి సిఎం ద్వారా పరిష్కారం అయ్యేలా చూడాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జంకి సంపూర్ణ చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగుల గోపాల్ చారి, ఉపాధ్యక్షులు గడ్డల హరి కృష్ణ, హైదర్ అలీ, అల్లే రాము, కోశాధికారి సిరిసిల్ల వేణు గోపాల్, సహాయ కార్యదర్శులు గుర్రం చంద్ర శేఖర్, కోరేపు రాజ్ కుమార్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చైనా మాంజా విక్రయించినా, వాడినా కఠిన చర్యలు

కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం



ప్రజాపక్షం/కరీంనగర్:సంక్రాంతి పండుగ వేళ నిషేధిత చైనీస్ మాంజా (నైలాన్/సింథటిక్ దారం) విక్రయాలు, నిల్వ మరియు వినియోగంపై కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కఠిన ఆంక్షలు విధించింది. ఈ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, పర్యావరణానికి మరియు ప్రాణకోటికి ముప్పుగా మారిన చైనీస్ మాంజాపై పూర్తిస్థాయిలో నిషేధం అమలులో ఉందని స్పష్టం చేశారు. పదునైన నైలాన్ దారం వల్ల పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర గాయాలపాలవుతున్నారు. ముఖ్యంగా పక్షులు, మూగజీవాల ప్రాణాలకు ఇది పెను ముప్పుగా మారిందన్నారు. కమిషనరేట్ వ్యాప్తంగా చైనీస్ మాంజా అమ్మకాలను అరికట్టడానికి ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను రంగంలోకి దింపారని తెలిపారు. షాపులు, గోదాములపై నిరంతరం నిఘా ఉంచామని తెలిపారు. నిబంధనలను అతిక్రమించి చైనీస్ మాంజాను తయారు చేసినా, విక్రయించినా లేదా నిల్వ ఉంచినా అటువంటి వారిపై చట్టపరంగా కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయని కమిషనర్ హెచ్చరించారు. పతంగి ఎగురవేసేందుకు కేవలం సాధారణ కాటన్ దారాలను మాత్రమే వాడాలి. విద్యుత్ లైన్ల దగ్గర, రద్దీగా ఉండే రోడ్ల పైన మరియు జనసమ్మర్థం ఉన్న ప్రాంతాల్లో పతంగులు ఎగురవేయవద్దని సూచించారు. మీ పరిసరాల్లో ఎవరైనా చైనీస్ మాంజా విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100 కి సమాచారం అందించాలని కోరారు. వచ్చే సంక్రాంతి పండుగను ఎటువంటి ప్రమాదాలు లేకుండా, సురక్షితంగా జరుపుకోవాలని కమిషనర్ గౌష్ ఆలం ప్రజలకు పిలుపునిచ్చారు.

## 'జీరామ్ జీ' చట్టం గ్రామీణ కూలీలకు ఎంతో మేలు

ఈ చట్టంలో 120 పనిదినాలు..కూలీల వేతనాలునేరుగా బ్యాంకు ఖాతాలో జమ: మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

ప్రజాపక్షం/ సిద్దిపేట : ఉపాధి హామీ కూలీల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీరామ్ జీ చట్టం గ్రామీణ కూలీలకు ఏంతో ఉపయోగపడుతుందని హర్యాణ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయనమాట్లాడారు. గతంలో మహాత్మగాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు 100 రోజుల పని మాత్రమే కల్పించారని, అయితే జీరామ్ చట్టం ద్వారా గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు 120 రోజులు పనిదినాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే కూలీల వేతనాలు నేరుగా బ్యాంకు ఖాతాలో జమచేసే విధంగా చట్టం రూపొందించారన్నారు. ఈపథకానికి కేంద్రం 60 శాతం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు అందించేలా ఏర్పాటు చేసినట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లెబర్‌కోడ్‌ల వల్ల కార్మికులకు అనేక లాభాలు చేకూరుతాయని, ఈ కోడ్ ద్వారా పిఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు వర్తిస్తాయని ఆయన తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం విడుదల చేసిన 15వ ఫైనాన్స్ కమీషన్ నిధులు ఏంతో దోహదపడుతాయని దత్తాత్రేయ తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీకి గుర్తింపు ఉందన్నారు. భారతీయ జనాతా పార్టీని గ్రామ,గ్రామాన పరిచయం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని సూచించారు. 2040 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ పనిచేస్తున్నారని,గత పదమూడు సంవత్సరాలుగా ఒక్కరోజు కూడ విశ్రాంతిలేకుండ దేశం కోసం పనిచేస్తున్న గొప్పనాయకుడు ఆయన కొనియాడారు. బిజెపి నాయకులు బండారు దత్తాత్రేయను ఘనంగా సన్మానించారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, బిజెపి రాష్ట్ర నాయకులు వంగ రాంచంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్, తౌడుపునురి వెంకట్ పాల్గొన్నారు.

'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా విడుదలకు రెండు రోజుల ముందే ప్రీమియర్ షో టికెట్ ధరను 600గా నిర్ణయించారు. వారం రోజుల పాటు సింగిల్ స్క్రీన్లలో రూ.50, మల్టీప్లెక్స్ థియేటర్లలో రూ.100 పెంచుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతినిచ్చింది. ప్రభాస్ నటించిన రాజాసాబ్ సినిమా టికెట్ ధరల విషయంలో మీనావేశాలు లెక్కించిన ప్రభుత్వం చిరంజీవి సినిమా విషయంలో మాత్రం టికెట్ ధరలు పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది.

# ఫుల్ ఫన్..



- డైరెక్టర్ రామ్ అబ్బరాజు

శర్వానంద్ హీరోగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'నారి నారి నడుమ మురారి'. జనవరి 14న ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ రామ్ అబ్బరాజు మీడియాతో 'చిట్ చాట్' నిర్వహించారు. ఇది పండగ లాంటి సినిమానే. కాకపోతే శర్వా బైకర్. ఇంతకుముందే సినిమా విడుదల కావాల్సింది. అయితే కొన్ని కారణాలవల్ల అది వాయిదా పడింది. దీంతో మాకు సంక్రాంతికి వచ్చే మంచి అవకాశం దొరికింది. మంచి యూత్ ఫుల్ ఫన్ ఉన్న ఎంటర్టైన్మెంట్ ఇది. చిన్నప్పటి నుంచి సంక్రాంతికి ఎన్నో సినిమాలు చూస్తూ పెరిగా. ఇప్పుడు డైరెక్టర్ గా ఫస్ట్ టైం సంక్రాంతికి నా సినిమా రావడం అనేది నాకు చాలా ఆనందాన్ని కలిగిస్తోంది. క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్‌తో అందరి ఆడియన్స్‌ని అలరించడం ఇష్టం. నేను తీసిన వివాహ భోజనంబు, సామజవరగమన, ఇప్పుడు ఈ సినిమా కూడా చాలా మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్. అందరూ కలిసి హాయిగా చూసి ఎంజాయ్ చేసేలా వుంటుంది. ఇద్దరమ్మాయిలు, ఒక అబ్బాయి అంటే ట్రయాంగిల్ లవ్ స్టోరీ అని ఫీలింగు వస్తుంది. కానీ ఇందులో చాలా కొత్త పాయింట్ ఉంది. సామజవరగమన ట్రైలర్‌లో చూస్తే అసలు విషయం మేము రివిల్ చేయలేదు. ఇంటర్వెల్ దగ్గర అసలు విషయం వస్తుంది. అది ఒక కొత్తదనాన్ని తీసుకొచ్చింది. ఈ సినిమాలో కూడా ఒక కొత్త కాన్సెప్ట్ ఉంది. మేము ఇప్పుడే రివిల్ చేయడం లేదు. బిగ్ స్క్రీన్ పై చూడాల్సిందే. శర్వానంద్ బైకర్ సినిమా చేశారు. ఆ సినిమా కోసం చాలా కొత్తగా మేకోవర్ అయ్యారు. అది మాకు కలిసి వచ్చింది. మేము ఫస్ట్ ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్,తర్వాత ప్రెసెంట్ సీన్స్ చేశాం. ఆ రెండిటికీ పర్ఫెక్ట్ గా లుక్ సెట్ అయింది. రన్ రాజా రన్, ఎక్స్ ప్రెస్ రాజా, మహానుభావుడు.. తర్వాత ఆయన చేసిన ఎంటర్‌టైనర్ ఇది. చాలా ఫ్రెష్‌గా కనిపిస్తారు. నరేష్ గారు అద్భుతమైన యాక్టర్. ఆయన అన్ని రకాల పాత్రలు చేస్తూ అలరిస్తున్నారు. నా సినిమాల్లో ఫాదర్ క్యారెక్టర్స్‌కి అయిన పర్ఫెక్ట్‌గా షూట్ అయ్యారు. ఈ సినిమాలు కూడా చాలా అద్భుతంగా ఆయన పాత్ర ఉండబోతుంది.



# మేమంతా హ్యాపీగా ఉన్నాం

రెబల్ స్టార్ ప్రభాస్ 'రాజా సాబ్' శుక్రవారం థియేటర్స్‌లోకి వచ్చి బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకుంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ రిద్ధి కుమార్ మాట్లాడుతూ.. 'రాజా సాబ్' సినిమాను ప్రేక్షకులు, ఫ్యాన్స్ బాగా ఎంజాయ్ చేస్తున్నారు. మా సినిమాకు ప్రతి ఒక్కరి నుంచి దక్కుతున్న ఆదరణ చూస్తుంటే హ్యాపీగా ఉంది. ఈ సినిమా కోసం మూడేళ్ల కష్టపడ్డాం. టీమ్ మొత్తం చాలా ఎఫర్ట్స్ పెట్టింది. మా ప్రయత్నానికి రిజల్ట్ గా ప్రేక్షకులు మంచి సక్సెస్ ఇచ్చారు. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా మా మూవీని అప్రిషియేట్ చేస్తూ చాలా మెసేజ్‌లు వస్తున్నాయి అన్నారు. హీరోయిన్ నిధి అగర్వాల్ మాట్లాడుతూ.. 'రాజా సాబ్' సినిమా బ్లాక్ బస్టర్ ఓపెనింగ్స్‌తో బాక్సాఫీస్ జర్నీ స్టార్ట్ చేసింది. ప్రేక్షకులు మా సినిమాను ఇష్టపడుతున్నారు. ఈ సంక్రాంతికి పర్ఫెక్ట్ ఫ్యామిలీ మూవీ ఇది. పిల్లలతో కలిసి మీరు ఈ సినిమాను ఎంజాయ్ చేయొచ్చు. ప్రేక్షకులు 'రాజా సాబ్' కనెక్ట్ అయ్యింది. మొసలి ఎపిసోడ్ క్లైమాక్స్.. ఇలా చాలా ఎపిసోడ్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. థియేటర్స్‌లో డార్లింగ్ డార్లింగ్ అని అంతా అంటున్నారు. 'రాజా సాబ్' సక్సెస్‌తో మేమంతా హ్యాపీగా ఉన్నాం అన్నారు.

## 'రాజా సాబ్'.. తొలిరోజు రూ.112 కోట్లు

రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన 'రాజా సాబ్' మూవీ థియేటర్స్‌లోకి వచ్చి బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకుంది. ఈ సినిమాకు వరల్డ్ వైడ్ భారీ ఓపెనింగ్స్ వచ్చాయి. 'రాజా సాబ్' ప్రపంచవ్యాప్తంగా 112 కోట్ల రూపాయల గ్రాస్ వసూళ్లు దక్కించుకుంది. హారర్ ఫాంటసీ జానర్‌లో హయ్యెస్ట్ ఓపెనింగ్స్ అందుకున్న చిత్రంగా 'రాజా సాబ్' నిలుస్తోంది. ఈ చిత్రంలోని హారర్, ఫాంటసీ ఎలిమెంట్స్‌తో ఈ సినిమా తీశారు.'రాజా సాబ్' చిత్రాన్ని హారర్ ఫాంటసీ జానర్ దర్శకుడు మారుతి రూపొందించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టర్ బ్యానర్‌పై గ్రాండ్‌గా మూవీని నిర్మించారు టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రంలో ప్రభాస్ సరసన మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ అందంతో ఆకట్టుకున్నారు.

# 'మా ఇంటి బంగారం' టీజర్ విడుదల



సమంత ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం 'మా ఇంటి బంగారం'. అభిమానులు, ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ఫస్ట్ గ్లింప్స్ విడుదలైంది. ఇది హై వోల్టేజ్ యాక్షన్ డ్రామాగా మెప్పించనుంది. సమంతను సరికొత్త పాత్రలో ఆవిష్కరించారు. రాజ్ నిడిమోరు క్రియేట్ చేసిన 'మా ఇంటి బంగారం'ను నందినీ రెడ్డి డైరెక్ట్ చేశారు. 'ఓ బేబీ' తర్వాత సమంత, నందినీ రెడ్డి కాంబోలో వస్తోన్న రెండో చిత్రమిది. టీజర్‌ను గమనిస్తే కామెడీతో నవ్వించే సినిమా ఉన్నట్లుండి రియలిస్టిక్ ఫ్యామిలీ యాక్షన్ థ్రిల్లర్‌గా జరిగే మార్పును మనం స్పష్టంగా గమనించవచ్చు. టీజర్‌లో సమంతను సాధారణమైన గృహిణి పాత్రలో చూపించారు. అయితే ఆమె తన అత్తగారింటికి వెళ్లిన తర్వాత పరిస్థితులు తలకిందులవుతాయి. నవ్వుతూ మృదు స్వభావిగా కనిపించే ఆమె ఉన్నట్లుండి ఎదురుదాడి చేసేంత శక్తివంతురాలిగా మారుతుంది. ఇందులో సమత స్టైలిష్‌గా కాకుండా రియాలిటీకి దగ్గరగా ఉండేలా చూపించారు. ఆమె యాక్షన్ సన్నివేశాల్లో వేగంగా కదలటమే కాదు.. ఆమెలోని ఎమోషన్స్‌ను కూడా లోతుగా ఆవిష్కరించే ప్రయత్నం చేశారు మేకర్స్. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై సమంత రూత్ ప్రభు, రాజ్ నిడిమోరు, హిమాన్క్ దువ్వూరు కలిసి నిర్మిస్తున్నారు.

# ఎప్పటికీ గుర్తుండిపోతుంది

- అనిల్ రావిపూడి



మెగా స్టార్ చిరంజీవి అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా 'మన శంకర వర ప్రసాద్ గారు'. వెంకటేష్ ఇందులో మరో కీలకమైన పాత్రను పోషించారు. 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ అనిల్ రావిపూడి మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈసారి కొద్దిగా రిలాక్స్‌గా ఉన్నాను. నెర్వస్ పర్సంటేజ్ కొంచెం తగ్గింది. దానికి కారణం చిరంజీవి. ప్రీరిలీజ్ ఈవెంట్లో హుక్ స్టెప్ సాంగ్ రిలీజ్ చేశాం. ఆ పాటకి చిరంజీవి వేసిన డాన్స్, ఆ ఈవెంట్‌లో ఆయన ముందు నేను వెంకటేష్ చేసిన అల్లరి ఇదంతా తెలియకుండా ఒక పాజిటివ్ వైబ్ తీసుకొచ్చేసింది. దీంతో చాలా రిలాక్స్ అయ్యాను. ఆ సాంగ్ వెనుక ఒక కథ ఉంది. నిజానికి ఆ ప్లేస్‌లో ఒక మెలోడీ మాస్ ట్యూన్ అనుకున్నాము. మీసాల పిల్ల, శశిరేఖ ఈ రెండు పాటలు కూడా మెలోడీ సాంగ్స్. చిరంజీవి ఇంట్రడక్షన్ సాంగ్ కూడా మళ్లీ మెలోడీ అయితే ఎలా అని ఆలోచించాను. సాంగ్ అంత సంతృప్తికరంగా లేదని చిరంజీవికి చెప్పాను. సాంగ్ షూట్ చేస్తున్నపుడు వర్షం పడి షూటింగ్ ఆగిపోయింది. నేచర్ సిగ్నల్ ఇచ్చిందని చిరంజీవి చెప్పారు. ఆయనే సిగ్నల్ ఇచ్చారు కదా అని.. అప్పుడు ఈ సాంగ్ ని ఆలోచించడం మొదలుపెట్టాం. శశిరేఖ ప్లేస్‌లో రిలీజ్ అవ్వాల్సిన పాట ఇదే. మొత్తం షూట్ అయ్యాక లాస్ట్ షెడ్యూల్లో ఈ సాంగ్ షూట్ చేశాం. ఫైనల్‌గా మెగా మ్యాజిక్ జరిగింది. భీమ్స్ అద్భుతమైన ట్యూన్ ఇచ్చాడు. చాలా కొత్తగా చేశారు. ఆట సందీప్ ఎప్పటినుంచో చిరంజీవి పాటకి కొరియోగ్రఫీ చేయాలని చూస్తున్నాడు. ఈ సినిమాకి అవకాశం వచ్చింది. ఆ అవకాశాన్ని నిలబెట్టుకున్నాడు. అద్భుతమైన కొరియోగ్రఫీ చేశాడు. హుక్ స్టెప్ అనే పదం ఇచ్చింది పాట రాసిన రామజోగయ్య గారే. భీమ్స్ ఎక్కువగా కొత్త, లోకల్ టాలెంట్‌ని ఎంకరేజ్ చేస్తుంటాడు. సంక్రాంతికి వస్తున్నాంలో బ్లాక్ బస్టర్ పొంగల్ పాట పాడింది కూడా లోకల్ సింగర్స్. ఈ సినిమాలో మీసాల పిల్ల సాంగ్ కోసమే ఉదిత్, హుక్ స్టెప్ బాబాసాహెల్ పాడారు. కొరియోగ్రాఫర్స్‌లో భాను మాస్టర్, విజయ్, ఆట సందీప్ అద్భుతంగా ప్రూవ్ చేసుకున్నారు. మన లోకల్ టెక్నీషియన్స్ అందరు కూడా వెలుగులోకి వస్తున్నారు. చాలా ఆనందంగా ఉంది. ఇప్పటి వరకు టీజర్, ట్రైలర్లో ఎక్కడా కూడా రివిల్ చేయాలని ఒక ఎమోషనల్ పాయింట్ ఈ సినిమాలో ఉంది. అది మీరు స్క్రీన్ మీద చూడాలి. కామెడీతో పాటు ఒక బలమైన ఎమోషనల్ రైడ్ ఉంటుంది. చిరంజీవి, నయనతార, పిల్లల మధ్య వచ్చే సన్నివేశాలు చాలా హృద్యంగా ఉంటాయి. భార్యాభర్తల మధ్య ఒక సమస్య వచ్చినపుడు వాళ్ళు ఎలా దాన్ని హ్యాండిల్ చేస్తారనేది చాలా కొత్త కోణంలో ఈ సినిమాలో చూపించడం జరిగింది. అది కచ్చితంగా అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. నేను సొంత ప్రొడ్యూసర్ లాగా ఫీల్ అయి సినిమా చేస్తుంటాను. ఒక పది రూపాయలు సంపాదించకపోయిన పర్లేదు కానీ బయటకు వచ్చే సమయానికి సేఫ్‌గా ఉండాలి. ప్రొడ్యూసర్ హ్యాపీగా ఉంటే చాలు. లక్కీగా నేను చేసిన నిర్మాతలు అందరికీ రిలీజ్ ముందు రిలీజ్ తర్వాత చాలా హ్యాపీ. నేను చిన్నప్పటి నుంచి చిరంజీవి పాటలుకి డాన్స్ చేస్తూ పెరిగాను.ఆయన్ని డైరెక్ట్ చేస్తున్నప్పుడు నా ఫీలింగ్‌ని మాటల్లో చెప్పలేను. ఒక్కసారిగా నా బాల్యంలోకి వెళ్ళిపోయాను. చిరంజీవి, వెంకటేష్ అంటే నాకు చాలా గౌరవం. మా ముగ్గురు చాలా మంచి అనుబంధం ఉంది. నాగార్జునతో ఎప్పుడు సినిమా చేస్తున్నారు? అని అందరూ అడుగుతున్నారు. నేను కూడా అదే నేను అదే ఫీల్ అవుతున్నాను. ఆయనతో కూడా సినిమా చేయాలని కోరుకుంటున్నాను. ఆ సినిమా చేస్తే నలుగురు అగ్ర కథానాయకులతో సినిమా చేసిన రికార్డు నాకే ఉండిపోతుంది.

# 'శ్రీనివాసమంగాపురం' ఫస్ట్ లుక్




సూపర్ స్టార్ కృష్ణ మనవడు, దివంగత రమేష్ బాబు కొడుకు, మనహేష్ బాబు సోదరుడి కుమారుడు అయిన ఘట్టమనేని జయకృష్ణ హీరోగా పరిచయమవుతున్న సినిమా శ్రీనివాస మంగాపురం. అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అశ్వని దత్ సమర్పిస్తున్నారు. ఇటీవలే షూటింగ్ ప్రారంభించుకున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. హీరో జయ కృష్ణ ఒక చేయితో బైక్ నడుపుతూ, మరో చెయ్‌తో గన్ పట్టుకుని కలుస్తున్న పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జయకృష్ణ సరసన రాషతడని హీరోయిన్‌గా నటిస్తోంది. జీవి ప్రకాష్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని వైజయంతి ఫిలిమ్స్, స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యాక్షన్ నేపథ్యలో సాగే రొమాంటిక్ లవ్ స్టోరీగా ఈ సినిమాను అజయ్ భూపతి తెరకెక్కిస్తున్నారు. సూపర్ స్టార్ కృష్ణ వంశం నుంచి నాలోగో తరం హీరోగా వస్తున్న జయకృష్ణ ప్రతి సన్నివేశంలో చాలా బాగా నటిస్తున్నారని దర్శకుడు అజయ్ భూపతి తెలిపారు.

# ఎన్‌సిఎల్‌టి సీనియర్ కౌన్సిల్‌గా హరీష్ రెడ్డికి పదోన్నతి



ప్రజాపక్షం/హైదరాబాద్ : నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో సీనియర్ కౌన్సిల్‌గా హైదరాబాద్ మన్సూరాబాద్‌కు చెందిన సీనియర్ న్యాయవాది కె.హరీష్ రెడ్డి పదోన్నతి పొందారు. గత ఆరేళ్లుగా ఎన్‌సిఎల్‌టి కౌన్సిల్‌గా సేవలు అందిస్తున్న హరీష్‌ను సీనియర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమిస్తూ కేంద్ర న్యాయవ్యవహారాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ నుంచి కంపెనీ లా ట్రిబ్యునల్‌కు సంబంధించిన కేసులలో కేంద్ర ప్రభుత్వం తరఫున ఆయన వాదనలు వినిపిస్తారు. హరీశ్ రెడ్డికి రంగారెడ్డి జిల్లా కోర్టుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, కార్యదర్శి కార్తిక్ శుభాకాంక్షలు తెలిపారు.

# రూ.2.58 కోట్లు టోకరా

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. స్టాక్ మార్కెట్లో పెట్టుబడుల పేరిట సైబర్ నేరగాళ్ల మోసానికి తెరలేపారు. ట్రేడింగ్‌లో చిట్కాలు చెబుతామని మొదట వాట్సాప్ మెసేజ్ పంపించారు. తమ చిట్కాలు పాటిస్తే ట్రేడింగ్‌లో 500 శాతం లాభాలు వస్తాయని తెలిపారు. సెబీ సర్టిఫైడ్ డాక్యుమెంట్స్ అంటూ కొన్ని నకిలీ కాపీలను కూడా చూపించారు. ఈ విషయాలపై అవగాహన లేకపోవడంతో ఆమె తన భర్త మొబైల్ నెంబర్‌ను వాట్సాప్ గ్రూప్‌లో యాడ్ చేయించారు. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మిన బాధితురాలు భారీగా పెట్టుబడులు పెట్టారు. 19 లావాదేవీల్లో రూ.2.58 కోట్ల మేర బదిలీ చేశారు. ఆ తరువాత పెట్టుబడులను నిలిపివేయడంతో నిందితులు బెదిరింపులకు దిగారు. ఇన్వెస్ట్‌మెంట్‌ను నిలిపివేస్తే అప్పటివరకూ పెట్టిన పెట్టుబడి పోతుందని బెదిరించారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు చివరకు పోలీసులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు ప్రజలు భయపడవద్దని, అలాంటి పరిస్థితి ఎదురైనా సమయంలో డయల్ 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.




# హైదరాబాద్ బుక్‌ఫెయిర్ విజయవంతం

రికార్డు స్థాయిలో రూ.8 కోట్ల విలువైన పుస్తకాలు విక్రయం

సోషల్ మీడియా యుగంలోనూ పుస్తక పఠనం తగ్గలేదు

బుక్ ఫెయిర్ అధ్యక్షులు డాక్టర్ యాకుబ్ షేక్, కార్యదర్శి ఆర్.శ్రీనివాస్

ప్రజాపక్షం/హైదరాబాద్: దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను గత ఏడాది డిసెంబర్ 19 నుంచి 29 వరకు విజయవంతంగా నిర్వహించినట్టు హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షులు డాక్టర్ యాకుబ్ షేక్, కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ సోషల్ మీడియా యుగంలోనూ పుస్తక పఠనం తగ్గలేదని, చదువరుల సంఖ్య అంతకంతకూ పెరిగిందనడానికి హైదరాబాద్ పుస్తక ప్రదర్శనలో రూ.8 కోట్లకు పైగా విలువైన పుస్తకాలు విక్రయించడం నిదర్శనమన్నారు. ఇంత పెద్ద స్థాయిలో పుస్తకాలు అమ్ముడుపోవడం ఒక రికార్డని తెలిపారు. యువత అధిక సంఖ్యలో తరలివచ్చి పుస్తకాలు కొనుగోలు చేశారని, లిటరరీ ఫెస్టివల్ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను త్వరలో పూర్తిస్థాయి 'లిటరరీ ఫెస్టివల్'గా తీర్చిదిద్దుతామని డాక్టర్ యాకూబ్ తెలిపారు. బుక్ ఫెయిర్‌లో రూ. 1.57 కోట్ల ఆదాయం రాగా, రూ.1.31 కోట్ల ఖర్చు వచ్చిందని, వీటి వివరాలు త్వరలో అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చుతామని కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ చెప్పారు. సామాజిక బాధ్యతలో భాగంగా చేపట్టిన 'పల్లెకు పుస్తకం' కార్యక్రమం ద్వారా సేకరించిన వేలాది పుస్తకాలను గ్రామాల్లోని గ్రంథాలయాలకు అందిస్తామన్నారు. బుక్‌ఫెయిర్ నిర్వహణకు సహకరించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, భాషా సాంస్కృతిక విభాగం, సంబంధిత అధికారులు, పోలీసులు, ఇతర శాఖల సిబ్బందికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బుక్‌ఫెయిర్ ఉపాధ్యక్షులు బాల్‌రెడ్డి, బి.శోభన్ బాబు, కోశాధికారి పి.నారాయణరెడ్డి, సంయుక్త కార్యదర్శులు కె.సురేష్, ఎం.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# మేడారంలో వైద్య సేవల కోసం ఏర్పాట్లు

3 ఆసుపత్రులు, 30 మెడికల్ క్యాంపులు

జాతరకు వెళ్లే మార్గాల్లో మరో 42 క్యాంపులు

35 అంబులెన్సులు.. 3,199 మంది సిబ్బందితో వైద్య సేవలు

ఏర్పాట్లపై అధికారులతో మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష



ప్రజాపక్షం/హైదరాబాద్ : మేడారం సమ్మక్కసారలమ్మ జాతరకు వచ్చే కోట్లాది మంది భక్తులకు వైద్యపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. చిన్నపాటి అనారోగ్య సమస్య వచ్చినా తక్షణం స్పందించి వైద్యం అందించేలా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ మేరకు శనివారం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతర ఏర్పాట్లపై పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రూపొందించిన ప్రణాళికను మంత్రి పరిశీలించారు. ఇప్పటికే లక్షల మంది భక్తులు ముందస్తుగానే జాతరకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే గద్దెల వద్ద, జంపన్న వాగు సమీపంలో, ఆర్‌టిసి బస్ స్టాండ్ వద్ద 3 వైద్య శిబిరాలను ప్రారంభించామని అధికారులు మంత్రికి వివరించారు. భక్తుల సంఖ్య పెరుగుతున్నందున జాతర పరిసరాలలో మరిన్ని మెడికల్ క్యాంపులను ముందస్తుగానే ప్రారంభించాలని అధికారులకు మంత్రి సూచించారు. భక్తులు మేడారం బయలుదేరిన దగ్గరి నుంచి.. అమ్మవార్లను దర్శించుకుని క్షేమంగా ఇళ్లకు చేరేంత వరకు వైద్య సేవలు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. మేడారం చేరుకునే అన్ని రూట్లలోనూ మెడికల్ క్యాంపులు ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి ఆదేశించారు.

## 50 పడకల ప్రధాన ఆసుపత్రి ఏర్పాటు

జాతరలో అత్యవసర వైద్య సేవల కోసం మేడారంలోని టిటిడి కల్యాణ మండపంలో 50 పడకలతో కూడిన ప్రధాన హాస్పిటల్ (శ్రీ సమ్మక్క సారలమ్మ వైద్యశాల) ఏర్పాటు చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. దీనికి అదనంగా జంపన్న వాగు, ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్ద 6 పడకల సామర్థ్యంతో రెండు మినీ హాస్పిటళ్లు, జాతర పరిసరాల్లో 30 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## 8 ప్రధాన మార్గాల్లో క్యాంపులు

వివిధ జిల్లాల నుంచి భక్తులు వచ్చే 8 ప్రధాన మార్గాల్లో ఎక్కడా వైద్య సేవలకు లోటు రాకూడదని మంత్రి సూచించారు. ఇందుకోసం 42 ఎన్ రూట్ మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా హనుమకొండ–మేడారం రూట్‌లో అత్యధికంగా 9 క్యాంపులు, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే భక్తుల కోసం 6 క్యాంపులు, భద్రాచలం రూట్‌లో 5 క్యాంపులు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు.3,199 మందితో వైద్య సైన్యం గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి భారీగా వైద్య సిబ్బందిని మోహరించాలని మంత్రి ఆదేశించారు. పూర్వ వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి మొత్తం 3,199 మంది సిబ్బందిని విధుల్లోకి తీసుకున్నామని అధికారులు తెలిపారు. ఇందులో72 మంది స్పెషలిస్టులు, 42 మంది లేడీ డాక్టర్లతో కలిపి 544 మంది వైద్యులు విధుల్లో ఉంటారు. వీరికి తోడుగా 2,150 మంది పారామెడికల్ సిబ్బంది (నర్సులు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు) షిఫ్టుల వారీగా 24 గంటల పాటు సేవలు అందించనున్నారు.

## అత్యవసర సేవలకు 35 అంబులెన్సులు

గుండెపోటు, ప్రమాదాల వంటి అత్యవసర సమయాల్లో గోల్డెన్ అవర్లో చికిత్స అందించేలా 35 అంబులెన్సులను సిద్ధం చేశామని ధికారులు తెలిపారు. మెరుగైన వైద్యం అవసరమైతే పేషెంట్లను ములుగు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు, వరంగల్ ఎంజీఎంలకు తరలించాలని మంత్రి సూచించారు. ఈ రెండు హాస్పిటళ్లలో నెల రోజుల పాటు డాక్టర్లు, సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు.

## మందుల కొరత లేకుండా చర్యలు

చిన్నపిల్లల మందుల దగ్గరి నుంచి పాముకాటు విరుగుడు ఇంజెక్షన్ల వరకు 248 రకాల మందులు, సర్జికల్ సామాగ్రిని ద్వారా ముందస్తుగానే సిద్ధం చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే జనవరి 25వ తేదీ నుంచి అన్ని వైద్య శిబిరాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. తక్షణమే మేడారం వెళ్లి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్‌ను మంత్రి ఆదేశించారు.

# శాంతించని ఇరాన్

(మొదటి పేజీ తరువాయి)

తాజాగా పిలుపునిచ్చారు. 'వీధి పోరాటమే మన లక్ష్యం కాదు... సిటీ సెంటర్లు స్వాధీనం చేసుకోవాలి' అంటూ వీడియో సందేశమిచ్చారు. నా దేశానికి నేను తిరిగి వచ్చే రోజు ఎంతో దూరం లేదన్నారు. ఖమేనీకి వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలను మెచ్చుకున్నారు. 'నా ప్రియమైన సహచరులారా! మీ ధైర్యం, ఆత్మస్థైర్యం ద్వారా ప్రపంచ మన్ననలు అందుకుంటున్నారు. నాయకత్వాన్ని ఎదిరించడం అభినందనీయం. రహస్య స్థావరంలో కూర్చొని ఈ దృశ్యాలను చూసిన అధినేత వెన్నులో వణుకు పుట్టింది. మన పోరాటం తదుపరి దశలో ఆర్థిక ఒత్తిళ్లపై దృష్టి పెట్లాలి. ఇంధనం, గ్యాస్, విద్యుత్, రవాణా వంటి కీలక ఆర్థిక రంగాల ఉద్యోగులు, కార్మికులు దేశవ్యాప్త సమ్మెలకు సన్నద్ధం కావాలని కోరుతున్నా' అని పెహ్లావి పేర్కొన్నారు. శని, ఆదివారాలు సాయంత్రం 6 గంటల నుంచి పెద్ద సంఖ్యల్లో వీధుల్లోకి రావాలని, జెండాలు, చిత్రపటాలు ప్రదర్శించాలని సూచించారు. 'మన లక్ష్యం కేవలం వీధుల్లో రావడం, బలాన్ని ప్రదర్శించడమే కాదు. సిటీ సెంటర్లను మన నియంత్రణలోకి తీసుకోవడం' అని వక్కాణించారు. వేర్వేరు మార్గాల ద్వారా నగరాల్లో ప్రధాన కేంద్రాలకు కదం తొక్కాలని పిలుపునిచ్చారు. త్వరలోనే దేశానికి వస్తున్నా.. మీతో కలిసి పయనిస్తా అంటూ వీడియోలో పేర్కొన్నారు.

## చిక్కుల్లో ఇరాన్ : ట్రంప్

ఇరాన్ పెద్ద సమస్యలో చిక్కుకున్నదని ట్రంప్ అన్నారు. ఆందోళనకారులపై కాల్పులు జరిపితే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని, సైనిక దాడులు చేస్తామని మరోమారు ఇరాన్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 'ఇరాన్ చిక్కుల్లో పడింది. కొన్ని నగరాలను ప్రజలు స్వాధీనం చేసుకుంటున్నట్లు కనిపిస్తోంది. కొన్ని వారాల ముందు ఈ స్థాయి ఉద్రిక్తతలు నెలకొంటాయని ఎవరూ ఊహించలేదు' అని ట్రంప్ అన్నారు. చాలా ప్రమాదకరమైన ప్రాంతంగా ఇరాన్ ఉందని, ఆందోళనకారులంతా క్షేమంగా ఉంటారని ఆశిస్తున్నానని అమెరికా అధ్యక్షుడు చెప్పుకున్నారు.

# భారీ ఆపరేషన్

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఆపరేషన్ జరిగింది. గత కొంతకాలంగా ఈ సర్వే నెంబర్‌లోని భూమిపై అక్రమ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు, తప్పుడు పత్రాలతో సుమారు 43 ఎకరాల భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు హైడ్రా గుర్తించింది. ఈ వ్యవహారంలో ఇప్పటికే సంబంధిత సబ్ రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు పడటం గమనార్హం. విచారణ అనంతరం ఆక్రమణకు గురైన 15 ఎకరాలకు పైగా భూమిని స్వాధీనం చేసుకుని, దాని చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు గతంలోనే ఇదే సర్వే నెంబర్‌లో 5 ఎకరాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే మియాపూర్ బాచుపల్లి ప్రధాన రహదారి సమీపంలో చెరువు కట్టపై అక్రమంగా నిర్మించిన 18 షెట్టర్లను కూల్చివేశారు. సర్వే నెంబర్ 159కి చెందిన పత్రాలను చూపిస్తూ, సర్వే నంబర్ 44లోని ఎకరంన్నర భూమిని కబ్జా చేసిన ఇమ్రాన్ అనే వ్యక్తిపై అధికారులు ఇప్పటికే కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న భూమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేస్తూ హైడ్రా అధికారులు అక్కడ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములను కాపాడటంలో హైడ్రా ప్రదర్శిస్తున్న వేగం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోట్లాది రూపాయల విలువైన ప్రజా ఆస్తిని కబ్జాదారుల నుంచి విడిపించడం పట్ల అధికారులపై ప్రశంసలు కురుస్తున్నాయి.

## రాంపల్లిలో 4 ఎకరాల భూమి జలమండలి స్థలం స్వాధీనం

ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయంగా దూసుకుపోతున్న హైడ్రా తాజాగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో జలమండలికి చెందిన భూమిని కాపాడింది. కీసర మండలం రాంపల్లి గ్రామ పరిధిలో అన్యాక్రాంతం కాకుండా జలమండలికి చెందిన సుమారు 4.01 ఎకరాల భూమిని హైడ్రా అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. రాంపల్లి గ్రామం సర్వే నెంబరు 388లో 4.01 ఎకరాల భూమిని ప్రభుత్వం జలమండలి అవసరాల కోసం కేటాయించింది. అయితే, ఈ భూమిని స్వాధీనం చేసుకునే క్రమంలో అధికారులకు స్థానికుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. జలమండలి అధికారులు ప్రహరీ గోడ నిర్మించేందుకు ప్రయత్నించగా, స్థానికులు పనులను అడ్డుకుంటూ ఆటంకాలు సృష్టించారు. భూమి స్వాధీనంలో ప్రతిష్టంభన ఏర్పడటంతో జలమండలి అధికారులు హైడ్రా సహాయాన్ని కోరారు. సంబంధిత శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో భూమిని పరిశీలించింది. రెవెన్యూ రికార్డులను తనిఖీ చేసి, సదరు భూమి జలమండలికి కేటాయించిన ప్రభుత్వ స్థలంగా ధృవీకరించుకుంది. శనివారం భారీ భద్రత మధ్య 4.01 ఎకరాల భూమి చుట్టూ ఫెన్సింగ్ వేయించింది. అక్కడ వివాదాలకు తావులేకుండా, అది 'జలమండలికి చెందిన భూమి' అని స్పష్టం చేస్తూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com